ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 15.03.2026 | సంపుటి :12 సంచిక : 235 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



సచివాలయంలో ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షలో సమావేశంలో గ్యాస్ సరఫరాపై చర్చిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

# డొమెస్టిక్ గ్యాస్ కొరత లేదు

## డిమాండ్ మేరకు సరఫరా చేస్తాం
## కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు

- కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించినా.. బ్లాక్ మార్కెట్ చేసినా కఠిన చర్యలు
- కమర్షియల్ సిలిండర్లలో కొంత లోటు
- సామాజిక మాధ్యామాల్లో దుష్ప్రచారం
- ఎల్పీజి డిస్ట్రిబ్యూటర్స్‌తో మంత్రి ఉత్తమ్ సమీక్ష
- ప్రజలు సంయమనంతో ఉండాలని సూచన

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఉందం టూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వా ర్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంత రాయం లేదని, కేవలం కమర్షి యల్ సిలిండర్ల విషయంలోనే కొంత కొరత ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కు మార్ రెడ్డి స్పష్టం చేశారు. ఉందని చెప్పారు. అ యినా ఎవరూ ఆందోళన చెందా ల్సిన అవసరం లేదని.. అవసరంగ లేకున్నా ముందస్తుగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని ఉత్తమ్ సూచించారు. కావాలని గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్పీజీ ఆయిల్ సరఫరా సంస్థలతో సమీక్షించిన మంత్రి ఉత్త మ్..' ప్రస్తుత పరిస్థితులపై నిన్న అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో మిగతా 2లో..

## దేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు

- పెట్రోల్, డీజిల్ కొరత లేదు
- బాటిళ్లలో సరఫరా చేస్తే కఠిన చర్యలు
- ఇంధన సరఫరాలపై పెట్రోలియం శాఖ కీలక ఆదేశాలు జారీ
- ఢిల్లీలో కట్టెల పొయ్యిలకు అనుమతి
- కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ(జనంసాక్షి): పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారానికి తెరదించేందుకు కేంద్ర ప్రభు త్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ముం దు జాగ్రత్తగా పెట్రోల్ , డీజిల్ ను.. సీసా లు, డబ్బాలు లాంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై మిగతా 2లో..

## కావాలనే గ్యాస్ కొరతను సృష్టిస్తున్నారు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

2లో..

# ప్రభుత్వ పనితీరు మెరుగుపడేందుకు జనగణనే కీలకం

## తెలంగాణలో మే 11 నుంచి జూన్ 09 వరకు తొలిదశ లెక్కింపు

- రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారి ప్రక్రియ
- డిజిటల్ మోడ్‌లో జనగణన చేపట్టేందుకు ఆఫ్‌లైన్ మోడ్‌లో పనిచేసే యాప్ వినియోగం
- జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి



హైదరాబాద్(జనంసాక్షి): అన్ని శాఖల్లో పురోగతి రావాలన్నా, అభివృద్ధి జరగాలన్నా, ప్రభుత్వం ఉపయోగకరమైన పాలసీలు చేయాలన్నా ముఖ్యమైనది జనగ ణన మాత్రమేనని జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి పేర్కొన్నారు. 2026 మే 11 నుంచి తొలిదశ జనాభా లెక్కలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మీడియా ఓరియెంటేషన్ కార్య క్రమం నిర్వహించారు. మిగతా 2లో..



## టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యం

- డిజిటల్ ఎకానమీకి సాంకేతిక సహకారం
- మంత్రి శ్రీధర్ బాబుతో ఆ దేశ బృందం భేటీ

హైదరాబాద్(జనంసాక్షి): టాంజానియా తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజిటల్ ఎకాన మీగా మారాలన్న టాంజానియా లక్ష్యానికి సాంకేతిక సహకారం అందించడానికి తెలం గాణ ముందుకు వచ్చింది. టాంజానియా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ అయ్యారు. ఈ సమావేశం లో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసు కున్నారు. డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్ ఇన్నో వేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై సహకారం పెం చాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. టాం జానియాలో ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ఏర్పా టు చేసే అవకాశాలపై అధ్యయనం చేయను న్నారు. తెలంగాణ 'మీ సేవ' మోడల్ ద్వారా పౌర సేవల డెలివరీ విధానంపై మార్గదర్శ కత్వం అందించాలని మిగతా 2లో..



విద్యుత్ వినియోగంలో
## ఆల్‌టైమ్ రికార్డ్

రాష్ట్రంలో 13న 341 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం

హైదరాబాద్(జనంసాక్షి): విద్యుత్ వినియోగంలో తెలంగాణ ఆల్ టైమ్ రికార్డు నమోదు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 13న (శుక్రవారం) 341 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. మరోవైపు భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

## నిర్భయ ఫండ్ కింద దేశవ్యాప్తంగా 10 జిల్లాల ఎంపిక

- తెలంగాణ నుంచి ములుగు జిల్లాకు అవకాశం
- కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవికి మంత్రి సీతక్క కృతజ్ఞతలు

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాల ఆర్థికాభివృద్ధికి క్రెష్ సెంటర్లు చాలా అవసరమని తెలంగాణ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క వివరించా రు. అంగన్వాడీ కేం ద్రాల్లో చిన్నపిల్లల సంరక్షణ కోసం గ్రామాల్లో క్రెష్ సెంటర్లు ఏర్పా టు చేసినట్లు తెలిపారు. ప్ర స్తుతం క్రెష్ సెంటర్ వర్కర్లకు రూ.5వేలు మాత్రమే వేతనం ఉండ టంతో సిబ్బంది కొరత ఏర్ప డుతోందని.. దీంతో వేతనాలు పెంచాలని కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవిని కోరినట్లు మంత్రి సీతక్క తెలిపారు.

3లో..

## మూసీతో నల్గొండకు
# నరకయాతన

- మూసీలో మంచినీరు పారేలా చేస్తామంటే అడ్డుకోవడమేంటి
- మంచిపనికి విపక్షాలు సహకరించాలి: మంత్రి కొమటిరెడ్డి



హయత్ నగర్(జనంసాక్షి): హయత్ నగర్, ఇబ్ర హీం పట్నం, ఎల్బీనగర్ వాసులకు హైదరాబాద్ - విజ యవాడ రహదారి విస్తరణతో కోకాపేట లాంటి డిమాండ్ రాబోతుందని మంత్రి కోమట రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యా మ్నాయ సిటీగా ఫ్యూచర్ సిటీనీ నిర్మిస్తున్నామని, ఇక్కడ నుండే చెన్నై, బెంగళూరు, ముంబై పూణెను కలుపుతూ హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్, హైవే మిగతా 2లో..

## మూసీ మురికికి కాంగ్రెస్‌దే బాధ్యత

- పేదల ఇళ్లు కూల్చి ప్రాజెక్ట్ చేపట్టడం అవసరమా?
- గాంధీ విగ్రహం వద్దని ఆయన మునిమనవడే చెప్తున్నాడు
- కానీ ముఖ్యమంత్రి వినడం లేదు:కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): మూసీ సుందరీకరణ పేరుతో పేద ప్ర జల ఇళ్లు కూలగొట్టి.. భూములు లా క్కోవాలని సీఎం రేవంత్ రెడ్డి చూస్తు న్నాడని కేటీఆర్ విమర్శించారు. మేధా వులు అడ్డు చెబుతున్నా సరే మొండిగా ముందుకెళ్లాలని భావిస్తున్న రేవంత్ తీరుపై యన భగ్గుమన్నారు. గాంధీ పేరు చెప్పి ఇండ్లు మిగతా 2లో..



## హర్మూజ్ దాటిన భారత నౌకలు

- సురక్షితంగా జలసంధిని గుండా ప్రయాణించిన భారత పతాకాలు ఉన్న 2 'ఎల్పీజీ' నౌకలు
- ఇరాన్ సహకారంతో సురక్షితంగా నౌకాయానం: కేంద్రం
- రెండు మూడు రోజుల్లో గుజరాత్ తీరానికి..
- ఎల్పీజీ ఆందోళనల నేపథ్యంలో తాజా పరిణామంతో భారీ ఊరట

టెహ్రాన్(జనంసాక్షి): హర్మూజ్ జలసంధికి ఇరు వైపులా వందలాది నౌకలు చిక్కుకుపోగా.. ఈ మార్గంలో భారత నౌకలు వెళ్లేందుకు అను మతిస్తామని ఇరాన్ పేర్కొన్న విషయం తెలిసిం దే. ఈక్రమంలో రెండు భారత జెండాలు ఉన్న ఎల్పీజీ నౌకలు శనివారం ఉదయం సురక్షి తంగా హర్మూజ్ జలసంధిని దాటాయని భా రత ప్రభుత్వం వెల్లడించింది. 'శివాలిక్', 'నం దాదేవి' పేరు గల నౌకలు మిగతా 2లో..

# ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి

- మొజ్తబా ఆచూకీ చెబితే.. .రూ.93కోట్లు
- రివార్డ్ ఫర్ జస్టిస్ ప్రకటించిన అమెరికా
- యురేనియం నిల్వలను రష్యాకు తరలింపు
- పుతిన్ ప్రతిపాదనను తిరస్కరించిన ట్రంప్
- మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ ప్రభావం
- ఎయిర్ స్పేస్ మూసివేతతో ఇక్కట్లు
- 13 అంతర్జాతీయ విమానసర్వీసులు రద్దు

టెహ్రాన్(జనంసాక్షి): ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యంగా.. ఖర్గ్ ఐలాండ్ పై అమె రికా దళాలు దాడులు చేశాయి. ఆ ద్వీపంలోని సైనిక స్థావరాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. తాజా గా ఈ దాడులను ఇరాన్ కూడా ధ్రువీకరించింది. అయితే, చమురు మౌలిక సదుపాయాలకు ఎ లాంటి హాని కలగలేదని వెల్లడించింది. ఈ దా డిని తీవ్రంగా ఖండిస్తూ.. యూఎస్‌కు గట్టి హెచ్చ రికలు చేసింది. ఇరాన్ మీడియా ప్రకారం.. ఖర్గ్ ఐలాండ్‌పై జరిగిన దాడుల గురించి ఇరాన్ సాయుధ దళాల కార్యాలయం ప్రతినిధి ఓ ప్రకటనలో స్పందించారు. 'మా చమురు మౌలిక సదుపాయాలపై జరిగే ఏ దాడినైనా తీవ్రంగా పరిగణిస్తాం. అలా చేస్తే ఈ ప్రాంతంలో అమెరికాతో సంబంధం ఉన్న చమురు కంపెనీల మౌలిక సదుపాయాలు తుడిచిపెట్టుకుపోతాయి. వాటిని బూడిద కుప్పలుగా మార్చేస్తాం' అని హె చ్చరించారు. ఇక, ఇరాన్ చమురుకు వ్యూహాత్మక హబ్ అయిన ఖర్గ్ మిగతా 2లో..




ఇరాన్‌లోని ఖర్గ్‌ఐలాండ్‌లో అమెరికా క్షిపణిదాడులతో అమలుకున్నపొగ

## అమెరికా పెట్టుబడులు పెట్టిన చోట సర్వనాశనం చేస్తాం

- అగ్రరాజ్యానికి ఇరాన్ గట్టి హెచ్చరిక
- ఇరాక్‌లోని అమెరికా ఎంబసీపై క్షిపణి దాడి..
- సౌదీ బేస్‌పై దాడిలో ఐదు అమెరికా రీఫ్యూయలింగ్ విమానాలు ధ్వంసం



2లో..

## 50 ఏళ్ల లోపు మహిళలకు అనుమతిలేదు

శబరిమలలో మహిళలకు ప్రవేశంపై సుప్రీంకు నివేదించిన కేరళ ప్రభుత్వం

## పెళ్లికి నిరాకరించిందని యువతికి ఎయిడ్స్ ఇంజెక్షన్

ప్రేమ పేరుతో ఎయిడ్స్ రోగి ఘాతుకం

దుండగుడి అరెస్టు..

## బండి సంజయ్ పాదయాత్రలో అపశృతి

తేనెటీగల దాడి..

పలువురికి గాయాలు

వివరాలు 2వ పేజీలో..

# యుద్ధ ప్రాతిపదికన సంక్షేమ వసతి గృహాలు

- ఇప్పటికే భవన నిర్మాణాలు 80% పూర్తి
- మరమ్మతుల బిల్లులు ప్రతి 15 రోజులకు క్లియర్ చేస్తాం
- ఉపాధి హామీ కింద మెడిసినల్ ప్లాంట్స్ పెంచండి
- పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే ప్రజలు అడవిని కాపాడుతారు
- వారసత్వంగా ఉన్న ఆలయాలను అభివృద్ధి చేయండి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్(జనంసాక్షి): సంక్షేమ వసతి గృహాల కోసం నిర్మిస్తున్న భవనాల్లో 80 శాతం పూర్తయిన వాటిని యుద్ధ ప్రతిపదికన రాబోయే మూడు నెలల్లో పూర్తిచేసి రానున్న విద్యా సంవత్సరంలో అందుబాటులోకి తీసు కురావాలని సంక్షేమ శాఖ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశిం చారు. శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి ఆయా సం క్షేమ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలను సమీ క్షించారు. తదుపరి వైద్య, ఆరోగ్యశాఖ, దేవా దాయ శాఖ అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. మిగతా 2లో..

భారత్‌పై యుద్ధప్రభావం లేకుండా
# పటిష్టచర్యలు

- దేశ ప్రయోజనాలకు భిన్నంగా కాంగ్రెస్ వైఖరి
- గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్న పార్టీ
- అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు



గౌహతి(జనంసాక్షి): మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా ఏమాత్రం బాధ్యతలేని విపక్షంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో భయాం దోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని సిల్చార్‌లో శనివారంనాడు పర్యటించారు. రూ.23,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.22,864 కోట్లతో సిల్చార్-మేఘాలయలోని షిల్లాంగ్ మధ్య నిర్మించనున్న యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, అస్సాం ప్రజలను హింస, ఉగ్రవాదం వైపు కాంగ్రెస్ తప్పుదారి పట్టించిందని, మిగతా 9లో..

# ఆయిల్‌పామ్‌పై సందేహాలొద్దు

- రైతులు దండిగా ఆయిల్ పామ్ సాగు చేయాలి
- నర్మెట్లలో పంటలను సందర్శించిన మంత్రులు తుమ్మల, పొన్నం
- 22న సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామని వెల్లడి



సిద్దిపేట(జనంసాక్షి): రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మం త్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు లకు పెట్టుబడి, ఎరువులు అన్నీ అందిస్తు న్నామని తెలిపారు. తాను మంత్రిగా వచ్చి న సమయానికి ఆయిల్ పామ్ టన్ను రూ. 12వేలు ఉండేదని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి టన్ను ధర రూ.20 వేలకు పైగా మిగతా 2లో..

## ప్రశాంతంగా ప్రారంభమైన 'పది'పరీక్షలు



అరగంట ముందుగానే కేంద్రాలకు అనుమతి

2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15.03.2026

# డొమెస్టిక్ గ్యాస్ కొరత లేదు

కాన్ఫరెన్స్ నిర్వహించాం. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ లు ఉన్నారు. 1.3 కోట్ల డోమాస్టిక్ కన్జుమర్స్ ఉన్నారు. 7.5 లక్షల కమర్షియల్ కన్జుమర్స్ ఉన్నారు. నెలకు యావరేజ్ 60 లక్షల సిలిండర్లు డొమెస్టిక్ వాడుతున్నారు. కమర్షియల్ సిలిండర్ విషయంలోనే కొరత ఏర్పడుతోంది. డొమెస్టిక్ కన్జుమర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎలాంటి కొరత లేదు. ఆందోళనతో ముందస్తుగా అవసరం లేకున్నా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారు. గృహ అవసర సిలిండర్లకు కొరత లేదు. కమర్షియల్ సిలిండర్లను కేంద్రం 20 శాతం సప్లై చేస్తోందన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రానికి లేఖ రాశాం. ప్రతి రోజు 2.15 లక్షల ఎల్పీజీ డొమాస్టిక్ సిలిండర్లు సప్లై చేస్తారు. నిన్న మొన్న 2.3 లక్షలు సప్లై చేశారు. కమర్షియల్ సిలిండర్లు రోజుకు 23 వేలు సప్లై చేసే వాళ్లు. కానీ ప్రస్తుతం 6200 సిలిండర్లు మాత్రమే ఇస్తున్నారు. స్కూల్స్, కాలేజెస్, సెంటర్, స్టేట్ గవర్నమెంట్ సంస్థలకు కమర్షియల్ సిలిండర్ల విషయంలో ప్రాధాన్యత ఇస్తున్నాం. సివిల్ సప్లై భవన్ లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని. ఎవరైన కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించినా..బ్లాక్ మార్కెట్ చేసినా హెల్ప్ లైన్ 180042500344 కు కాల్ చేయొచ్చని' మంత్రి ఉత్తమ్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.3 కోట్ల మంది యాక్టివ్ గృహ వినియోగదారులు ఉన్నారని, వారికి సరిపడా సిలిండర్లను ఆయిల్ కంపెనీలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. గతంలో రోజుకు సగటున 2.15 లక్షల సిలిండర్లు సరఫరా అయ్యేవని, ప్రస్తుత డిమాండ్‌ను బట్టి దానిని 2.3 లక్షలకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. గ్యాస్ కొరత ఉందన్న ఆందోళనతో వినియోగదారులు అనవసరంగా ఓవర్ బుకింగ్ చేసి సిస్టమ్‌ను ఓవర్‌లోడ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు వాడే 19 కేజీల కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం తగ్గుదల ఉన్న మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కొత్త మార్గదర్శకాల వల్ల గతంలో ఉన్న సరఫరాలో కేవలం 20 శాతం మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉందని ఆయన వివరించారు. గతంలో రోజుకు 23,000 కమర్షియల్ సిలిండర్లు సరఫరా అయ్యే చోట, ఇప్పుడు కేవలం 6,200 మాత్రమే వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు, అక్రమ నిల్వలను అరికట్టేందుకు రాష్ట్ర , జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. గృహ అవసరాల సిలిండర్లు పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మొత్తానికి, సామాన్యుడి వంటింట్లో మంట ఆరిపోకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు.

## 50 ఏళ్ల లోపు మహిళలకు అనుమతిలేదు

**తిరువనంతపురం(జనంసాక్షి):**50 ఏళ్లలోపు మహిళల్ని శబరిమల ఆలయంలోకి అనుమతించే అంశంపై కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల్ని ఆలయంలోకి అనుమతించకూడదని నిర్ణయించింది. ఈ మేరకు కేరళం సీఎం పినరయి విజయన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో దీనిపై ఆమోదం లభించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. భక్తుల మనోభావాలు, ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాల్ని దృష్టిలో ఉంచుకుని, వాటిని కాపాడాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, త్వరలోనే కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాజకీయ కోణంలోనే ఎల్డీఎఫ్ (లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్) ఈ నిర్ణయం తీసుకుందని రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. శబరిమల ఆలయంలోకి వయసుతో సంబంధం లేకుండా మహిళలకు ప్రవేశం కల్పించాలని కొన్నేళ్లక్రితం ఆందోళనలు చెలరేగాయి. అయితే, ఈ నిర్ణయాన్ని శబరిమల ఆలయ యాజమాన్య బాధ్యతలు చూసే ట్రావెన్‌కోర్ దేవస్థాన బోర్డు వ్యతిరేకించింది. ఎప్పటినుంచో ఉన్న సంప్రదాయం ప్రకారం.. మహిళలకు మెనుస్ట్రువల్ సైకిల్ ఉండే పదేళ్ల వయసు నుంచి 50 ఏళ్ల వయసు మహిళల్ని ఆలయంలోకి అనుమతించబోమని తెలిపింది. ఈ నిర్ణయాన్ని 2018లో ప్రభుత్వం వ్యతిరేకించింది. అన్ని వయసుల వారికి ఆలయ ప్రవేశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్యాంగం ఇచ్చిన హక్కు ప్రకారం అందరు మహిళలు ఆలయంలోకి వెళ్లొచ్చని తెలిపింది.అయితే, ఇప్పుడు ఈ నిర్ణయాన్ని ఎల్డీఎఫ్ ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. పాత సంప్రదాయాల ప్రకారమే 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై నిషేధం విధిస్తామని కోర్టుకు తెలిపింది. ఈ అంశంలో ప్రభుత్వ నిర్ణయం ఏంటో చెప్పేందుకు తుది గడువు కావడంతో తాజా నిర్ణయాన్ని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ అంశంపై వచ్చే నెల 7 నుంచి సుప్రీంకోర్టులో వాదనలు జరగనున్నాయి. మరోవైపు ప్రభుత్వం యూటర్న్ తీసుకోవడంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఇంతకాలం ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడిన వారిపై నమోదైన కేసుల సంగతేంటని ప్రశ్నిస్తున్నాయి. ఈ నిరసనలకు సంబంధించి నమోదైన కేసుల్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది.

## మూసీతో నల్గొండకు నరకయాతన

కారిడార్లు రాబోతున్నాయని అన్నారు. హయత్ నగర్ సాయిబాబా టెంపుల్ (తొర్రూర్ లీ రోడ్) నుంచి జీ స్కూల్ వరకు సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో 2లేన్ నుంచి 4లేన్ రహదారిగా అభివృద్ధి చేస్తున్న పనులకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇవాళ శంకుస్థాపన చేశారు. సోమవారం నుంచి పనులు మొదలు అవుతాయన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను ప్రతి రోజు హైదరాబాద్ - విజయవాడ 10లేన్ల జాతీయ రహదారి విస్తరణపై సంప్రదింపులు జరపడంతో పాటు, సమీక్షలు జరుపుతున్నామని కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు రావడం కోసం కాస్త ఆలస్యం అయిందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో విద్యా, ఇతర పనుల నిమిత్తం ఎక్కువ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి స్థిరపడ్డ వారు ఎక్కువ ఉంటారన్నారు. గతంలో హైదరాబాద్ ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ రోడ్డు కోసం కృషి చేశానన్నారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ రేడియో స్టేషన్ వరకు డబుల్ డెక్కర్ నిర్మాణం రాబోతుందని మంత్రి తెలిపారు.నాగపూర్?లో 8 కిలోమీటర్ల తర్వాత అతిపెద్ద డబుల్ డెక్కర్ నిర్మాణం మన ప్రాంతంలో 6 కిలోమీటర్ల వరకు నిర్మిస్తున్నాం అన్నారు. సుమారు రూ.940 కోట్లతో నిర్మిస్తున్న ఈ డబుల్ డెక్కర్ కారిడార్?లో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.200 కోట్లు చెల్లించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. త్వరలో దీనికి సంబంధించిన సమావేశాలు ఉంటాయన్నారు. ఈ డబుల్ డెక్కర్ కారిడార్?లో పైన మెట్రో రైలు, నేషనల్ హైవే, కింద స్థానికులు వాహనాలు క్రాస్ చేసేందుకు యాక్సిడెంట్స్?కు ఆస్కారం లేకుండా వెహికిల్ అండర్ పాస్?లు ఏర్పాటు చేస్తున్నామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వచ్చే నెలలో టెండర్లు పూర్తి చేసి రహదారి విస్తరణ పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతి తీసుకొని రైల్వే స్టేషన్ కలుపుతూ వేసే మరో రోడ్డు రూ.8 కోట్ల పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు.

## ఆయిల్‌పామ్‌పై సందేహాలొద్దు

పెంచామని చెప్పారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ పంట వేయాలని సూచించారు. ఈ పంటకు నీటి సమస్య, మార్కెట్ సమస్య లేదన్నారు. అన్ని విధాలా రైతులకు లాభాలు ఇచ్చే పంట ఆయిల్ పామ్ అని చెప్పారు. నర్మెట్టలో త్వరలో రైతు మేళా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ సాగుచేయాలన్నారు. రైతులు క్రాప్ డైవర్షన్ వైపు మారాలని లేకపోతే రైతులకు నష్టం జరుగుతుందన్నారు . సిద్దిపేట జిల్లా నర్మేటట్టలో మార్చి 22న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మంత్రి పొన్నంతో కలిసి సందర్శించారు.

## పెళ్లికి నిరాకరించిందని యువతికి ఎయిడ్స్ ఇంజెక్షన్

మేడ్చల్ మల్కాజ్‌గిరి(జనంసాక్షి): మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ప్రాంతంలో సమాజం తలదించుకునే ఘటన చోటుచేసుకుంది. తనను పెళ్లి చేసుకోవడం లేదనే కోపంతో ఓ యువకుడు, యువతికి ప్రాణాంతకమైన ఎయిడ్స్ సోకిన రక్తాన్ని ఇంజక్షన్ ద్వారా ఎక్కించాడు. సినిమా తరహాలో జరిగిన ఈ పైశాచిక ఘటన ఇప్పుడు కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు మనోహర్, బాధితురాలిని కొంతకాలంగా పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. మనోహర్‌కు ఎయిడ్స్ పాజిటివ్ ఉందని తెలియడంతో ఆ యువతి అతడితో పెళ్లికి నిరాకరించింది. తన ప్రాణాలను పణంగాపెట్టి పెళ్లి చేసుకోలేనని స్పష్టం చేసింది. తన వ్యాధి గురించి తెలిసి పెళ్లికి నో చెప్పిందనే కోపంతో మనోహర్ ఉన్మాదిలా ప్రవర్తించాడు. 'నేను ఎలాగూ చనిపోతాను.. నువ్వు కూడా నాతోనే రావాలి' అనే వికృత ఆలోచనతో, తన రక్తాన్ని లేదా ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల రక్తాన్ని ఇంజక్షన్ ద్వారా ఆ యువతి శరీరంలోకి ఎక్కించాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఘట్‌కేసర్ పోలీసులు వెంటనే స్పందించారు. మనోహర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ రక్తాన్ని అతను ఎక్కడి నుంచి సేకరించాడు? దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. బాధితురాలిని వెంటనే ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రేమ పేరుతో ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడే వారిపై కఠిన చట్టాలు ప్రయోగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని స్థానికులు ఆకాంక్షించారు.

## దేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు

కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీచేసింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడంవల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ తాజాగా కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని భరోసా ఇచ్చింది. కంగారు పడి కొనుగోళ్లకు దిగవద్దని ప్రజలకు సూచించింది. సాధారణ కంటెయినర్‌లలో పెట్రోల్, డీజిల్ నిల్వ చేయడం ప్రమాదకరమని హెచ్చరించింది. ఇక గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్‌ల విషయంలో నెలకొన్న భయాందోళనలపై ఇటీవల మార్కెటింగ్ విభాగం జాయింట్ సెక్రెటరీ కూడా స్పందించారు. ఎల్పీజీ డెలివరీల్లో ఎలాంటి ఆటంకాలు లేవని అన్నారు.

**ఢిల్లీలో కట్టెల పొయ్యిలకు అనుమతి**

దేశ రాజధాని ఢిల్లీలో పెరుగుతున్న గ్యాస్ కొరతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా ఢిల్లీలో కట్టెల పొయ్యిల వాడకంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గ్యాస్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా కట్టెల పొయ్యిల వాడకానికి అధికారికంగా అనుమతి నిచ్చింది. ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని తగ్గించే ఉద్దేశంతో గతంలో కట్టెల పొయ్యిలు, బొగ్గు వాడకంపై కఠినమైన ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుతం నెలకొన్న గ్యాస్ కొరత కారణంగా సామాన్యులు పడుతున్న ఇబ్బందులను గమనించిన కేంద్రం, ఈ నిబంధనలను సడలిస్తూ నిర్ణయం తీసుకుంది. ఎల్పీజీ లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు వంట కోసం ఇబ్బంది పడకుండా ఈ వెసులుబాటు కల్పించారు. గ్యాస్ సంక్షోభం నుంచి ఉపశమనం పొందే వరకు ఈ అనుమతి వర్తిస్తుందని అధికారులు వెల్లడించారు. కట్టెల పొయ్యిలకు అనుమతి ఇచ్చినప్పటికీ, కాలుష్యం మరీ పెరగకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వం సూచించింది. వీలైనంత వరకు పొగ తక్కువగా వచ్చే పద్ధతులను పాటించాలని కోరింది. కేవలం నివాస అవసరాలకు మాత్రమే ఈ అనుమతి ఉంటుంది. బహిరంగంగా పెద్ద ఎత్తున కాల్చడంపై ఆంక్షలు కొనసాగుతాయి. కేంద్రం నిర్ణయం పట్ల ఢిల్లీలోని మధ్యతరగతి, దిగువ తరగతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ ధరలు పెరగడం, పైగా కొరత ఉండటంతో కట్టెల పొయ్యిలు ఇప్పుడు ఊరటనిస్తాయని భావిస్తున్నారు.

## గ్యాస్ కొరతను కావాలనే సృష్టిస్తున్నారు

హైదరాబాద్(జనంసాక్షి): దేశంలో గ్యాస్ కొరత లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. కొంతమంది కావాలనే కొరతను సృష్టిస్తున్నారని ఆరోపించారు. "యుద్ధం వల్ల అనేక దేశాల్లో గ్యాస్ ధరలు పెరిగాయి. మన దేశంలో మాత్రం పెరగలేదు. మోదీ ప్రభుత్వం ఈ ధరలను నియంత్రణలో పెట్టింది. గతంలో గ్యాస్ ధర రూ.1,200 ఉంటే.. మోదీ ప్రభుత్వం రూ.900లకు తగ్గించింది. మూసీ పునరుజ్జీవానికి రూ.7వేల కోట్లు అంటున్నారు. ప్రాజెక్టుకు భాజపా వ్యతిరేకం కాదు. అయితే, 50 మీటర్ల బఫర్ జోన్ అనేది అవసరం లేదు. గాంధీ విగ్రహం ఏర్పాటుకు 100 ఎకరాలు కావాలా? గుజరాత్‌లో ఎవరికీ నష్టం లేకుండా సబర్మతి ప్రాజెక్టు పూర్తి చేశాం" అని అన్నారు.

## ప్రభుత్వ పనితీరు మెరుగుపడేందుకు జనగణనే కీలకం

ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా వారధిగా పని చేస్తోందని జనాభా లెక్కల విషయంలోనూ అదే విధంగా కృషి చేయాలని కోరారు. హైదరాబాద్ కోఠిలోని సెన్సస్ కార్యాలయంలో డైరెక్టర్ భారతి హోళికేరి ప్రెస్ మీట్ నిర్వహించారు. జనాభా లెక్కలు జరగనున్న విధానంపై మీడియా ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. 1872లో తొలిసారి జనాభాను బ్రిటిష్ కాలంలో లెక్కించారని, తర్వాత 1881లో తొలిసారి సింక్రోనస్ సెన్సెస్ (సమకాలిక జనాభా లెక్కలు) జరిగాయని చెప్పారు. 1951లో తొలిసారి స్వాతంత్ర్య భారత్‌లో జనగణన జరిగిందని తెలిపారు. 2027లో జరగనున్న ఈ జనగణన స్వాతంత్ర్య భారత్‌లో ఎనిమిదోసారి, మొత్తంగా 16వదని గుర్తు చేశారు.కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాల సహకారంతో ఫెడరల్ స్ఫూర్తితో జనగణన జరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో సీఎస్, నోడల్ ఆఫీసర్, ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్, ఛార్జ్ ఆఫీసర్‌తో పాటు ఎన్యుమరేటర్స్, సూపర్వైజర్లు దీనిలో పాల్గొంటారని తెలిపారు. ఇందులో సేకరించిన సమాచారాన్ని పూర్తిగా భద్రంగా ఉంటుందని, దుర్వినియోగం చేసే అవకాశం ఉండదని హామీ ఇచ్చారు. ఎన్యూమరేటర్లు ఎవరైనా అతిగా ప్రవర్తిస్తే మూడు నెలల వరకు జైలుశిక్షతో పాటు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. ఈసారి పూర్తిగా డిజిటల్ మోడ్‌లో జనగణన చేపట్టేందుకు ఆఫ్‌లైన్ మోడ్‌లో పని చేసే యాప్‌ను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు.2027 మార్చ్ 01 నుంచి 05 వరకు రివిజన్ రౌండ్ ఉంటుందని భారతి పేర్కొన్నారు. మొదటి దశలో 33 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు.

## యుద్ధ ప్రాతిపదికన సంక్షేమ వసతి గృహాలు

వసతి గృహాల మరమ్మతుల బిల్లులు ప్రతి 15 రోజులకు ఒకసారి క్రమం తప్పకుండా ఆర్థిక శాఖకు వచ్చే విధంగా ఒక సీనియర్ అధికారిని నియమించి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ఈ వేసవిలో వసతి గృహాల మరమ్మత్తు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల అద్దెలు, ఎలక్ట్రికల్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు ప్రతినెలా చెల్లిస్తామని సంక్షేమ శాఖ అధికారులు సకాలంలో ఆర్థిక శాఖకు బిల్లులు పంపాలని డిప్యూటీ సీఎం సూచించారు. గత ప్రభుత్వ కాలంలో ఈ బిల్లులు ఏడు నెలలకు ఒకసారి చెల్లించేవారని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వసతి గృహాలకు సరఫరా చేస్తున్న మెటీరియల్ క్వాలిటీ చెక్ కోసం ఒక నిర్దిష్ట యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకొని నిరంతరం సమీక్షించాలని డిప్యూటీ సీఎం సూచించారు. డైట్ చార్జీలు 40 శాతం పెంచాం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచాం, సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన బిల్లులను మొదటి ప్రాధాన్యతగా గుర్తించి చెల్లిస్తున్నాం ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు నిత్యం వసతి గృహాలను సందర్శించి స్థానికంగా జరుగుతున్న బోధన, భోజనంలో నాణ్యత, సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాలను పరిశీలించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

## టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యం

సమావేశంలో నిర్ణయించారు. 'వీ హబ్' ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం కల్పించే అంశంపై చర్చించారు. స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్, అప్ - స్కిల్లింగ్ రంగాల్లో కూడా సహకారం అందించాలని సమావేశంలో నిర్ణయించారు. 'త్వరలో తెలంగాణతో ఎంవోయూ కుదుర్చుకుంటాం. ఈ భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సాంకేతిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది' అని టాంజానియా మంత్రి ప్రకటించారు.

## మూసీ మురికికి కాంగ్రెస్‌దే బాధ్యత

కూల్చి, ఆయనకు చెడ్డ పేరు తీసుకురావొద్దని స్వయంగా.. గాంధీ మునిమనువడు తుషార్ గాంధీ చెప్పడాన్ని ఆయన గుర్తు చేశారు.గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ తొలి దశ కోసం 3 వేల ఎకరాలు అవసరమైన కాంగ్రెస్ ప్రభుత్వం శుక్రవారం ప్రజెంటేషన్ ఇవ్వడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణతో ఇళ్లు కోల్పోనున్న వారితో కలిసి హియాయత్ సాగర్‌లో కేటీఆర్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మేధా పాట్కర్ లాంటి మేధావులు కూడా రేవంత్ రెడ్డి చర్యలకు అడ్డు చెబుతున్నారని ఆయన తెలిపారు.పేదల ఇళ్లు కూల్చి.. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ చేపట్టడం అవసరమా? అని విమర్శలు వస్తున్నా? నేను రియల్ ఎస్టేట్ గురించే ఆలోచిస్తా. అందులో తప్పేంటి? అని రేవంత్ రెడ్డి బహిరంగంగా అంటున్నాడని కేటీఆర్ వెల్లడించారు. మరి ఇదంతా మూసీ ప్రాజెక్టు సుందరీకరణ కోసం చేస్తున్నాడా లేక భూముల కోసం చేస్తున్నాడు అనుకోవాలా? అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

## బండి సంజయ్ పాదయాత్రలో అపశృతి

కరీంనగం(జనంసాక్షి):

కేంద్ర మంత్రి బండి సంజయ్ 'అంజన్న ఆశీర్వాద యాత్ర' పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు చేపట్టిన పాదయాత్రలో జనం పెద్దఎత్తున తరలివచ్చారు. రామడుగు మండలం కోన్‌రావు పేట సమీపంలో పాదయాత్ర దృశ్యాలను చిత్రీకరించేందుకు కార్యకర్తలు డ్రోన్ ఎగరేశారు. అయితే, అది పక్కనే చెట్టుకు ఉన్న తేనెతుట్టెను తాకింది. దీంతో ఒక్కసారిగా గందరగోళం తలెత్తింది. కొందరు కార్యకర్తలపై తేనెటీగలు దాడి చేశాయి. అప్రమత్తమైన మంత్రి బండి సంజయ్.. గాయపడ్డ కార్యకర్తలకు వైద్యం చేయించారు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ పాదయాత్ర కొనసాగించారు. సాయంత్రం 6.30 కల్లా కొండగట్టుకు చేరుకునేలా సంజయ్ యాత్ర సాగిస్తున్నారు.

# ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి

ఇలాండ్‌పై తన ఆదేశాల మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ దాడి చేసిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇక్కడి చమురు సదుపాయాల జోలికి వెళ్లలేదని వెల్లడించారు. హర్మూజ్ జలసంధి వద్ద నౌకల రవాణాను అడ్డుకుంటే మాత్రం.. వాటిని కూడా టార్గెట్ చేస్తామని హెచ్చరికలు జారీచేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ.. అమెరికా, రష్యా అధ్యక్షులు ఇటీవల ఫోన్‌లో సంభాషించుకొన్నారు. యుద్ధాన్ని ముగించడంలో భాగంగా.. ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వలను రష్యాకు తరలించాలని పుతిన్ ప్రతిపాదించినట్లు తెలిసింది. అయితే, దీనిని ట్రంప్ తిరస్కరించినట్లు సమాచారం. ఈ యుద్ధంలో ఇరాన్‌కు పరిమిత స్థాయిలో రష్యా సహాయం చేస్తుండవచ్చని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నవేళ ఈ విషయం బయటకు వచ్చింది.అయితే, ఇలా రష్యా నుంచి ఇటువంటి ప్రతిపాదన రావడం ఇదే మొదటిసారి కాదని.. ఇంతకుముందు ఇలాంటి ఆఫర్‌లు వచ్చినట్లు అమెరికా ప్రతినిధి ఒకరు తెలిపారు. యురేనియం సురక్షితంగా ఉండేలా చూసుకోవాలనేది అమెరికా వైఖరి అని అన్నారు. మరోవైపు, ఇటువంటి ప్రతిపాదనను ఇరాన్ అంగీకరించే సంకేతాలు లేవని తెలుస్తోంది. యుద్ధానికి ముందు అమెరికాతో జరిగిన చర్చల సమయంలోనూ ఇరాన్ ఇటువంటి అంశాలను అంగీకరించలేదని సమాచారం.

మొజ్తబా ఆచూకీ చెబితే.. .10మిలియన్ డాలర్లు

ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు పగ్గాలు చేపట్టినా తమ తదుపరి టార్గెట్ అయనే అవుతారని ఇంతకుముందే ప్రకటించిన అమెరికా ఆ దిశగా మరో ముందడుగు వేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కానీ, ఆయనకు సంబంధించిన కీలక సమాచారం కానీ అందించిన వారికి భారీ రివార్డు ప్రకటించింది. ఆచూకీ ఇచ్చిన వారికి 10 మిలియన్ డాలర్లు అంటే రూ.93 కోట్లు నజరానా ఇస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. 'రివార్డ్ ఫర్ జస్టిస్' కార్యక్రమం క్రింద ఈ బౌంటీ ఇస్తామని తెలిపింది. అమెరికా విదేశాంగ నిర్వహించే ఒక ముఖ్యమైన ఉగ్రవాద నిరోధక కార్యక్రమమే 'రివార్డ్ ఫర్ జస్టిస్'. ఈ ప్రోగ్రాం కింద అంతర్జాతీయ నేరస్తులు, నెట్‌వర్క్‌ల సమాచారం అందించి, వారిని పట్టుకోవడంలో సహాయపడిన వారికి మిలియన్ డాలర్ల రివార్డు ఇస్తుంటారు. అమెరికన్ల రక్షణ, జాతీయ భద్రత బలోపేతం చేయడమే ఆర్ఎఫ్‌జే లక్ష్యం. కాగా, అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించిన వ్యక్తుల జాబితా మొజ్తాబాతో పాటు ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అస్గర్ హెజాజీ, సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ అలీ లారీజానీ, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. ఆచూకీ తెలిపిన వారికి రివార్డుతో పాటు వారిని వేరే ప్రాంతానికి తరలించే సదుపాయం కూడా కల్పిస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.

13 అంతర్జాతీయ విమానసర్వీసులు రద్దు

మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మన హైదరాబాద్ ప్రయాణికులపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావంతో 13 అంతర్జాతీయ సర్వీసులు రద్దు అయ్యాయి. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వెళ్లాల్సిన పలు అంతర్జాతీయ విమానాలు శనివారం రద్దు అయ్యాయి. మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ప్రయాణికుల భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు. మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతావరణం కారణంగా ఆయా దేశాల ఎయిర్ స్పేస్ తాత్కాలికంగా మూసివేశారు. ఇరాన్ - ఇజ్రాయిల్ మధ్య కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడుల వల్ల అంతర్జాతీయ ఎయిర్ ట్రాఫిక్ పూర్తిగా ప్రభావితమైంది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలు ఈ నిర్ణయాన్ని తీసుకున్నాయి. ప్రధానంగా ఈ దేశాలకు వెళ్లాల్సిన విమానాలు నిలిచిపోయాయి. యూఏఈ, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా, ఇరాన్, ఇజ్రాయిల్ విమానాలు రద్దు అయ్యాయి. విమానాల రద్దుతో ఎయిర్‌పోర్ట్‌లో వేచి ఉన్న ప్రయాణికులకు అధికారులు కొన్ని కీలక సూచనలు చేశారు. ప్రయాణికులు మీ విమానానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి సంబంధిత ఎయిర్‌లైన్స్ అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు. టికెట్ రీ-బుకింగ్ లేదా రీ-రూటింగ్ కోసం ఎయిర్‌లైన్ ప్రతినిధులతో మాట్లాడాలని అన్నారు. మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతున్నాయని... ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందే తమ విమాన సమయాలను ఒకసారి సరిచూసుకోవాలని అధికారులు సూచించారు.

## అమెరికా పెట్టుబడులు పెట్టిన చోట సర్వనాశం చేస్తాం

టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఇరాన్ వ్యూహాత్మక ద్వీపంపై అమెరికా దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో టెహ్రాన్ ప్రతిదాడులకు దిగింది. తాజాగా ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో అగ్రరాజ్య ఎంబసీపై క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో హెలిప్యాడ్ ధ్వంసమైనట్లు ఇరాక్ సెక్యూరిటీ అధికారులు తెలిపారు.క్షిపణి దాడితో ఎంబసీ ప్రాంతంలో దట్టమైన పొగ అలముకుంది. అమెరికాకు చెందిన అతిపెద్ద దౌత్యకార్యకలాపాల్లో ఒకటైన బాగ్దాద్ కాంప్లెక్స్‌పై ఇరాన్ పదేపదే రాకెట్లు, డ్రోన్లతో దాడులు చేస్తోంది. తాజా ఘటన కూడా టెహ్రాన్ పనే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అగ్రరాజ్య రాయబార కార్యాలయం నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు.మరోవైపు, దుబాయ్ లో ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రమైన ఓ భవనంపై దాడి జరిగింది. 24 గంటల్లో ఈ ప్రాంతంలో రెండోసారి దాడి జరగడం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, భవనం మాత్రమే దెబ్బతిందని దుబాయి మీడియా ఆఫీస్ ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. శుక్రవారం కూడా ఈ నగరంలోని ఓ భవనంపై డ్రోన్ దాడి జరిగినట్లు కథనాలు వెలువడ్డాయి.పశ్చిమాసియాలో రణరంగం కొనసాగుతోంది. ఇప్పటివరకు ఇరాన్ అణు కేంద్రాలు, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్న అమెరికా.. ఇప్పుడు ఆ దేశ ఆర్థిక వ్యవస్థను టార్గెట్ చేసింది. ఇరాన్ చమురుకు వ్యూహాత్మక హబ్ అయిన ఖర్గ్ ఇలాండ్‌పై యూఎస్ బలగాలు దాడి చేశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించారు. తన ఆదేశాల మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ ఈ దాడి చేసిందని ట్రంప్ తెలిపారు. ఆ ద్వీపంలోని సైనిక కేంద్రాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయన్నారు. పశ్చిమాసియా చరిత్రలోనే అత్యంత శక్తిమంతమైన దాడుల్లో ఇదొకటిగా అభివర్ణించారు. అయితే ఆ ద్వీపంలోని చమురు మౌలిక సదుపాయాలపై దాడి చేయలేదని వెల్లడించారు. ఇరాన్ లేదా మరెవరైనా హర్మూజ్ జలసంధి వద్ద నౌకల రవాణాను అడ్డుకుంటే.. వెంటనే చమురు మౌలిక సదుపాయాలను టార్గెట్ చేసే విషయాన్ని పునఃపరిశీలిస్తానని హెచ్చరించారు.

**సౌదీ బేస్‌పై దాడిలో ఐదు అమెరికా రీఫ్యూయలింగ్ విమానాలు ధ్వంసం**

అమెరికా వాయుసేనకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు తెలుస్తోంది. సౌదీ అరేబియాలోని వైమానిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో యూఎస్ వైమానిక దళానికి చెందిన ఐదు రీఫ్యూయలింగ్ విమానాలు ధ్వంసం అయినట్లు సమాచారం. యూఎస్ అధికారులు ఈ విషయం పేర్కొన్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో వెల్లడించింది. దాని ప్రకారం.. సౌదీ అరేబియాలోని ఎయిర్‌బేస్‌పై జరిగిన దాడుల్లో ఐదు కేసీ-135 రీఫ్యూయలింగ్ విమానాలు దెబ్బతిన్నాయి. ట్యాంకర్లు దెబ్బతిన్నప్పటికీ.. అవి పూర్తిగా ధ్వంసం కాలేదు. వాటికి మరమ్మత్తులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని అధికారులు తెలిపారు.

## హర్మూజ్ దాటిన భారత నౌకలు

గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. ఈ నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్‌కు చేరుకునే అవకాశం ఉందన్నారు. దేశంలో ఎల్పీజీ సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోన్న సమయంలో తాజా పరిణామం ఊరట కలిగించే అంశం.గృహవినియోగ సిలిండర్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అవసరం లేకున్నా చాలామంది బుకింగ్ చేస్తున్నారని తెలిపింది. బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టాలని రాష్ట్రాలను కోరామని, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొంది. దేశంలో గ్యాస్, ఎల్పీజీ లభ్యతపై ఆందోళనలు నెలకొన్నవేళ.. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పెట్రోలియం శాఖ అధికారులు మీడియా సమావేశంలో వెల్లడించారు. "వాణిజ్య సిలిండర్లను ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేస్తున్నాం. ఎల్పీజీ సరఫరాలో ప్రస్తుతానికి ఇబ్బందులు లేవు. అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్, బిహార్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో వాణిజ్య సిలిండర్లు అక్రమంగా నిల్వ చేసే వారిపై దాడులు చేస్తున్నాం. ఎల్పీజీ సరఫరాలో గృహాలు, ఆసుపత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నాం. సిలిండర్ బుక్ అవడం లేదని చాలామంది ఫిర్యాదు చేస్తున్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన 'పది'పరీక్షలు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షలు ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 2676 కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన పరీక్షా కేంద్రాలలోనికి అనుమతిస్తామని అధికారులు చెప్పారు. పలు కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్‌ది బెస్టు చెబుతూ ఫ్లెక్సీలు వెలిశాయి. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు.

# కొండగట్టు అభివృద్ధికి మాదే బాధ్యత

- బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర
- కరీంనగర్ మహాలశక్తి ఆలయం నుంచి కొండగట్టుకు
- స్థానిక కార్పోరేటర్లతో కలిసి పదివేలమంది నడక
- రాజకీయాలకు సంబంధం లేదన్న కేంద్రమంత్రి



**కరీంనగర్ బ్యూరో, మార్చి14 (జనంసాక్షి) :** కొండగట్టును అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకుంటామని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు మహా పాదయాత్ర చేపట్టారు. కేంద్ర మంత్రితో పాటు ఇటీవల గెలుపొందిన కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. కరీంనగర్ మేయర్ పీఠం భాజపా కైవసమైతే కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుంటానని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ప్రకటించారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, 10 వేల మంది కార్యకర్తలతో కలిసి సంజయ్ పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన కొండగట్టు పాదయాత్ర రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'అంజన్న ఆశీర్వాద' పేరుతో శనివారం మహా పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కరీంనగర్ మహాశక్తి అమ్మవారి దేవాలయం నుంచి కొండగట్టు అంజన్న ఆలయం వరకు ఈ పాదయాత్ర కొనసాగుతోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగుతోంది. సాయంత్రం కొండగట్టుకు ఈ పాదయాత్ర చేరుకోనుంది. బీజేపీ శ్రేణులు ఈ పాదయాత్రకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పది వేలమంది పాల్గొనేలా ప్లాన్ చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. కొండగట్టు అంజన్న ఆశీర్వాదం, ప్రజల ఆశీర్వాదంతో కరీంనగర్ కార్పొరేషన్‌లో విజయం సాధించామని పేర్కొన్నారు. మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు ఈ పాదయాత్ర చేస్తున్నామని బండి సంజయ్ వివరించారు. పదోతరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ పాదయాత్ర కొనసాగుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నది ఎన్డీయే భాగస్వామ్య ప్రభుత్వమని చెప్పుకొచ్చారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమ ఎన్డీయే కూటమి మిత్రుడేనని తెలిపారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మీద మత విద్వేషాలను రెచ్చగొట్టినందుకు కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## హెచ్‌జె దొర పాడె మోసిన పోలీసు ఉన్నతాధికారులు





**హైదరాబాద్, మార్చి 14 (జనంసాక్షి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించి, అలుపెరుగని సంస్కర్తగా పేరుగాంచిన దివంగత డిజిపి హెచ్‌జె దొర అంత్యక్రియలు శనివారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో పలువురి అశ్రునయనాల మధ్య ముగిశాయి. జూబ్లీహిల్స్‌లోని ఆయన స్వగృహం నుండి శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన అంతిమయాత్రలో పోలీసు అధికారులు, సిబ్బంది, అభిమానులు పాల్గొన్నారు. మహాప్రస్థానం వద్ద అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు శనివారం మధ్యాహ్నం వరకు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించిన పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు ఘన నివాళులర్పించారు. తన మార్గదర్శికి అంతిమ గౌరవం సమర్పిస్తూ రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి స్వయంగా పాడె మోశారు. ఆయనతో పాటు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ కూడా పాడె మోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎస్పీగా ఉన్న తొలి నాళ్లలో తనను ప్రోత్సహించి, హెచ్‌జె దొర సొంత జిల్లా అయిన శ్రీకాకుళానికి ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చి విధి నిర్వహణలో దిశానిర్దేశం చేసిన జ్ఞాపకాలను ఈ సందర్భంగా డిజిపి గుర్తుచేసుకున్నారు. మాజీ డిజిపి జితేందర్, ఐపిఎస్ అధికారులు రాజీవ్ త్రివేది, ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఐఏఎస్‌డబ్ల్యూ ఓఎస్డి కమలాసన్ రెడ్డి తదితరులు పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. పోలీస్ వ్యవస్థకు హెచ్‌జె దొర చేసిన సేవలు స్మరించుకుంటూ వీడ్కోలు పలికారు.



## ఆర్య వైశ్యులకు అన్ని విధాలా అండగా ఉంటా

- నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరైన ఉప్పల

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆర్య వైశ్యులకు అన్ని విధాలా అండగా ఉంటానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. వాసవి ఆర్యవైశ్య సంఘం (సుచిత్ర, కొంపల్లి) ఆధ్వర్యంలో నూతన కమిటీకి సంబంధించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం కొంపల్లిలోని హమ్స్‌టాన్స్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథులతో కలిసి పాల్గొని నూతనంగా ఎన్నికైన సంఘం ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథులుగా హాజరై ఆర్య వైశ్య సంఘం నూతన అధ్యక్షుడు మరియు కమిటీ సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఎంఎల్సీ బొగ్గారపు దయానంద్, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వా సుజాత, వైటీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్, ధర్మిక రక్ష ఫౌండర్ చికోటి ప్రవీణ్, నందానంద ట్రస్ట్ వ్యవస్థాపకులు నందనంపాటి రామాంజనేయులు, టెంపుల్ ట్రస్టీ మణేపల్లి రామారావు, స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ అధ్యక్షులు తెలుకుంట రమేష్ గుప్త, వైపీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యెలిశాల రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ లకు ఆర్యవైశ్య సంఘం తరపున నేడు ముషీరాబాద్ హాస్టల్ అభినందన సభ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్, టీజీ వెంకటేష్ పాల్గొంటారని ఆయన తెలిపారు. మహిళలకు పురుషులకు సన్మాన కార్యక్రమం వుంటుందని, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆర్యవైశ్యులందరూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ లకు కొనసాలకు త్వరలోనే ఆర్యవైశ్య సంఘం తరఫున అభినందన సభ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఆర్యవైశ్యులందరూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు ఆర్యవైశ్యుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అయిత రాములు, కొడిపాక నారాయణ సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్ గుప్తా, ఆర్య వైశ్యసంఘం అధ్యక్షుడు చిట్టిమిల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తొట బిక్షపతి, ఖజాంచి పడకంటి వెంకటేశం, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చెల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

# నిర్భయ నిధి కింద 'ములుగు' ఎంపిక

- కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిర్భయ నిధి కింద కేంద్ర ప్రభుత్వం "మహిళలు, బాలికల కోసం సమ్మిళిత నగరాలు" కార్యక్రమాన్ని చేపట్టింది. దీంట్లో భాగంగా తెలంగాణలోని ములుగు జిల్లాను ఎంపిక చేశారు. ములుగు జిల్లాను ఎంపిక చేయడం పట్ల తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవిని శనివారం నాడు ఢిల్లీలో కలిసి ధన్యవాదాలు తెలియజేసారు.

ఈ పథకం ద్వారా ములుగు జిల్లాలో మహిళలు, బాలికల భద్రత, గౌరవం, రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు జెండర్–రెస్పాన్సివ్ మౌలిక సదుపాయాలు, మెరుగైన నిఘా వ్యవస్థలు, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. ములుగులో ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేసేందుకు అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారీలో.. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ.. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ పూర్తి సహకారాన్ని అందిస్తుందని కేంద్రమంత్రికి సీతక్క చెప్పారు. మహిళా సాధికారత, భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవను అభినందిస్తూ.. తెలంగాణలో ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు చెప్పారు. తెలంగాణలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల రక్షణను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

### క్రెచ్ వర్కర్లు, హెల్పర్ల వేతనాలు పెంచాలి: మంత్రి సీతక్క విజ్ఞప్తి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పాలనా' (ఘఖ్రీఖ్రు ాాఎష్ట్రవవవ – మిషన్ శక్తి) పథకం కింద పనిచేస్తున్న క్రెచ్ వర్కర్లు, హెల్పర్ల గౌరవ వేతనాలను పెంచాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం క్రెచ్ వర్కర్లకు నెలకు రూ. 5,500, హెల్పర్లకు రూ. 3,000 మాత్రమే గౌరవ వేతనంగా ఇస్తున్నారని.. ఇది వారు చేసే పనికి, బాధ్యతకు ఏమాత్రం సరిపోదని మంత్రి సీతక్క కేంద్రమంత్రికి వివరించారు. ఒక క్రెచ్‌లో దాదాపు 25 మంది పిల్లల సంరక్షణను చూడటం ఎంతో బాధ్యతతో కూడుకున్న పని అని.. ప్రస్తుత జీవన ప్రమాణాల దృష్ట్యా ఈ వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని మంత్రి సీతక్క వివరించారు. తక్కువ వేతనాల వల్ల నిపుణులైన సిబ్బందిని ఈ పథకంలో కొనసాగించడం కష్టమవుతోందని.. ఇది పరోక్షంగా శిశు సంరక్షణపై ప్రభావం చూపుతుందన్నారు. పనిచేసే తల్లులకు అండగా నిలిచే ఈ పథకం విజయవంతం కావాలంటే.. సిబ్బందికి ఇచ్చే వేతనాలను ప్రస్తుత వేతన ప్రమాణాలకు అనుగుణంగా పెంచాలని మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మహిళా సాధికారత, శిశు సంక్షేమం కోసం పనిచేస్తున్న సిబ్బంది ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కేంద్రం ఈ విషయంలో సానుకూలంగా స్పందించాలని కోరారు.

# మామునూరు వద్ద రోడ్డు ప్రమాదం

- ఇద్దరు దుర్మరణం





వరంగల్ ఈస్ట్, మార్చి 14 (జనం సాక్షి) : పాల వ్యాను స్కూటీని ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన శనివారం మధ్యాహ్నం నగరంలోని మామునూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణానికి చెందిన శ్రీపతి వంశీ (26), వరంగల్ నగరంలోని రంగశాయిపేటకు చెందిన శ్రీపతి రాకేష్ (35) లు దూరపు బంధువులు. వీరు ఇరువురు కలిసి రంగశాయిపేట నుండి ఉదయం హోండా యాక్టివా స్కూటీపై ఐనవోలు క్రాస్ రోడ్డు వద్ద గల శ్రీరామ్ ఫైనాన్స్ గోడౌన్ వద్దకు వెళ్లి కారు వేలంపాటలో పాల్గొని తిరుగు ప్రయాణంలో మామునూర్ పోలీస్ స్టేషన్ సమీపంలోకి వస్తున్న క్రమంలో మధ్యాహ్నం రంగశాయిపేట నుండి వర్ధన్నపేటకు వెళుతున్న టీఎస్ 29 టిబి 7395 నంబర్ గల ఆరోగ్య మిల్క్ వ్యాన్ ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టడంతో శ్రీపతి వంశీ, శ్రీపతి రాకేష్ ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎంజీఎం హాస్పిటల్ కు పంపించినట్లు తెలిపారు. మిల్క్ వ్యాన్ డ్రైవర్ సూర్యాపేట జిల్లా తిరుమలగిరి గ్రామానికి చెందిన నరేష్ గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడు రాకేష్ భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మామునూర్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

## నిర్మాణంలో ఉన్న భవనం వద్ద వాచ్‌మెన్ దంపతుల హత్య

**హైదరాబాద్, మార్చి 14 (జనంసాక్షి) :** నగర శివారు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని సిటిజెన్ కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవన వాచ్‌మెన్ దంపతులను కొందరు దుండగులు దారుణంగా హత్య చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గురుడు మండలం దొంగచింత తండాకు చెందిన దంపతులు సోమ్లా దశరథ్ (50), మాన్యమ్మ (45) కొంతకాలం కింద జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని సిటిజెన్ కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనానికి వాచ్‌మెన్‌గా పనిలో చేరారు. అక్కడే నిర్మాణంలో ఉన్న భవనం దగ్గరే ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పనికి వచ్చిన భవన నిర్మాణ సిబ్బంది.. వాచ్‌మెన్ దంపతులను దారుణంగా హత్య చేసినట్లుగా గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు.. ఘటనాస్థలిని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో దర్యాప్తు చేపట్టారు.

# క్రేన్ వైర్ తెగి ముగ్గురు కూలీలు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు





**మొగుళ్లపల్లి మార్చ్14 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ బావిలో పూడిక తీయడంలో ఉపయోగిస్తున్న క్రేన్ వైర్ తెగిపోవడంతో ముగ్గురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మొగుళ్లపల్లి మండలం కొరికిశాల గ్రామంలో జరిగిన ఈ ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన సుకినే దేవారావు (48), బండారి అభిలాష్ (16), పిడిసిల్ల గ్రామానికి చెందిన పైడయ్య (53) స్పాట్లోనే ప్రాణాలు కోల్పోయారు. మరో కూలీ సుకినే మోహన్రావు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బావిలో పూడిక తీస్తుండగా క్రేన్కు అమర్చిన వైర్ ఒక్కసారిగా తెగిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## పాడుబడ్డ బావిలో కుళ్లిన స్థితిలో శవం స్వాధీనం

**హైదరాబాద్, మార్చి14 (జనంసాక్షి) :** పాతబస్తీలో కలకలం రేపిన యువకుడి అదృశ్యం విషాదాంతమైంది. పది రోజులుగా ఆచూకీ లేని యువకుడు ఓ పాడుబడిన బావిలో శవమై తేలడంతో స్థానికంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో పెరుగుతున్న నేరాలు, అనుమానాస్పద మరణాల నేపథ్యంలో ఈ ఘటన పోలీసులకు సవాలుగా మారింది. హైదరాబాద్‌లోని ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో గౌతమ్ కుమార్ (20) కొన్ని రోజులుగా కనిపించకుండా పోయాడు. మార్చి 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన గౌతమ్ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. అయితే.. మార్చి 13వ తేదీ రాత్రి రాజన్న బావి సమీపంలోని 'పులమ్మ బావి' నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తుండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బావిలో చూడగా ఒక మృతదేహం కనిపించింది. ట్యాంక్ బండ్ శివ బృందం సహాయంతో మృతదేహాన్ని వెలికితీయగా.. అది గుర్తుపట్టలేనంతగా కుళ్లిపోయి, అస్థిపంజరంలా మారిపోయింది.

# యువతకు ఉపాధి మార్గంగా సెట్విన్ శిక్షణ

- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం నల్గొండలో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేసే కార్యక్రమం సంస్థ చైర్మన్ ఎస్.గిరిధర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఉపేందర్ రెడ్డి నిర్వహణలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం నల్గొండలో సెట్విన్ ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు విజయవంతంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం 27 రకాల కోర్సులలో యువతకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని, వారి ఉపాధికి అవసరమైన పూర్తి స్థాయి నైపుణ్యాలను సెట్విన్ అందిస్తుందని మంత్రి వివరించారు. చైర్మన్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంలో శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నామ న్నారు. నిరుద్యోగ యువతకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక రాయితీలను అందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మరింత మంది యువతీ యువకులు శిక్షణలో పాల్గొని తమ నైపుణ్యా లను మెరుగుపరు చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి , డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రాఫ్ అలీ అమర్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ బడుగు, ఆర్డీవో అశోక్ రెడ్డి సెట్విన్ ట్రైనింగ్ ఇంచార్జి ఎం.నవీన్ కుమార్, నల్గొండ కేంద్రం ఇంచార్జి రేణుక, కాంగ్రెస్ సీనియర్ నేత బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షల వేళ కంటతడి పెట్టించే ఘటనలు

- ఇంట్లో శవం...పరీక్ష హాలులో విద్యార్థి
- గుండెపోటుతో ప్రభుత్వ టీచర్ మృతి.. కొడుకు దు:ఖంతో పరీక్షకు హాజరు



**మెదక్/ యాదగిరిగుట్ట, మార్చి14 (జనంసాక్షి) :** మెదక్ జిల్లాలో హృదయ విదారక సంఘటన వెలుగులోకి వచ్చింది. శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామశివారులో అర్ధరాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పాంబండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు మృతిచెందారు. నాగరాజుకు శనివారం అంత్యక్రియలు జరగాల్సి ఉంది. అయితే ఈ దు:ఖాన్ని దిగమింగుకొని ఆయన కొడుకు ధనుశ్ పదోతరగతి పరీక్షకు హాజరయ్యాడు. ఈ విషాదకర సంఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. తండ్రి మరణించిన పుట్టెడు దు:ఖంలో కూడా, తన భవిష్యత్తు కోసం కన్నీళ్లతో పరీక్షా కేంద్రానికి వచ్చిన ఆ విద్యార్థి.. తన సహచర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారని స్థానికులు తెలిపారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పాంబండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు (45) అర్ధరాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఉసిరికపల్లి గ్రామ శివారులో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో నాగరాజు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు.

ఇంటి వద్ద తండ్రి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగా, తండ్రి కలలను నిజం చేయాలనే పట్టుదలతో ధనుశ్ పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నారు. తండ్రిని కోల్పోయిన బాధను గుండెల్లో దాచుకుని, కళ్లలో నీళ్లు సుడులు తిరుగుతుండగా ధనుశ్ పదోతరగతి పరీక్షకు ఈరోజు హాజరయ్యారు. తండ్రి మరణించినా ధైర్యం కోల్పోకుండా పరీక్షకు హాజరైన ధనుశ్‌ను చూసి గ్రామస్థులు చలించిపోయారు. 'ఎంత కష్టమొచ్చినా చదువును వదల్లేదు' అంటూ ధనుశ్‌ను ఓదార్చారు. అధికారులు, ఉపాధ్యాయులు కూడా ధనుశ్‌కు ధైర్యం చెప్పారు. ఒక సామాన్య కుటుంబానికి చెందిన నాగరాజు.. తన కొడుకును గొప్పగా చదివించాలని కలలు కనేవారని స్థానికులు తెలిపారు. ఆ కల కోసం ధనుశ్ కన్నీటితో పరీక్ష రాయడం..ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది.

తండ్రి మరణించిన బాధలోనూ ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాడు. చదువుకు ఉన్న విలువ గురించి తన తండ్రి చెప్పిన మాటలను గుర్తు చేసుకుంటూ.. శోకసంద్రంలోనూ పరీక్ష రాసేందుకు వచ్చాడు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ పట్టణంలో జరిగిన ఈ ఘటన అందర్నీ కలిచివేసింది. మోత్కూరు పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కూరెళ్ల హర్షవర్ధన్ పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. అతని తండ్రి కూరెళ్ల ఎల్లయ్య గుండాల మండలం వస్తాకొండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి అతను గుండెపోటుతో మరణించాడు. మరోవైపు హర్షవర్ధన్‌కు శనివారంపదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. దీంతో తండ్రి చనిపోయాడన్న బాధలో ఉండి కూడా శోక సంద్రంలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాడు. పరీక్ష అయిపోయిన తర్వాత మధ్యాహ్నం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొని తలకొరివి పెడతాడని కుటుంబసభ్యులు తెలిపారు. శోకసంద్రంలో ఉన్నప్పటికీ పదో తరగతి పరీక్షకు హాజరైన హర్షవర్ధన్‌ను చూసి స్నేహితులు, ఉపాధ్యాయులు కన్నీటి పర్యంతమయ్యారు. ఒకవైపు తండ్రి మరణించిన బాధ, మరోవైపు భవిష్యత్తు కోసం పరీక్ష రాయాల్సిన పరిస్థితి అందర్నీ కలిచివేసింది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 మార్చి 2026




### అణచివేత నుంచి ప్రతిఘటన వరకు

# తెలంగాణ సాహిత్యంలో మహిళా చైతన్యం

తెలంగాణ ప్రాంత చరిత్రను పరిశీలిస్తే ఇక్కడి తెలుగు సాహిత్యం కేవలం సౌందర్యాన్వేషణకు మాత్రమే పరిమితమైన సాహిత్య ప్రక్రియ కాదు. అది సమాజంలోని అన్యాయాలను ప్రశ్నించిన, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన చైతన్య వేదికగా కనిపిస్తుంది. ముఖ్యంగా మహిళల జీవితం, వారి కష్టాలు, శ్రమ, అణచివేత, తిరుగుబాటు భావనలు తెలంగాణ సాహిత్యంలో బలంగా ప్రతిధ్వనించాయి. ఫ్యూడల్ వ్యవస్థలో బందీగా జీవించిన మహిళ తన బాధను మాత్రమే కాదు, తన ప్రతిఘటనను కూడా వ్యక్తపరచిన సందర్భాలు తెలంగాణ సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో మహిళా చైతన్యం తెలంగాణ సాహిత్యంలో ఒక శక్తివంతమైన ప్రవంతిగా అభివృద్ధి చెందింది.

తెలంగాణ ప్రాంతం చాలా కాలం వరకు జమీందారీ, దొరల ఆధిపత్యం, పితృస్వామ్య విలువలతో నిండి ఉన్న సమాజం. రైతులు, కూలీలు మాత్రమే కాకుండా మహిళలు కూడా ద్వంద్వ దోపిడీకి గురయ్యారు. ఒక వైపు వర్గ దోపిడీ, మరో వైపు లింగ వివక్ష… ఈ రెండు ఒత్తిళ్ల మధ్య మహిళ జీవితం సాగింది. ఈ వాస్తవ పరిస్థితులు తెలంగాణ సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ప్రజా సాహిత్యం, విప్లవ సాహిత్యం మహిళా సమస్యలను ముందుకు తెచ్చాయి.

1940లలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఈ దిశలో కీలక మలుపు. ఈ ఉద్యమంలో వేలాది గ్రామీణ మహిళలు పాల్గొన్నారు. వారు కేవలం సహాయకులుగా కాకుండా పోరాట యోధులుగా కూడా వ్యవహరించారు. ఈ అనుభవాలు ప్రజా పాటల్లో, కథల్లో ప్రతిబింబించాయి. ఈ నేపథ్యంలో విప్లవ కవి వరవర రావు రాసిన కవిత్వంలో మహిళా పోరాట స్ఫూర్తి స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన కవితల్లో మహిళను బలహీనురాలిగా కాకుండా ప్రతిఘటన శక్తిగా చిత్రించారు.

ఇదే ధోరణిని ప్రజాకవి గద్దర్ పాటల్లో మరింత బలంగా చూడవచ్చు. గ్రామీణ మహిళల బాధలు, ఆకలి, శ్రమను ఆయన పాటలు బలంగా ప్రతిబింబించాయి. "బానిసల బతుకుల్ని బద్దలు కొట్టాలి. పోరాడే చేతుల్లోనే వెలుగుంది" అనే భావజాలం ఆయన ప్రజా గీతాల్లో ప్రతిధ్వనిస్తుంది. ఈ పాటలు మహిళలకు కూడా పోరాట చైతన్యాన్ని కలిగించాయి.

తెలంగాణ సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని స్త్రీవాద దృక్పథంతో ముందుకు తెచ్చిన ప్రముఖ రచయిత్రుల్లో వోల్గా ఒకరు. ఆమె కథా సంపుటి "విముక్త" మహిళా స్వేచ్ఛ, వ్యక్తిత్వ స్వాధీనత వంటి అంశాలను తీవ్రంగా ప్రశ్నిస్తుంది. సంప్రదాయ కుటుంబ వ్యవస్థలో మహిళ ఎదుర్కొనే ఆంతర్య సంఘర్షణలను ఆమె సున్నితంగా చిత్రించారు. మహిళ తన జీవితంపై నిర్ణయం తీసుకునే హక్కు కలిగి ఉండాలని ఆమె రచనలు స్పష్టం చేస్తాయి.

అదే విధంగా స్త్రీవాద కవయిత్రి జయప్రభ కవిత్వం మహిళా చైతన్యానికి కొత్త దిశను చూపింది. ఆమె ప్రసిద్ధ కవిత "యశోధర" లో మహిళ మనసు, స్వేచ్ఛ కోసం చేసే అంతర్గత పోరాటాన్ని ప్రతిబింబించారు. ఒక సందర్భంలో ఆమె ఇలా ప్రశ్నిస్తుంది:

"నన్ను తల్లి అని పిలిచే ముందు
నా మనసు ఎక్కడ ఉందో అడిగారా?"

ఈ పంక్తులు మహిళను కేవలం తల్లి లేదా భార్య పాత్రలోనే చూడాలనే పితృస్వామ్య దృష్టికోణాన్ని తీవ్రంగా ప్రశ్నిస్తాయి.

తెలంగాణ ప్రాంతానికి చెందిన మరో ప్రముఖ కవయిత్రి జూపాక సుభద్ర రచనలు దళిత మహిళా అనుభవాలను సాహిత్యంలో ముందుకు తెచ్చాయి. ఆమె కవితా సంపుటి "అయ్యయ్యో దమ్మక్క" లో గ్రామీణ దళిత మహిళల జీవితం, వారి శ్రమ, అవమానాలు, ప్రతిఘటన స్పష్టంగా కనిపిస్తాయి. ఒక కవితలో ఆమె ఇలా రాస్తుంది:

"నా చేతుల్లోని పగుళ్లే నా చరిత్ర
నా చెమటే నా స్వాతంత్రం"

ఈ పంక్తులు దళిత మహిళా జీవితంలోని వాస్తవాన్ని బలంగా వ్యక్తం చేస్తాయి. తెలంగాణ ఉద్యమం సమయంలో కూడా మహిళా చైతన్యం సాహిత్యంలో కొత్త ఉత్సాహాన్ని పొందింది. రాష్ట్ర హక్కుల కోసం జరిగిన ఉద్యమంలో మహిళలు భారీగా పాల్గొన్నారు. ఆ ఉద్యమ గీతాల్లో మహిళల పాత్రను గొప్పగా ప్రతిబింబించారు. ఈ సమయంలో వచ్చిన పాటలు మహిళను కేవలం కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఉద్యమ సైనికురాలిగా చిత్రించాయి. అయితే తెలంగాణ తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం పూర్తిగా సమానత్వాన్ని సాధించిందా అనే ప్రశ్న ఇంకా మిగిలే ఉంది. చాలా సందర్భాల్లో మహిళా పాత్రలు పురుష రచయితల దృష్టికోణంలోనే చిత్రీకరించబడ్డాయి. మహిళా అనుభవాలు పురుషుల ఊహలో మాత్రమే నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. అందుకే మహిళలే తమ అనుభవాలను స్వయంగా రాయాల్సిన అవసరం పెరిగింది.

ఇటీవలి కాలంలో కొత్త తరపు రచయిత్రులు ఈ లోటును పూరించేందుకు ముందుకు వస్తున్నారు. వారు లింగ అసమానతతో పాటు కులం, వర్గం, ప్రాంతం వంటి అస్థిత్వం అంశాలను కూడా తమ రచనల్లో ప్రతిబింబిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు కూడా వారికి ఒక కొత్త వేదికను అందించాయి.

అంతిమంగా చెప్పాలంటే, తెలంగాణలో తెలుగు సాహిత్యం మహిళా చైతన్యానికి కేవలం ప్రతిబింబం మాత్రమే కాదు. అది ఒక ఉద్యమ శక్తి. మహిళా అనుభవాలను సాహిత్యంగా మార్చడం ద్వారా సమాజాన్ని ప్రశ్నించే శక్తిని ఇది కలిగించింది. అణచివేతను సహించే పాత్ర నుంచి ప్రశ్నించే స్వరంగా మహిళ ఎదగడంలో తెలంగాణ సాహిత్యం కీలక పాత్ర పోషించింది. ఇప్పటికీ సమాజంలో పితృస్వామ్య విలువలు పూర్తిగా తొలగిపోలేదు. అందువల్ల మహిళా చైతన్యం సాహిత్యంలో మరింత బలపడాలి. సమానత్వం, గౌరవం, స్వేచ్ఛ అనే లక్ష్యాలను సాధించడానికి సాహిత్యం ఒక శక్తివంతమైన ఆయుధంగా కొనసాగాలి. తెలంగాణలో మహిళా స్వరం ఇంకా బలంగా వినిపిస్తేనే సాహిత్యం నిజమైన ప్రజాస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# బహుజన స్వరాజ్య సిద్ధాంతకర్త కాన్షిరాం

*(కాన్షిరామ్ జయంతి మార్చు 15)*






భారతదేశ సామాజిక-రాజకీయ చరిత్రను వెనక్కి తిప్పి చూస్తే ఒక స్పష్టమైన నిజం కనిపిస్తుంది. ఈ దేశం మెజార్టీ అట్టడుగు అణగారిన వర్గాల కష్టంతో నిర్మితమైనా, అధికారాన్ని మాత్రం శతాబ్దాలుగా ఆధిపత్య కులాల చేతుల్లో కేంద్రీకృతమైనవి. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, బహుజన రాజకీయాల కోసం గళమెత్తిన విప్లవ వీరుడు మాన్యవర్ కాన్సిరాం. ఆయన మార్చి 15,1934 పంజాబ్‌రాష్ట్రంలో రోపార్ జిల్లా, కావాస్‌పూర్ గ్రామంలోనీ చమార్ కులంలో జన్మించాడు. జ్యోతీరావ్ పూలే, ఛత్రపతి సాహు మహారాజ్, పెరియార్, నారాయణ గురు, అంబేద్కర్‌ల ప్రబోధాలతో పేదల రాజ్యం కోసం బయలుదేరిన యోధుడు. అంబేద్కర్ రచించిన "కుల నిర్మూలన" గ్రంథం ద్వారా ప్రేరణ పొంది, రాజకీయ యుద్ధమే బహుజన విముక్తికి మార్గమని నమ్మాడు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీల ఐక్యతే బహుజన రాజ్యాధికారానికి మార్గమని విశ్వసించి బామ్ సేఫ్, డిఎస్-4 వంటి సంస్థలను నిర్మించాడు. 1984 ఏప్రిల్ 14న బహుజన సమాజ్ పార్టీని స్థాపించాడు. ఇదీ 1996 నాటికి జాతీయ పార్టీగా ఎదిగి బహుజన రాజ్యానికి దిక్సూచిగా నిలిచింది. దళిత మహిళ మాయావతినీ నాలుగుసార్లు ముఖ్యమంత్రినీ కావడానికి కారకులయ్యారు. కాన్సిరాం అవిశ్రాంత రాజకీయ పోరాటం 2006 అక్టోబరు 9న ఆగిపోయినది. కాన్షిరాం మన నుంచి దూరమై రెండు దశాబ్దాలు కావస్తున్నా ఆయన స్వరాజ్య పోరాటం అనేక రూపాల్లో కొనసాగుతుంది. ఇటీవల దేశవ్యాప్తంగా వినబడుతున్న కుల గణన, రిజర్వేషన్లు పెంపు వంటి సామాజిక న్యాయ డిమాండ్లు ఇందుకు నిదర్శనం. మరోవైపు తెలంగాణలో 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీలకు భూమి, సంపద, అధికారంలో వాటా కోసం"మా భూమి" పేరుతో డాక్టర్ విశారదన్ మహరాజ్ మహాగర్జన కోనసాగుతుంది. ఈ క్రమంలో నేడు కాన్షీరామ్ రాజ్యాధికార పోరాటం సమీక్షించుకోవాల్సిన సందర్భం ఇదీ.

దేశ రాజకీయాల్లో ప్రకంపనలు

కాన్సిరాం కులాన్ని నిర్మూలిద్దాం-బహుజన రాజ్యాన్ని నిర్మిద్దాం అంటూ దేశ రాజకీయాల్లో సరికొత్త నినాదానికి తెరలేపాడు. నువ్వు 85 శాతం ఉండగా 15 శాతం మీద ఎందుకు ఆధారపడతావు? అని ప్రశ్నించి స్వాభిమానన్నీ నేర్పిన యోధుడు. ఓటు హమారా-రాజ్ తుమారా, నహీ చలేగా.. నహీచలేగా"(ఓట్లు మావి-రాజ్యం మీది, ఇకపై చెల్లదు, ఇకపై చెల్లదు) మరియు జిస్కి జితిని సంఖ్యా భారి, ఉస్కి ఉత్ని ఇస్సేదారి (ఎవరెంతో, వారికంతా) వంటి నినాదాలతో దేశ రాజకీయాల్లో ప్రకంపలను సృష్టించాడు. స్వాతంత్రానంతరం రాజ్యాంగం అమల్లోకి వచ్చాక అటు దేశంలో, ఇటు రాష్ట్రాల్లోనూ అగ్రకుల ఆధిపత్య రైటిస్ట్, లెఫ్టిస్ట్ పార్టీలే అధికారంలో ఉండేవి. 1975 ఎమర్జెన్సీ తరువాత కూడా ఆ పార్టీలే అధికారంలోకి రావడం గమనార్హం. వీటికి అభిముఖంగా కాన్సిరాం బహుజన ఉద్యమం బయలుదేరింది. ములాయం సింగ్ యాదవ్ 1992 కి ముందు జనతా దళ్(సోషలిస్ట్) నుంచి ముఖ్యమంత్రి అయ్యాడు. కాన్సిరాం ఆయనను ఆ పార్టీ నుంచి బయటికి రప్పించి సొంత రాజకీయ పార్టీనీ పెట్టించాడు. ఆ పార్టీ పొత్తుతో 1993లో యూపీలో బహుజన రాజ్యాధికారం చేజిక్కిచ్చుకున్నాడు. కాన్సిరాం బహుజనోద్యమం పంజాబ్, రాజస్తాన్, కర్ణాటక,హర్యానా, ఢిల్లీ,కాశ్మీర్, బీహార్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రభావం చూపింది. ఆయన రాజకీయ చైతన్య పోరాటం వెనుకబడిన కులాల్లో రాజకీయ కాంక్షను రగిలించింది. బారతదేశ కుల వ్యవస్థలో ప్రకంపనలు సృష్టించింది. యూపీలో ములాయం సింగ్ యాదవ్, బీహార్ లో లాలూ ప్రసాద్ యాదవ్, రామ్ విలాస్ పాశ్వాన్, నితీష్ కుమార్ మొదలైనవారు తమ సొంత రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసుకోగలిగారు. రాజకీయంగా అస్తిత్వాన్ని చాటుతున్నారు. దక్షిణాన తమిళనాట ఆత్మగౌరవ రాజకీయాలు, తెలంగాణలో బీసీ ఎస్సీ ఎస్టీల జాక్ వేదికగా డాక్టర్ విశారదన్ మహరాజ్ స్వధర్మ, స్వరాజ్య పోరాటం ఇందుకు నిదర్శనమే.

**ఆత్మగౌరవ యుద్ధమే విముక్తి మార్గం.**

భారతదేశంలో బహుజన రాజకీయ పోరాటం స్వాభిమానానికి, సమానత్వానికి, రాజ్యాధికారానికి సాగిన మహాఉద్యమం. ఇదీ పూలే, అంబేద్కర్ ల నుంచి కాన్సిరామ్ వరకు సాగింది . కానీ ఇంకా దేశ రాజకీయాలు అగ్రకుల కబంధహస్తాల కిందనే నలిగిపోతున్నాయి. రాజ్యాంగం ద్వారా బాగుపడ్డ బుద్ధిజీవులు పూలే, అంబేద్కర్, కాన్సిరాం మార్గాన్ని అనుసరించకపోవడమే దీనికి ప్రధాన కారణం. డాక్టర్ అంబేద్కర్ బహుజనుల విముక్తి స్వతంత్ర రాజకీయ శక్తితోనే సాధ్యమవుతుందని నమ్మాడు. అనాడు అంబేద్కర్ ను డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ చేసినప్పటికీ, న్యాయ శాఖ మినిస్టర్ గా ఇచ్చినప్పటికీ అత్యంత శక్తివంతమైన కాంగ్రెస్ పార్టీలో చేరలేదు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ, షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫెడరేషన్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా వంటి పార్టీలు ఏర్పాటు చేసి రాజకీయ యుద్ధం చేశాడు. కాన్సిరాం బహుజన సమాజ్ పార్టీనీ ఏర్పాటుచేసి బహుజనులకు రాజ్యాధికార రుచి చూపించాడు. దీనికి విరుద్ధంగా నేడు బహుజన మేధావులు తాత్కాలిక ప్రయోజనాలను ఆశించి అగ్రకుల పార్టీల కాళ్ళ దగ్గర స్వాభిమానికి తాకట్టు పెడుతూ తమ స్వతంత్ర రాజకీయ ధృవాన్ని కోల్పోతున్నాయి. ఇది పూలే, అంబేద్కర్, కాన్షిరామ్ మార్గాన్ని తప్పుదారి పట్టించడమే. అంబేద్కర్ 1956 మార్చి 18న ఆగ్రా నగరంలో జరిగిన భారీసభలో ప్రసంగిస్తూ కంటతడి పెట్టుకున్నారు. "నన్ను ఇతరులు కాదు, నా ప్రజలే మోసం చేశారు" అనీ ఆవేదన వ్యక్తం చేశారు. తాను దాదాపు 30 సంవత్సరాలు పోరాడి రాజకీయ హక్కులు, రిజర్వేషన్లు, విద్యా అవకాశాలు సాధించిపెట్టానని చెప్పారు. కానీ చదువుకున్న మేధావులు సమాజ మార్పుకు బయలుదేరకుండా తమ వ్యక్తిగత ఉద్యోగాలు, సౌకర్యాలకే పరిమితమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కారుచీకట్లు చీల్చుకొని నికార్సైన బహుజన నాయకత్వం పుట్టుకొస్తుందనిపిస్తుంది. ఉత్తర భారతదేశంలో భీమ్ ఆర్మీ చీఫ్, ఆజాద్ సమాజ్ పార్టీ (కనిశారం) వ్యవస్థాపకుడు అజాద్ చంద్రశేఖర్ అణగారిన వర్గాల రాజ్యాంగ హక్కుల కోసం ఉద్యమిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో బీసీ ఎస్సీ ఎస్టీల విముక్తి ఉద్యమ సారథి డాక్టర్ విశారదన్ మహారాజ్ బడుగు, బలహీన వర్గాల సామాజిక న్యాయం కోసం యుద్ధం సాగిస్తున్నారు. ధర్మ సమాజ్ పార్టీ వేదికగా ప్రజా సమస్యలపై గళమెత్తుతున్నాడు. భారతదేశంలో బహుజన రాజ్యానికి ఒక కొత్త దిశను చూపుతుందని విశ్లేషకుల భావన. ఇటీవల కుమ్మెర, వెలుగుమట్ల పోరాటం దీనికి నిదర్శనం. మరి బుద్ధి జీవులంతా ఇలాంటి ఆత్మగౌరవ వేదికలకు మద్దతు ఇవ్వాలి లేదా అవి నచ్చకపోతే సొంత వేదికల ఏర్పాటుచేసైనా అట్టడుగు వర్గాల విముక్తికి పోరాడాలి. అంతేకాని అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ కడుపులో తలపెట్టు జాతి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడం పూలే, అంబేద్కర్, కాన్షీరామ్ ఆలోచనలకు విరుద్ధం.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# ఆరోగ్యం.. అందని ద్రాక్షేనా?



తెల్లవారుజామున నాలుగు గంటలకే పసిబిడ్డను చంకన వేసుకుని బస్సు కోసం ఎదురుచూసే తల్లి, ఎముకల గూడులా మారిన ముసలి తండ్రిని రిక్షాపై లాక్కొచ్చే కొడుకు, పైసా ఖర్చు లేకుండా నయమవుతుందన్న ఆశతో వచ్చే కూలీ, వీరందరికీ ఒకటే చిరునామా ప్రభుత్వ ఆసుపత్రి సంపన్నులు కార్పొరేట్ వెలుగుల్లో చికిత్స పొందుతుంటే, సామాన్యుడు మాత్రం పెచ్చులూడుతున్న గోడలు, మందులు లేని ఫార్మసీల మధ్య తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు. మా బృందం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని సుమారు 30కి పైగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHC), జిల్లా ఆసుపత్రులను సందర్శించినప్పుడు అక్కడ కనిపించిన దృశ్యాలు అభివృద్ధి అనే మాటకు నిలువెత్తు విమర్శలుగా నిలిచాయి. తూర్పు గోదావరి జిల్లాలోని ఒక మండల కేంద్రంలో ఉన్నగ్రాంజ లోకి మేము మధ్యాహ్నం 12 గంటలకు అడుగుపెట్టాం. బయట ఎండ మండుతోంది, కానీ లోపల చీకటి రాజ్యం చేస్తోంది. నర్సు కౌంటర్ ఖాళీగా ఉంది. రిజిస్టర్ తెరిచి చూస్తే, గత మూడు నెలలుగా అందులో కొత్త ఎంట్రీలు తక్కువగా ఉన్నాయి. వార్డు మూలన పడి ఉన్న పాత గ్లూకోజ్ బాటిళ్లు ఆ ఆసుపత్రి దుస్థితికి సాక్ష్యాలు. అక్కడ మాకు ఒక వృద్ధుడు కనిపించాడు. తన మనవడికి జ్వరం వస్తే తీసుకొచ్చాడు. డాక్టరు గారు పొద్దున ఎనిమిదింటికి వస్తారు. పదింటికి వెళ్ళిపోతారు. మళ్ళీ రేపు పొద్దున్నే చూడాలి అంటున్నారు, అని ఆయన నిట్టూర్చాడు. ఆ మాటల్లో ఆగ్రహం కంటే ఎక్కువగా అలవాటైపోయిన నిస్సహాయత కనిపించింది. వైద్యులు లేని ఆసుపత్రి పేదవాడికి ఒక ఖాళీ సత్రం తప్ప మరేమీ కాదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో వేల సంఖ్యలో ఆరోగ్య కేంద్రాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. కానీ మా గ్రౌండ్ రిపోర్టులో తేలిందేమిటంటే, అత్యవసర మందుల జాబితాలో (Essential Medicines List) ఉండాల్సిన 40% మందులు స్టాక్ లేవు. పారాసిటమాల్ వంటి సామాన్య బిళ్ళ నుండి, డయాబెటిస్ రోగులకు ప్రాణాధారమైన ఇన్సులిన్ వరకు ప్రతిదీ అయిపోయింది అనే సమాధానమే వినిపిస్తోంది. నల్లగొండ జిల్లాలో మాకు కలిసిన ఒక పేద రైతు గోడు వింటే వ్యవస్థ ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతుంది. నాకు బీపీ ఉంది. నెలకు ఒకసారి ఇక్కడికి వస్తాను. మందులు ఉంటే ఇస్తారు, లేకపోతే బయట మెడికల్ షాపులో కొనుక్కోమంటారు. నా రెక్కల కష్టం మందులకే సరిపోతే, ఇంక తిండికి ఏం మిగులుతుంది? అని ఆయన ప్రశ్నించాడు. ఉచిత వైద్యం అనేది కేవలం బోర్డులకే పరిమితమైందా అనిపిస్తుంది. వైద్యుల కొరత అనేది నేడు ఒక దీర్ఘకాలిక వ్యాధిలా మారింది. ఏపీలో గ్రాంజ స్థాయిలో దాదాపు 35% పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంచనా. ఒకే వైద్యుడు రెండు, మూడు కేంద్రాలకు ఇన్చార్జ్ గా వ్యవహరించడం వల్ల ఏ ఒక్క కేంద్రానికి పూర్తిస్థాయి న్యాయం జరగడం లేదు. ఇక గైనకాలజిస్టులు, పీడియాట్రీషియన్ల కొరత వల్ల గ్రామీణ గర్భిణులు ప్రసవం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని 40 నుండి 80 కిలోమీటర్లు ప్రయాణించి ఆసుపత్రికి చేరేలోపు జరగరాని నష్టం జరిగితే దానికి బాధ్యులెవరు? ప్రభుత్వ ఆసుపత్రి లోపలికి వెళ్లగానే వచ్చే ఆ విలక్షణమైన వాసన అక్కడ ఉండేవారి ఆరోగ్యానికే ప్రమాదకరం. శ్రీకాకుళం జిల్లా ఆసుపత్రిలో మేము గమనించిన అంశాలు భీతిని కలిగించాయి. మహిళా వార్డులో పగిలిన టైల్స్,



మురికి పట్టిన బెడ్ షీట్లు, దోమల బెడద. ఇదా రోగులు కోలుకోవాల్సిన వాతావరణం? పలు కేంద్రాల్లో కనీసం తాగడానికి మంచినీరు లేదు, మరుగుదొడ్లలో నీటి సదుపాయం మృగ్యం. రోగుల సహాయకులు బావుల దగ్గరకు పరుగెత్తాల్సి వస్తోంది. జనరేటర్ సౌకర్యం లేనిగ్రాంజలు ఎన్నో ఉన్నాయి. ఒక నర్సు మాతో మాట్లాడుతూ, కరెంటు పోయినప్పుడు మొబైల్ ఫ్లాష్లైట్ వెలుతురులో ప్రసవాలు చేశాంఅని చెప్పినప్పుడు, ఈ డిజిటల్ యుగంలో మనం ఎక్కడ ఉన్నామో అనిపించింది. ఆపరేషన్ థియేటర్లలో పరికరాలు తుప్పుపడుతున్నాయి. అనస్థీషియా మెషిన్ పాడై నెలలు గడుస్తున్నా, ఫైల్ పెండింగ్ లో ఉందన్న సమాధానమే వస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్స్రే, స్కానింగ్, రక్త పరీక్షలు ఉచితం అని ప్రభుత్వం ఘనంగా ప్రకటిస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. 70% మంది రోగులు బయటి ప్రైవేట్ ల్యాబ్లకు వెళ్లాల్సి వస్తోంది. విజయనగరం జిల్లాలో ఒక గర్భిణి మాకు తన ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇక్కడ మెషిన్ పాడైందని చెప్పారు. బయట స్కాను 600 రూపాయలు అడిగారు. మాకు అది పెద్ద మొత్తం. ప్రభుత్వం ఉచితం అని ఎందుకు చెబుతుందో అర్థం కాదు,అని నిలదీసింది. యంత్రాలు ఉన్నా టెక్నీషియన్లు లేకపోవడం, టెక్నీషియన్లు ఉన్నా రీజెంట్స్ లేకపోవడం ఒక ప్రహసనంగా మారింది. ఈ లోపాలన్నింటికీ కేవలం సిబ్బందిని నిందించడం సరికాదు. ఉన్న కొద్దిమంది సిబ్బందిపై పని ఒత్తిడి విపరీతంగా ఉంది. ఒకే నర్సు డబుల్ షిప్పులు చేస్తూ, సెలవు దొరకక సతమతమవుతున్న దృశ్యాలు మమ్మల్ని కలిచివేశాయి. మేము రోబోలం కాదు, మనుషులమే. కానీ రోగుల బాధ చూడలేక పని చేస్తున్నాం, అని ఒక నర్సు కన్నీళ్లు పెట్టుకుంది. అంతేకాకుండా, ఆశా వర్కర్లు,ఏఎన్ఎంల పరిస్థితి మరింత దయనీయం. అతి తక్కువ వేతనాలతో, నెలల తరబడి పెండింగ్ ఉన్న జీతాలతో వారు వ్యవస్థను నడిపిస్తున్నారు. గుర్తింపు లేని శ్రమ వారిని నిరుత్సాహానికి గురిచేస్తోంది. విశాఖపట్నం వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు గుండె తరుక్కుపోయే నిజాలు తెలిశాయి. అక్కడగ్రాంజ అంటే ఒక చిన్న గది. అత్యవసర సమయంలో అంబులెన్స్ రాదు. పాము కాటు వేసినా, ప్రసవ వేదన వచ్చినా రోగిని డోలీలో మోసుకెళ్లడం లేదా ట్రాక్టర్లపై తరలించడం నేటికీ కొనసాగుతోంది. వ్యాక్సినేషన్ రికార్డులు 100% అని చెబుతున్నా, తండాల్లోని పిల్లలను చూస్తే వారిలో చాలా మందికి టీకా కార్డులే లేవు. అంటే, అభివృద్ధి బాట అడవి దారిని ఇంకా చేరుకోలేదు. ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీ వంటి పథకాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నాయి. కానీ నిపుణుల విశ్లేషణ ప్రకారం, ఆరోగ్య రంగానికి కేటాయించిన బడ్జెట్ రాష్ట్ర ఆదాయంలో (+ఞ్ఞా) కేవలం 1.2% మాత్రమే. జాతీయ సగటు 1.8% కంటే ఇది తక్కువ. ఔనూ సిఫారసు చేసిన 5% లక్ష్యానికి మనం దరిదాపుల్లో కూడా లేము. కేటాయింపులు పెరగకుండా, క్షేత్రస్థాయిలో మార్పు రావడం అసాధ్యం. నిరాశ నిండిన ఈ పరిస్థితుల్లో కూడా కొన్ని ఆశ కిరణాలు కనిపించాయి. కర్నూలు జిల్లాలోని ఒకగ్రాంజ లో ఒక యువ వైద్యుడు తన సొంత చొరవతో మందుల నిల్వను ఆన్లైన్ చేశాడు. రోగుల ఫాలో అప్ కోసం వాట్సాప్ గ్రూపులను వాడుతున్నాడు. అక్కడ రోగుల ముఖాల్లో సంతృప్తి కనిపించింది. అంటే, వ్యవస్థలో చిత్తశుద్ధి ఉంటే మార్పు సాధ్యమేనని ఇది నిరూపిస్తోంది. యుద్ధ ప్రాతిపదికన వైద్యుల, నర్సుల పోస్టులను భర్తీ చేయాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వారికి అదనపు ప్రోత్సాహకాలు అందించాలి. మందుల సరఫరాలో పారదర్శకత కోసం రియల్ టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. యంత్రాల మరమ్మత్తుల కోసం స్థానిక స్థాయిలోనే నిధులు కేటాయించే అధికారం ఆసుపత్రి కమిటీలకు ఇవ్వాలి. ఆసుపత్రుల్లో పరిశుభ్రతను ప్రైవేట్ ఏజెన్సీలకు కాకుండా, పటిష్టమైన పర్యవేక్షణ గల వ్యవస్థకు అప్పగించాలి. ప్రభుత్వ ఆసుపత్రి అనేది కేవలం వైద్యం చేసే చోటు కాదు, అది ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఒక వాగ్దానం. రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి ఆరోగ్యం ఒక హక్కు. కానీ మా పర్యటనలో తేలిన సత్యం ఏమిటంటే ఆ హక్కు నేడు అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతోంది. నిధులు, నియామకాలు, మరియు అన్నింటికీ మించి మానవత్వం తోడైతేనే ప్రభుత్వ ఆసుపత్రులు మళ్ళీ పేదల ప్రాణదాతలుగా మారుతాయి. పాలకులు గణాంకాలను పక్కన పెట్టి, రోగి కళ్లలోని నిస్సహాయతను చూడవలసిన సమయం ఆసన్నమైంది.



డా.సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# అమెరికా యుద్ధాలకు అర్థం వుంది!

'ఇరాన్ తో అమెరికా చేసే యుద్ధానికి అర్థం లేదు' అని మాజీ భారత దౌత్యవేత్త తల్మీజ్ అహ్మద్ ఒక ఇంటర్వ్యూలో అన్నారు. కానీ అది పొరబాటు వ్యాఖ్య. అమెరికా చేసే ప్రతీ యుద్ధానికి ఒక అర్థం ఉంటుంది. ఒక చోట 'ఆధిపత్యం' ఉంటుంది. ఇంకో చోట 'ఆయిల్' ఉంటుంది. మరొక చోట 'దురాక్రమణ' ఉంటుంది. వేరొక చోట అంతర్గత వ్యవహారాల్లో 'జోక్యం' ఉంటుంది.

ఇవన్నీ సామ్రాజ్యవాద లక్షణాలే. వీటి గురించి మార్క్స్-ఎంగెల్స్‌లు చాలా కాలం క్రితమే చెప్పారు. 'బుర్జువా శక్తులు తమ మార్కెట్ల కోసం ప్రపంచం అంతటా విస్తరిస్తాయ'ని రాశారు. 'యుద్ధాల వెనుక మార్కెట్లు, వనరులు, ఆధిపత్యమే ఉంటాయ'ని లెనిన్ చెప్పాడు. 'పెట్టుబడిదారీ వ్యవస్థకు విస్తరణ అవసరం. కొత్త ప్రాంతాలు, కొత్త మార్కెట్లు లేకపోతే అది నిలబడలేదు' అని రోజా లగ్జెంబర్ అన్నారు. అంటే సామ్రాజ్యవాదం 'బయటకు విస్తరించాల్సిందే' అని ఆమె భావం. కొత్త మార్కెట్లు, కొత్త వనరులు లేకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ నిలబడలేదని కూడా చెప్పారు.

ఈ మాటలన్నీ ట్రంప్ కి సరిగ్గా సరి పోతాయి. ఒక్క 'ట్రంప్' అనే కాదు; వైట్ హౌస్ లో ఎవరు కూర్చున్నా అంతే. వైట్ హౌస్ స్వభావమే అది. రాజకీయంగా చెప్పాలి అంటే; 'వాషింగ్టన్ స్వభావమే' అంత. చెగువేరా మాటల్లోనే చెప్పాలి అంటే 'అమెరికా సామ్రాజ్యవాదం ఎక్కడైనా జోక్యం చేసుకుంటుంది; ఎందుకంటే ప్రపంచాన్ని తన ఆధిపత్యంలో ఉంచుకోవాలనేది దాని లక్ష్యం'

చెగువేరా మాటల్ని నిజం చేస్తూ 1970లో అమెరికాకు విదేశాంగ విధానాన్ని రచించిన హెన్రీ కిసెంజర్ కూడా ఒక చోట 'చమురు అంత ముఖ్యమైన వనరు; దాన్ని కేవలం అరబ్ దేశాల చేతుల్లోనే వదిలేయడం సరైంది కాదు' అని అన్నాడు. అంటే 'చమురు నియంత్రణలో ఉంటే దేశాలనే నియంత్రించవచ్చు' అని అమెరికా అభిప్రాయం. 'ఇరాన్ అణ్వాయుధాల్ని తయారు చేస్తుంది అందుకే దాడుల్ని చేశాము' అనేది పైకి చెప్పే మాట. (అణ్వాయుధాల్ని తయారు చెయ్యంది ఎవరు? ఇజ్రాయెల్ 1966 లోనే తయారు చేసింది.)

'మంచి కుక్కను చంపాలి అంటే పిచ్చి కుక్క అని ప్రచారం చెయ్యాలి' అంటారు. ఎవరి మీదైనా దాడి చెయ్యాలి అని అనుకుంటే 'ఆ దేశం దగ్గర అణ్వాయుధాలు ఉన్నాయి' అంటూ వైట్ హౌస్ మొదటగా ఒక ప్రచారాన్ని మొదలెడుతుంది. 'అణ్వాయుధాల' పేరుతో 2003 లో ఇరాక్ మీద దాడి చేసింది. 'రసాయన ఆయుధాల' పేరుతో 2017 లో సిరియాపై బాంబులు వేసింది. 1998 లో సూడాన్‌లో ఔషధ కర్మాగారం మీద క్షిపణులతో దాడి చేసింది.

ఒక్కో దేశం మీద దాడి చేయడానికి ఒక్కో కారణం చెబుతుంది అమెరికా. దక్షిణ ఆసియాలో కమ్యూనిజం వ్యాప్తిని అడ్డుకోవాలనే పేరుతో 1965 లో వియత్నాం మీద పెద్ద యుద్ధం చేసింది. 'ఆ దేశ ప్రజలను రక్షించాలి' అనే పేరుతో నాటో ని కలుపుకొని 2011 లో లిబియా మీద దాడి చేసింది. 'ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం' అనే పేరు చెప్పి 2001 లో ఆఫ్ఘనిస్తాన్ మీద రెండు దశాబ్దాలపాటు యుద్ధం చేసింది. మధ్య ఆసియా ప్రాంతంలో తన సైనిక ఉనికి ని పెంచుకుంది. 1983లో గ్రెనడా పైన దాడి చేసినప్పుడు 'విద్యార్థులను రక్షించాల'న్నది అమెరికా చెప్పిన అధికారిక కారణం. కానీ అసలు కారణం వేరే వుంది. అది, కరీబియన్ ప్రాంతంలో సోషలిస్టు ప్రభావాన్ని అణచడం, తన ఆధిపత్యాన్ని చూపించడం.

'డ్రగ్ అక్రమ రవాణా మరియు అమెరికా పౌరుల భద్రత' అనే కారణాన్ని చూపించి, పనామా నాయకుడైన 'మానువెల్ నోరియేగా' ను పట్టుకోవడానికి అని చెప్పి, 1989లో పనామా మీద దాడి చేసింది. పనామా మీద దాడి చేయడానికి అమెరికా చెప్పిన కారణం కాకమ్మ కథ. అసలు కథ వేరే వుంది. అది కాలువ సమస్య. 'పనామా కెనాల్ ప్రాబ్లెమ్' అని దానిని అంటారు. పనామా కాలువ అట్లాంటిక్ సముద్రాన్ని మరియు పసిఫిక్ సముద్రాన్ని కలిపే చిన్న మార్గం. ఈ కాలువ వల్ల అమెరికా తూర్పు తీరంలో ఉన్న నౌకలు పసిఫిక్‌కు త్వరగా వెళ్తాయి. ప్రపంచ వ్యాపార నౌకలకి దూరం వేల కిలోమీటర్లు తగ్గుతుంది. సైనిక నౌకల కదలిక కూడా వేగంగా ఉంటుంది. ఇది 'ప్రపంచంలో అత్యంత వ్యూహాత్మకమైన మార్గం' అంటూ ఉంటారు.

20వ శతాబ్దం ప్రారంభంలో కాలువ నిర్మాణాన్ని ముందుగా ఫ్రాన్స్ ప్రయత్నించింది కానీ విఫలమైంది. తరువాత ఈ ప్రాజెక్ట్ యునైటెడ్ స్టేట్స్ కి వొచ్చింది. 1903లో పనామా కొలంబియా నుంచి విడిపోయేందుకు అమెరికా సహాయం చేసింది. దానికి ప్రతిఫలంగా అమెరికాకు కాలువ ప్రాంతంపై నియంత్రణ ఇచ్చారు.అప్పటి అమెరికా ప్రెసిడెంట్ జిమ్మీ కార్టర్, పనామా నాయకుడు ఒమర్ టోరిహోస్ ల సంతకాలతో 1977 లో 'పనామా కాలువ ఒప్పందం' అంటూ ఒకటి జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం పనామా కాలువ మీద అమెరికా నియంత్రణను క్రమంగా పనామాకి ఇవ్వాలని నిర్ణయించారు (పూర్తిగా 1999లో పనామాకు వెళ్లింది). ప్రకృతిలో ఒక్కో వనరు ఒక్కో చోట పుడుతుంది. ఆ వనరు ఏ మేరకు మానవాళికి అవసరమో ఆ మేరకు ఆ ప్రాంతం సంపన్నమవుతుంది. అరబ్ దేశాలు అలా సంపన్నం కావడం అమెరికాకు అనాదిగా కంటగింపుగానే వుంది.

చమురు, గ్యాస్ ఉన్న ప్రాంతాలన్నిటినీ కబళించాలనేది అమెరికా చిరకాల వాంఛ. ప్రతీ దాడీ దానికోసమే! ప్రతీ యుద్ధమూ దానికోసమే!

నన్నూరి వేణుగోపాల్
9849449012

# రూ. 950 కోట్లతో ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు డబల్ డెక్కర్ ఫ్లైఓవర్

- హయత్‌నగర్‌లో రూ. 10 కోట్లతో రోడ్డు విస్తరణ
- పనులకు శంకుస్థాపన చేసిన
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హయత్‌నగర్, మార్చి 14 (జనం సాక్షి) :** ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు రూ. 950 కోట్ల వ్యయంతో డబల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనున్నామని, త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించనుందని రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. హయత్ నగర్ లోని సాయిబాబా గుడి చౌరస్తా నుంచి జి స్కూల్ వరకు రూ. 10 కోట్ల తో చేపట్టనున్న పాత నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మెట్రో రైల్ తో కూడిన డబల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం కేంద్ర మంత్రి గడ్కరీ ని పలుమార్లు కలిసి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో సానుకూలత తెలిపారని, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.200 కోట్లను ముందస్తుగా చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి ఢిల్లీకి వెళ్లి మెట్రో తో డబుల్ డెక్కర్ రోడ్డును సాంక్షన్ చేయించుకొని వస్తామని తెలిపారు. రెండు నెలల్లో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. రోడ్ల విస్తరణ కోసం ఆర్ అండ్ బి తరపున ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోనే రూ. 400 కోట్ల నిధులను మంజూరు చేశామని, హయత్ నగర్ నుంచి తారామతి పేట్ వరకు, కోహెడ ఫ్రూట్ మార్కెట్ రోడ్డు, ఇంజాపూర్ రోడ్డు తదితర రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు వారు వివరించారు. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి విస్తరణను కూడా ఎంపీగా ఉన్నప్పటి నుంచి పోరాడి మంజూరు చేయించానని తెలియజేశారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, అంతే కాకుండా రూ. 10 వేల కోట్లతో విజయవాడ వరకు సర్వీస్ రోడ్ల ను కూడా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, ఉచిత బస్సు, ఉచిత కరెంటు, రేషన్ కార్డుల పంపిణీ తదితర సంక్షేమ పథకాలతో పేదల ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కాలుష్యం బారిన పడిన మూసీని పునరుజ్జీవం చేపట్టడం ఆవశ్యకమని, ఇల్లు కోల్పోయే వారికి ఎక్కడికక్కడ పునరావాసం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయం లో బస్సు చార్జీలు కూడా లేని ఆ పార్టీ నాయకులు అవినీతితో వేలకోట్లకు ఎదిగారని విమర్శించారు. ఉమ్మడి ఏపీలో నిధులన్నీ ఆంధ్రాకే తరలించే వారన్నారు. తెలంగాణ కోసం మధు యాష్కి, తాను సోనియా గాంధీకి వివరించి ఒప్పించామన్నారు. తెలంగాణ ఉద్యమంలో.. అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డిని సైతం ఎదిరించి రాష్ట్ర ఏర్పాటు కోసం మధుయాష్కి పోరాడారని మంత్రి వెంకట రెడ్డి గుర్తు చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు డబల్ డెక్కర్ రోడ్డు ఏర్పాటు కోసం మంత్రి వెంకట్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, కేంద్ర మంత్రి గడ్కరి తో వ్యక్తిగత అనుబంధంతో రోడ్డు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. హయత్ నగర్ వద్ద పాత హైవే తో పాటు బాతుల చెరువు నుంచి ఇంజాపూర్ వైపు కూడా రోడ్డును విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. మూసీ పునర్జీవం పై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణను తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మూసీ పరివాహ ప్రాంతం లో గృహపకరణాలు, ఆభరణాలు పాడవుతున్న తీరు చూస్తుంటే కాలుష్య తీవ్రత ఎంత ఉందో తెలుస్తుందన్నారు. గతంలో మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ చైర్మన్ గా ఉన్న స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఏమి అభివృద్ధి చేశాడని, ఎన్ని నిధులు తీసుకొచ్చాడో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంపీగా పనిచేసిన ఎల్బీనగర్ పై ప్రత్యేక అభిమానం ఉందని, అభివృద్ధి కోసం అత్యధిక నిధులు కేటాయిస్తున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలంగాణ ఉద్యమంలో తన పదవిని సైతం లెక్కచేయకుండా పోరాడారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మల్ రెడ్డి రామ్ రెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు డబల్ డెక్కర్ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే ట్రాఫిక్ సమస్య ఎంతో తీరుతుందని ఆశభావాన్ని వ్యక్తం చేశారు. పాత హైవేను జి స్కూల్ వరకే కాకుండా రేడియో స్టేషన్ వరకు విస్తరించాలని మంత్రి ని కోరారు. రోడ్డు విస్తరణ సందర్భంగా ఇల్లు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని, టిడిఆర్ ఇవ్వాలని కోరారు. ఎల్బీనగర్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంత్రి వెంక రెడ్డి వందల కోట్ల నిధులను కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలియజేశారు. కాగా రైల్వే స్టేషన్ వరకు రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎండ్బీ శాఖ ఈఎన్సీ మోహన్ నాయక్, నేషనల్ హైవే సీఈ ధర్మా రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, దేవాలయ కమిటీల డైరెక్టర్లు, సేవాదళ్, , మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ, విభాగాల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

## చట్టాన్ని ఉల్లంఘిస్తున్న హైడ్రా ఆగడాలను అసెంబ్లీలో నిలదీస్తాం

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**నిజాంపేట్, మార్చి 14 (జనం సాక్షి) :** బాచుపల్లి లోని ఏపీ ఆర్ ప్రణవ్ ఆంటీల్లా లో జరుగుతున్న తీరు చూస్తే కేవలం రియల్ ఎస్టేట్ దందా కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ హైడ్రా చేస్తున్న ఆగడాలతో ఆందోళనకు గురవుతున్న బాచుపల్లి "ఏపీఆర్ ప్రణవ్ ఆంటీల్లా" బాధితుల కోసం అండగా ఉంటామని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ తెలిపారు. కుతుబుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి లోని ప్రణవ్ ఆంటీల్లా బాధితుల సమస్యను పరిశీలించేందుకు శనివారం ఎమ్మెల్యే ఏపీ వివేకానంద పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. హెచ్ఎండిఏ ప్లాట్ల విక్రయాల కోసం రియల్ ఎస్టేట్ దందా చేసేందుకు గ్రీన్ జోన్ గా ఉన్న ప్రాంతంలో అక్రమంగా రోడ్డు వేస్తూ హైడ్రా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ప్రభుత్వమనేది ప్రజలకు అభివృద్ధిని, సంక్షేమాన్ని అందించే విధంగా నిర్ణయాలు తీసుకోవాలి. కానీ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ అనాలోచిత నిర్ణయాలను చేస్తూ హైడ్రా పేరుతో భయపెట్టడం సరికాదు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ హైడ్రా నిర్వహిస్తున్న ఆగడాలను అసెంబ్లీలో నిలదీస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ ప్రణవ్ ఆంటీల్లా సంక్షేమ సంఘం సభ్యులు రాజిరెడ్డి, నాగిరెడ్డి, సంతోష్, ఆనంద్, రమణ, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, గాజుల సుజాత, రవి కిరణ్, జ్యోతి నరసింహారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డి



**మెదక్, మార్చి 14 (జనం సాక్షి) :** మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మదేవేందర్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. శనివారం రామాయంపేటలో జరిగిన పెద్దమ్మ జాతర ఉత్సవాలలో పాల్గొని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతుండగా శంకరంపేట్ ఆర్ మండలం టీ మందాపూర్ రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తికి ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడిపోయాడు. దీనిని గమనించిన పద్మదేవేందర్ రెడ్డి వెంటనే తన కారు ఆపి ఆ వ్యక్తి వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. తక్షణమే అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో పద్మదేవేందర్ రెడ్డి చూపిన చొరవకు అక్కడున్న పలువురు అభినందనలు తెలిపారు.

## విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి



**గద్వాల నడిగడ్డ, మార్చి 14 (జనం సాక్షి) :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా రాణించాలంటే విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గురుకుల విద్యా సంస్థల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఇంటి వద్ద కన్నా గురుకులాల్లోనే మంచి ఆహారాన్ని అందించడం జరుగుతుందని, విద్యార్థులు గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పదవ తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి పరీక్షకు నాలుగైదు రోజులు గ్యాప్ ఉండడంతో విద్యార్థులు బాగా చదివి ఎక్కువమంది 500 కు పైగా మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి ప్రార్థనలు చేసి, ఇఫ్తార్ విందులో పాటు విద్యార్థులతో భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గురుకులంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారి నుషిత, మైనారిటీ సంఘ నేత అతికూరు రెహమాన్, ప్రిన్సిపల్ భవాని, తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ తోఫాలో రాజకీయం తగదు

- మైనార్టీ మత పెద్దలను అగౌరపరచడం ఏమిటి
- కాంగ్రెస్ పార్టీ బ్రిటీష్ పాలన కొనసాగిస్తుంది
- బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్‌లు




**తాండూరు, మార్చి 14 (జనంసాక్షి) :** ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు ఉంటూ రంజాన్ మాసాన్ని భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తారు. తాండూరు పట్టణంలోరంజాన్ తోఫాలో రాజకీయం చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు పేర్కొన్నారు. శనివారం తాండూర్ పట్టణం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నివాసంలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పార్టీ పాలనలో పట్టణంలోని మైనార్టీ సోదరులకు పార్టీలకతీతంగా రంజాన్ కిట్లను పంపిణీ చేశామని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రంజాన్ తోపాలో అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. స్తానిక కౌన్సిలర్ లకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ నేతలు ఇష్టాను సారంగా వవహరిస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ పాలనలో పార్టీ లకు అతీతంగా రంజాన్ తోపా ఇచ్చామని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఓటమి పాలైనకాంగ్రెస్ నాయకులకు రంజాన్ తోఫా ఇవ్వడం సిగ్గు చేటన్నారు. కలుపుకోని పోతామని నితులు చెబుతున్నారు. పార్టీలకు అథితంగా పని చేయాలన్నారు. రంజాన్ తోఫాలో కూడా రాజకీయమా అని ప్రశ్నించారు. ఇష్టానుసారంగా వ్యవహారించడం తగదన్నారు. పట్టణంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్లు మైనార్టీ లకు అందరికీ అందేలా చూడాలని కోరారు. ఆరకోర కిట్లకు కారణం ఎమ్మార్వో నా అని ప్రశ్నించారు. మహిళలు మహిళలకే ప్రదాన్యత కరువైందని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ లను చిన్న చూపు తగదన్నారు. అధికారపార్టీ కించపరిచేలా చూస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి పాలైన కాంగ్రెస్ పార్టీ నాయకులు పెత్తనం తగదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల చేత ఎన్నుకోబడిన 12 మందిని కౌన్సిలర్లను గెలుపొందామని గుర్తు చేశారు. కాంగ్రెస్ బ్రిటిష్ పాలన కోనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్‌లు ఈర్షాద్, అనిల్, యోగానంద్, జావిద్ నాయకులు సంతోష్ గౌడ్, ఇంతియాజ్ బాబ ఎజాజ్ తదితరులు ఉన్నారు.

## హుడా ట్రేడ్ సెంటర్‌లో శోభయమానంగా రాజాగోపుర శిఖర ప్రతిష్ట



**శేరిలింగంపల్లి, మార్చి 14 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధి హుడా ట్రేడ్ సెంటర్ లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం రాజగోపుర శిఖర ప్రతిష్ట అత్యంత వైభవంగా సాగింది. ఆ మనోహర కార్యక్రమానికి హాజరైన భక్తకోటి ఉచ్చరించిన శ్రీరామ నామ జపంతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. రాజగోపుర శిఖర ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ, శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అరికపూడి, రాగం కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి అరికపూడి మాట్లాడుతూ వేదకోవిదులైన బ్రహ్మశ్రీ కన్నెపల్లి శివరామచంద్రమూర్తి గురువు పర్యవేక్షణలో వేద బ్రాహ్మణోత్తములచే పరిక్రియలు, క్రతువులు, పూజారి కార్యక్రమాలను నిర్వహించి రాజగోపుర శిఖరాన్ని ఓ దివ్య ముహూర్తాన శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రతిష్టించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన ఈ సత్ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు విచ్చేయడంతో శేరిలింగంపల్లి డివిజన్ ఆధ్యాత్మికతను సంతరించుకొని పండుగ వాతావరణం ఆపాదించుకుందన్నారు. ఎంతో మహిమాన్వితుడైన శ్రీ సీతారామచంద్రమూర్తి దివ్య ఆశీస్సులు శేరిలింగంపల్లి ప్రజలకు ఎల్లవేళలా అందాలని, నియోజకవర్గం దినదిన ప్రవర్ధమానమై రాష్ట్రంలోనే పేరెన్నిక గలిగిన నియోజకవర్గంగా రూపుదిద్దుకోవాలని అరికెపూడి, రాగం ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం భక్తులంతా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ప్రశాంతమైన వాతావరణంలో పదో తరగతి పరీక్షలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 14 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా సాగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మొదటిరోజు గచ్చిబౌలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్నీ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తనిఖీ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరీక్షల సరళిని పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు ప్రథమ చికిత్స మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు తగిన సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల్లో వసతులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని సూచించారు..

# కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, మార్చి 14 (జనంసాక్షి) :** జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్లో గ్యాస్ సరఫరా పరిస్థితిపై అదనపు కలెక్టర్ అమరేందర్ తో కలిసి గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, గ్యాస్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు, డీటీలతో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనే సేవా భావంతో పని చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంటుందని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లాలోని 17 గ్యాస్ ఏజెన్సీల ద్వారా రోజువారి పంపిణీ ప్రక్రియ,నిలువలు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎల్పీజీ డీలర్ల దగ్గర బుకింగ్ స్టాక్, సరఫరాపై సమావేశంలో సమీక్షించి ప్రతి రోజు రిపోర్ట్ సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ప్రజలు ఆందోళన చెందవద్దని, ఎల్పీజీ గ్యాస్కు ఎలాంటి కొరత లేదని తెలిపారు. ఆస్పత్రులు, విద్యా సంస్థలకు చెందిన వసతి గృహాలు, అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు వంటి సంస్థలకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో గృహ అవసరాల గ్యాస్ సిలిండర్ వాణిజ్య అవసరాలకు వినియోగించినా, స్టాక్ నిల్వ చేసినా చర్యలు తప్పవని, పౌర సరఫరాల శాఖ అధికారులు, డీటీలు, ఎస్ఐలతో కూడిన ఐదు బృందాలను ఏర్పాటు చేశామని, హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎల్.పీ.జీ సిలిండర్ల పంపిణీని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్ మార్కెట్లో గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తే, నిత్యావసర సరకుల చట్టం, 1955 ప్రకారం.. కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపార, వాణిజ్య దుకాణాల నుండి స్వాధీనం చేసుకుని వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, గురుకులాలకు, ఆసుపత్రులకు, అంగన్వాడీ కేంద్రాలకు, అనాధశ్రమాలకు ఇండెంట్ లు అందిన వెంటనే జాప్యానికి తావు లేకుండా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని ఏజెన్సీల నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు, రోగులు, వారి అటెండెంట్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని అన్నారు. ఆసుపత్రులలో ఇన్ పేషంట్ల సంఖ్యకు అనుగుణంగానే సిలిండర్లు ఇండెంట్ పెట్టేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని డీ.ఎం.హెచ్.ఓ ను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల కొరత ఎంతమాత్రం లేదని అన్నారు. ఆన్లైన్లో బుక్ చేసుకున్న వినియోగదారులకు డెలివరీ జరగాలన్నారు. సిలిండర్ నిర్దేశించిన పరిణామంలో గ్యాస్ సరఫరా చేయాలని, అధికారులు తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశాన్ని జిల్లాలోని పోలీసు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారుఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహారావు, డిఎం సివిల్ సప్లై రాజేందర్, ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థల అధికారులు జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 14 (జనం సాక్షి) :** జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా సమస్యలు తలెత్తకుండా వినియోగదారులకు నిరంతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం కోసం జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఈ కమిటీ ఏర్పాటు చేయబడిందని, ఈ కమిటీలో ఎస్పీ, రెవెన్యూ అదనపు కలెక్టర్, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రాంతీయ మేనేజర్లు, ఆర్టీఓ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, జిల్లా విద్యాశాఖాధికారి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖల జిల్లా సంక్షేమ అధికారులు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘ ప్రతినిధి సభ్యులుగా ఉంటారని, జిల్లా పౌర సరఫరాల అధికారి కన్వీనర్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, డిస్ట్రిబ్యూటర్ల గోదాముల్లో నిల్వల స్థితిని రోజువారీగా పరిశీలించడం, నిల్వ కేంద్రాలు మరియు పంపిణీ కేంద్రాల వద్ద భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయడం వంటి చర్యలను కమిటీ పర్యవేక్షణ చేస్తుందని తెలిపారు. అలాగే సిలిండర్ల నిల్వచేయడం, దారి మళ్లింపు, బ్లాక్ మార్కెటింగ్ మరియు గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా ఉపయోగించడం వంటి చర్యలను నివారించడానికి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అవసరమైతే ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో వినియోగదారులకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు నిరంతరంగా అందుబాటులో ఉండేలా కమిటీ తరచుగా సమావేశాలు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి

**నర్సాపూర్, మార్చి 14 (జనం సాక్షి) :** త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్‌ల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని శనివారం నర్సాపూర్ లో ఎమ్మెల్యే సునీత రెడ్డికి సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అంగన్వాడీ లకు నెలకు 18 వేల వేతనం పెంచాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఐసిడిఎస్ కు సరిపడా నిధులు కేటాయించాలనీ, ఎన్ఐపి చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలనీ, 2026 ఎడ్యుకేషన్ పాలసీని సవరించాలనీ, ఫ్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలనీ అన్నారు. మార్చి 16 నుంచి ఒక పూట బడిని నిర్ణయించాలనీ, టీచర్స్, హెల్పర్స్ ఇద్దరికి ఒకేసారి మే నెలంతా సెలవులు ఎలాంటి ఆటంకాలు లేకుండా అమలు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ గత 50 సం॥ల నుంచి పేద ప్రజలకు సేవలందిస్తున్నారు. వీరంతా మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే అత్యధికులు ఉన్నారని, నేటికీ



వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదురకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు . సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు 24 రోజులు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేశారన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, అనంతరం వచ్చిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో అంగన్వాడీల టీచర్స్, హెల్పర్లకు 18 వేల వేతనం పెంచుతామని, పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని తెలియజేశారనీ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా, అనేక హామీలు ఇచ్చిన, నేటికి వేతనాలు పెంచలేదాన్నారు . 24 రోజుల సమ్మె వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మిని టీచర్స్ ఎరియర్స్, పిఆర్సి ఎరియర్స్ తదితర డబ్బులు సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉండటం వల్ల అంగన్వాడీ ఉద్యోగులు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఖాళీ పోస్టుల భర్తీ తదితర సమస్యలు పెండింగ్లో ఉన్నాయి వీటన్నింటినీ పరిష్కరించే విధంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నిధులు పెంచాలని కోరారు. పై అంశాలతో పాటు ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఎస్ఈపి-2020 చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేయాలని, రాష్ట్రంలో తెచ్చిన 2026 ఎడ్యుకేషన్ పాలసీని సవరించాలని, ఫ్రీ ప్రైమరీ పిఎంశ్రీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే కొనసాగించడం ద్వారా ఐసిడిఎస్ రక్షణతో పాటు అంగన్వాడీ టీచర్స్, హెల్ఫర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు



**రామచంద్రాపురం, మార్చి 14 (జనం సాక్షి) :** రామచంద్రాపురం మండలంలోని విద్యా భారతి హై స్కూల్ బ్రాంచ్ లో అదనపు గదుల నిర్మాణానికి శనివారం శ్రీకారం చుట్టారు. పటాన్‌చెరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పనులను ప్రారంభించారు. భారతి విద్యా సమితి ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ పాఠశాలలో విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా సదుపాయాలు అందించాలనే ఉద్దేశంతో విస్తరణ చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, సమితి అధ్యక్షుడు ఏ. దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్‌బి. అవధానులు, కార్యదర్శి గల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రవి, సబ్ కమిటీ అధ్యక్షుడు ముకుంద రెడ్డి, ఎల్ఐజీ వీబీహెచ్ఎస్ స్కూల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, బీహెచ్ఈఎల్ వీబీహెచ్ఎస్ స్కూల్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజహిత కార్యక్రమాలు నిర్వహించాలి



**అమీన్పూర్, మార్చి 14 (జనం సాక్షి) :** జన్మదిన వేడుకలను అధిక మొత్తంలో ఖర్చు చేయకుండా సమాజానికి ఉపయోగించాలని బారాస రాష్ట్ర నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. శనివారం ఆయన జన్మదినం సందర్భంగా ఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమీన్పూర్ లోని మహిమ మినిస్ట్రీస్ అనాథ చిన్నారుల మధ్యలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం చిన్నారులకి కేకును పంచి వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మదిన వేడుకలు, శుభకార్యాలకు వృధా ఖర్చులు ఎక్కువ చేస్తున్నారని తెలిపారు. వృధా ఖర్చులు చేయకుండా అనాథ చిన్నారులకు ఉపయోగిస్తే మరింత బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మధు యువజన నాయకులు పాల్గొన్నారు.

# జోగులాంబ గద్వాల జిల్లా అభివృద్ధికి కృషి

**గద్వాల నడిగడ్డ, మార్చి 14 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ గా రెండు సంవత్సరాలకు పైగా పనిచేసిన ప్రస్తుత ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ బి.ఎం. సంతోష్ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ గా పనిచేసి బదిలీపై వెళ్లిన బి.ఎం. సంతోష్ కు శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ మొదటిసారిగా సంతోష్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టాక జిల్లా పరిపాలనపై పట్టు సాధించారని కొనియాడారు. అన్ని శాఖల గురించి క్షుణ్ణంగా తెలుసుకొని జిల్లా అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా పూర్వపు కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ హైదరాబాదులో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ లో పనిచేసి మొదటి సారి జోగులాంబ గద్వాల జిల్లాలో కలెక్టర్ గా పనిచేయడంతో మంచి అనుభవం పొందానని, జిల్లా అధికార యంత్రాంగంతో కుటుంబ సభ్యుడిగా కలిసిపోయి పనిచేయడం జరిగిందన్నారు. జిల్లాలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను సజావుగా నిర్వహించడంలో పూర్వపు కలెక్టర్ సంతోష్ సహకారం మరువలేనిదని, పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లడం జరిగిందన్నారు.



జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. వివిధ శాఖల జిల్లా అధికారులు కూడా పూర్వపు కలెక్టర్ సంతోష్ తో కలిసి పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ గా బదిలీపై వెళ్లిన బి. ఎం. సంతోష్ ను అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, ఆర్డిఓ శ్రీనివాసరావు, ఏవో భూపాల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల ఆర్థిక అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- తెల్లాపూర్‌లో ఈద్ కా తోఫా పంపిణీ



**రామచంద్రాపురం, మార్చి 14 (జనం సాక్షి) :** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ముస్లిం మైనార్టీల ఆర్థిక అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని మే ఫెయిర్ సమీపంలోని దర్గాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మైనార్టీ సోదరులకు ఈద్ కా తోఫా లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మైనార్టీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా, తన స్వంత నిధులతో కూడా నిరుపేద మైనార్టీలను ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో ఈద్గాలు, మసీదులు, ఆశూర్‌ఖానాల నిర్మాణానికి సహాయం అందిస్తున్నామని, భవిష్యత్తులో కూడా మైనార్టీలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ఉపాధిహామీ పథకాన్ని దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర

- ఉపాధి హామీ పథకాన్ని పోరాటాలతో కాపాడుకుందాం
- ఈనెల 16న ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా
- సిపిఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి వి. ప్రవీణ్ కుమార్



**సదాశివపేట, మార్చి 14 (జనం సాక్షి) :** గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని, ఈ పథకాన్ని పోరాటాలతో కాపాడుకోవాలని, కూలీలకు నష్టం చేసే ఫోటో క్యాప్చర్ వెంటనే రద్దు చేసి, పెండింగ్ లో ఉన్న కూలీని తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు .ఈనెల 16వ తేదీన ఎంపీడీవో కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం సదాశివపేట మండలం పెద్దాపూర్ నాగ్సన్పల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సిపిఎం పార్టీ బృందం పర్యటించింది.ఈ సందర్భంగా వి. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు పెద్ద ఎత్తున చేస్తుందని అన్నారు. ఉపాధి కూలీలకు ఫోటో క్యాప్చర్ తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వార వారం చెల్లించవలసిన కూలీ డబ్బులు ఆరు వారాలైన డబ్బులు చెల్లించలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 125 రోజులకు పని దినాలు పెంచుతున్నమని, ప్రగల్భల్ పలుకుతుందని, బడ్జెట్లో నిధులు తగ్గించి ఏరకంగా పని దినాలు పెంచుతారని అన్నారు. ఇప్పటివరకు ఈ పథకానికి కేంద్రం 90 శాతం రాష్ట్రం 10 శాతం నిధులు కేటాయింపు ఉండేదని. విబి జి రామ్ జి చట్టం తేవడంతో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధుల కేటాయింపు ఉండాలని రాష్ట్రాల మీద పెద్ద ఎత్తున భారం వేస్తుందని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసే కుట్రలోనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 16వ తేదీన సోమవారం రోజు ఎంపీడీవో కార్యాలయం ముందు జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఉపాధి కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సదాశివపేట ఏరియా కమిటీ సభ్యులు ఎస్ .రమేష్ గౌడ్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు



**గద్వాల నడిగడ్డ, మార్చి 14 ( జనం సాక్షి) :** గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కుమారుడి వివాహ మహోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి,పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు శనివారం గద్వాలలో పర్యటించారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించింది. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో ఉదయం నుంచే హెలిపాడ్ నుండి కళ్యాణ వేదిక వరకు ఉన్న మార్గమంతా పోలీసులు కట్టుదిట్టంగా భద్రతా బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్య కూడళ్ల వద్ద అదనపు పోలీస్ సిబ్బందిని మోహరించడంతో పాటు, కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేశారు. కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం సమయంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా గద్వాలకు చేరుకోగా, కలెక్టరేట్ సమీపంలోని హెలిపాడ్ వద్ద జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్. ఎస్. చౌహాన్, జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్యమంత్రిని ఘనంగా స్వాగతించారు. డీఐజీ పర్యవేక్షణలో, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన సమగ్ర పోలీస్ బందోబస్తు కారణంగా ముఖ్యమంత్రి పర్యటన ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా, ప్రశాంతంగా కొనసాగింది. పోలీస్ శాఖ సమన్వయంతో చేపట్టిన భద్రతా చర్యలు, పర్యటన విజయవంతంగా ముగియడంలో ప్రధాన పాత్ర పోషించాయి.

## మగ్దుంపూర్‌కు మరిన్ని నిధులు కేటాయిస్తా..

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



**శివ్వంపేట, మార్చి 14 (జనంసాక్షి) :** మగ్దుంపూర్ గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి, ఒక ఆదర్శ వంతమైన గ్రామంగా తీర్చిదిద్దడానికి మరిన్ని నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. రూ.20 లక్షలు ఉపాధి నిధులతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనం,రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం సర్పంచ్ సోము కృష్ణవేణి అశోక్ తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మగ్దుంపూర్ పాఠశాల అభివృద్ధికి నిధుల మంజూరు కోసం కృషి చేస్తున్నట్లు ఆమె అన్నారు. గ్రామంలో అవసరమున్న కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి తప్పకుండ నిధులు మంజూరు చేయిస్తానని ఆమె అన్నారు. గ్రామంలో అంగన్వాడీ, మహిళా సమాఖ్య భవన నిర్మాణాలకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ గజేంద్రుల నవీన్,కత్తి శ్రీనివాస్, గిరిబాబు, కాశబోయిన మల్లేష్,అశోక్, అమీర్ ఖాన్, మెహరున్నిసా,షేక్ సాబెర్,గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగుపై అపోహలు వద్దు



**నంగునూరు, మార్చి 14 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు చేశారని..మా ప్రాంతంలో ఆయిల్ ఫామ్ పంట పండదనే అపోహ రైతన్నల నుండి తొలగించిన ఘనత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దేనని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈనెల 22న నర్మేట ఆల్ఫామ్ ఫ్యాక్టరీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం సందర్భంగా ఫ్యాక్టరీ పరిసరాలను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంగునూరు మండలంలోని నర్మేట లో ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి రైతులకు ఎంతో మేలు చేశారని దీంతో రైతులు ఆయిల్ ఫామ్ పంట సాగు చేయాలని ఎంతో ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల దృష్టిలో పెట్టుకొని రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేయాలని ఈ ప్రాంతం రైతులను కోరారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి జిల్లాకు ఒక ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు భావిస్తున్నామన్నారు. నర్మెటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ గతంలో ప్రతిపాదనలు జరిగినప్పటికీ 300 కోట్లు కేటాయించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పనులు పూర్తి చేయించారన్నారు. ఆయిల్ఫామ్ ఫ్యాక్టరీ రూపం తెచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్, సిద్దిపేట పోలీస్ కమిషనర్, ఆయిల్ ఫెడ్ ఎండి, వ్యవసాయ శాఖ అధికారులు, హార్టికల్చర్ అధికారులు, ఆయిల్ పెడ్ అధికారులు , రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సిలిండర్లను బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల నడిగడ్డ, మార్చి 14 (జనం సాక్షి) :** జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్లకు సంబంధించి ఎలాంటి కొరత లేదని ప్రజలు ఆందోళన చెందవద్దని, సిలిండర్లను ఎవరైనా బ్లాక్ లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో గ్యాస్ సరఫరాపై పోలీసు,సివిల్ సప్లై, తదితర శాఖల అధికారులతో, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లకు సంబంధించి జిల్లాలో ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ళు,గురుకులాలు, పాఠశాలలకు గ్యాస్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో హాస్పిటల్లో అవసరమయ్యే గ్యాస్ కు సంబంధించి వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ జరపాలన్నారు. జిల్లాలో ఎవరైనా గ్యాస్ సిలిండర్లను కృత్రిమ కొరత సృష్టిస్తూ బ్లాక్ మార్కెట్ కు తరలిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర పౌరసరఫరాలు, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో గ్యాస్ సరఫరా పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, డిస్టిక్ సివిల్ సప్లై ఆఫీసర్ కన్వీనర్ గా 11 మంది అధికారులతో కలిసి డిస్టిక్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 11 గ్యాస్ ఏజెన్సీ లు ఉన్నాయని,గృహ సంబంధ వినియోగదారులకు సరిపోయే సిలిండర్ లు ప్రస్తుతం నిలువ ఉన్నాయన్నారు. ఎప్పటికప్పుడు మానిటరింగ్ కమిటీ గ్యాస్ సరఫరా ఇబ్బందులపై పర్యవేక్షణ జరుపుతుందన్నారు. జిల్లా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ గా వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు




తీసుకుంటారని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, పలు గ్యాస్ ఏజెన్సీల డిస్ట్రిబ్యూటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పదో తరగతి పరీక్షల నిర్వహణ

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**జనగామ ప్రతినిధి, మార్చి 14 (జనంసాక్షి) :** శనివారం నుంచి ప్రారంభం అయిన పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి సెట్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించి చీఫ్ సూపరింటెండెంట్ లకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పలు సూచనలను తెలిపారు. అనంతరం సెయింట్ మేరీస్ స్కూల్ అలాగే ధర్మకంచలోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధింపు, బయటి వ్యక్తుల ప్రవేశంపై నిషేధం, సిసి టివి కెమెరాల ద్వారా పర్యవేక్షణ వంటి కఠిన చర్యలను పాటించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, డెస్కులు, సరైన వెలుతురు ఉండేలా చూడాలని, వేసవి తీవ్రత కారణంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

## పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం

- పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి మార్చి 14 (జనం సాక్షి) :** పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమైన నేపథ్యంలో హనుమకొండలోని పలు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హనుమ కొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హై స్కూల్ మరియు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు కల్పించిన తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన పరిసరాలు, టాయిలెట్ వసతులు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షల నిర్వహణ దృష్ట్యా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాల్లో వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీల సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలు ప్రశాంతంగా జరగాలి

- కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో.. ఆదిలాబాద్ పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డులో ఉన్న సరస్వతి శిశు మందిర్, వినాయక్ చౌక్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల-2 కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి గదిని తిరుగుతూ పరీక్ష జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వెలుతురు, ఫ్యాన్లు, తాగునీరు, బెంచీలు వంటి కనీస మౌలిక వసతులు ఉన్నాయా? లేదా? అని స్వయంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో ఆరా తీస్తూ.. హాజరు శాతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. "విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాసేలా చూడాలన్నారు. జిల్లావ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూనే, పరీక్షలు ముగిసే వరకు ఇదే అప్రమత్తత కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తహసీల్దార్ శ్రీనివాస్, ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గృహ అవసరాలకు గ్యాస్ కొరత లేదు

- కొమరం భాయ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భాయ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 14(జనంసాక్షి ):** జిల్లాలో గృహ అవసరాలకు ఎల్పిజి గ్యాస్ కొరత లేదని, వినియోగదారులు ఎటువంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నిల్వలను అందుబాటులో ఉంచినట్లు, ఎల్పిజి సిలిండర్లు పక్కదారి పట్టకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సరైన విధంగా సిలిండర్లు ఉపయోగించేటట్లు చూడడానికి ప్రత్యేక మానిటరింగ్ కమిటీ నియమించినట్లు తెలిపారు. ప్రజలు ఎవరు కూడా ముందస్తు బుకింగ్ లు అవసరం లేదని, వినియోగదారుల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నట్లు తెలిపారు. బుకింగ్ లు నిలువలపై రోజువారి సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామని, అటువంటివి ఎక్కడైనా సంభవిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురా వాలని పేర్కొన్నారు. దీని కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఇది జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆధ్వర్యంలో కొనసాగుతుందని 8500844365 నెంబర్ ను సంప్రదించాలని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మరాదని తెలిపారు.

## పుట్టెడు దు:ఖంలోనూ గన్య చక్ర తండా దంపతుల కూతురుకు 'పరీక్ష'



**గూడూరు, మార్చి 14 (జనంసాక్షి):** గూడూరు మండలం గుండెంగ గ్రామ శివారు గన్యచక్ర తండాకు చెందిన దంపతులు హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురికాగా కూతురు గూడూరు మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షకు హాజరైన ఘటన పలువురిని కంటతడి పెట్టించింది. వివరాల ప్రకారం గన్యచక్ర తండాకు చెందిన ధారావత్ సోము,అతని భార్య మంగమ్మ జీవనోపాధి కోసం హైదరాబాద్‌లోని పటాన్ చెరువు ప్రాంతానికి వెళ్లి అక్కడ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే శనివారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వచ్చిన అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు వారిపై దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పటాన్ చెరువు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి హత్యకు గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, మృత దంపతులకు వసంత అనే చిన్న కుమార్తె ఉంది. ఆమెకు శనివారం పదవ తరగతి పరీక్ష ఉండటంతో స్థానికులు ఆమెను పరీక్ష రాయడానికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనతో గన్యచక్ర తండా గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

## గ్యాస్ సిలిండర్లలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఎల్‌పీజీ సిలిండర్లు దాచివేత, బ్లాక్ మార్కెటింగ్, గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య వినియోగించడం వంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, దానిపై నిఘా ఉంచినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం క్యాంపు కార్యాలయం నుండి జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా పరిస్థితిపై జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో గ్యాస్ సరఫరా అందుబాటును నిరంతరం పర్యవేక్షించేందుకు కమిటీ ఏర్పాటు చేయబడిందని తెలిపారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీలు, జిల్లా అధికారులు సమన్వయం చేసుకుంటూ వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా గ్యాస్ సరఫరా కొనసాగించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితిని ప్రతిరోజూ గ్యాస్ గోదాములు, నిల్వ కేంద్రాలను సమీక్షిస్తూ సరిపడా బఫర్ స్టాక్ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్యాస్ గోదాములు, పంపిణీ కేంద్రాలను నిరంతరం తనిఖీ చేసేందుకు డీటీ, ఆర్ఐ, ఎస్ఐలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అక్రమాలను గుర్తించి చట్టపరమైన చర్యలు కోవాలని తీసుకోవాలని తెలిపారు. శుక్రవారం సివిల్ సప్లైస్ అధికారులు నిర్వహించిన తనిఖీలలో 6 కేసులు నమోదు చేసి, 13 గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నిత్యావసర వస్తువుల చట్టం, 1955 సెక్షన్ 6ఎ, సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎల్‌పీజీ సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు జిల్లా అధికారులు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో ఎస్పి, పోలీస్, రెవెన్యూ, పౌర సరఫరాలు, రవాణా, వైద్య, విద్యా, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా సమస్యలు తలెత్తకుండా వినియోగదారులకు నిరంతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం కోసం జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఈ కమిటీ ఏర్పాటు చేయబడిందని, ఈ కమిటీలో ఎస్పీ, రెవెన్యూ అదనపు కలెక్టర్, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రాంతీయ మేనేజర్లు, ఆర్‌టీఓ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, జిల్లా విద్యాశాఖాధికారి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖల జిల్లా సంక్షేమ అధికారులు, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘ ప్రతినిధి సభ్యులుగా ఉంటారని, జిల్లా పౌర సరఫరాల అధికారి కన్వీనర్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, డిస్ట్రిబ్యూటర్ల గోదాముల్లో నిల్వల స్థితిని రోజువారీగా పరిశీలించడం, నిల్వ కేంద్రాలు, పంపిణీ కేంద్రాల వద్ద భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయడం వంటి చర్యలను కమిటీ పర్యవేక్షణ చేస్తుందని తెలిపారు. అలాగే సిలిండర్ల నిల్వచేయడం, దారి మళ్లింపు, బ్లాక్ మార్కెటింగ్, గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా ఉపయోగించడం వంటి చర్యలను నివారించడానికి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అవసరమైతే ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో వినియోగదారులకు ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు నిరంతరంగా అందుబాటులో ఉండేలా కమిటీ తరచుగా సమావేశాలు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

## తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించడం నిజం కాదా!

- ధ్రువపత్రాల సృష్టి లో ఆంతర్యం ఏమిటి...?
- సాక్ష్యాధారాలతో నిరూపించడానికి మేము సిద్ధం..
- బహిరంగ చర్చకు మీరు సిద్ధమా....
- శ్రీ హేమాచల క్షేత్రం విశ్రాంత ప్రధానార్చకులు కె.రాఘవాచార్యులు





శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానము
మల్లూరు గ్రామము, మంగపేట మండలం, ములుగు జిల్లా.
Rc.No: SHLNSD/15/2025, Date: 22.11.2025
Sd/- R. మహేష్, కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. 11232-PP/CL/ADVT/1/2025-26 Dt. 22-11-2025

**మంగపేట మార్చి 14(జనంసాక్షి) :** తప్పుడు పత్రాలతో కులాన్ని మార్చిన విషయం నిజం కాదా.. ఏడు సంవత్సరాల క్రితం బ్రాహ్మణ కులంలో నియోగి శాఖలో ఉన్న వారు ఇప్పుడు ఎలా శ్రీ వైష్ణవ శాఖకు మారారో బహిర్గతంగా చెప్పాలని శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి విశ్రాంత ప్రధానార్చకులు కె.రాఘవాచార్యులు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ క్షేత్రంలో 22 నవంబర్ 2025 నాడు పరిచారక పోస్ట్ కు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది. ఈ విషయాన్ని అధికారికంగా శ్రీ హేమాచల క్షేత్రం ఆలయ కార్యనిర్వహణాధికారి రెవెల్లి మహేష్ తెలపడం జరిగిందని వారన్నారు. ఈ పరిచారక పోస్టును ఆధారంగా చేసుకుని బ్రాహ్మణ కులంలో నియోగి లుగా ఉన్న కొందరు రెవెన్యూ అధికారులను తప్పు దోవ పట్టించి శ్రీ వైష్ణవులుగా కులం సర్టి ఫికెట్లు పొందారని కె. రాఘవాచార్యులు ఆరోపించారు. పరిచారక పోస్టుకు హిందూ మతస్తులైన పాంచరాత్ర ఆగమ సాంప్రదాయం, సత్ప్రవర్తన కలిగిన శ్రీ వైష్ణవ అభ్యర్థులను దరఖాస్తుకోవడమైందని, కానీ శ్రీ వైష్ణవులుగా తప్పుడు దృపత్రాలను సృష్టించడం సబబు కాదు అని తాను ఆవేదన వ్యక్తపరిచారు. శుక్రవారం మండల కేంద్రం లోని రెవెన్యూ కార్యాలయంలో గంగు ఉపేంద్ర శర్మ తప్పుడు దృవపత్రాల సృష్టి విషయాన్ని ప్రస్తావించకుండా కేవలం బ్రాహ్మణుల మధ్య వర్గ భేదాలు సృష్టించడం సరికాదు అంటూ దినపత్రికలలో ప్రకటనలు ఇవ్వడం బాధాకరమని వారన్నారు. సెక్యులర్ వ్యవహారాల్లో ప్రభుత్వం బ్రాహ్మణులందరికీ ఒకటే కేటగిరిగా చూస్తుంది. కానీ ఆలయ సాంప్రదాయాలు, ఆచారాలు సెక్యులర్ వ్యవహారాలు కాదు కాబట్టి సెక్యులర్ ఉద్యోగాల్లో ఉండే కుల వర్గీకరణ వీటికి వర్తించదు అని కె. రాఘవాచార్యులు తెలిపారు. వైష్ణవ ఆలయాలు విష్ణు సంబంధమైనవి. ఈ ఆలయాలు పాంచ రాత్రము లేదా వైఖాన సము అనే రెండు ఆగమాలలో నడు స్తాయని, ఆలయంలో ఏ ఆగమములో ప్రతిష్టింపబడినదో ఆ ఆగమ నంలోనే నడవాలి. అందుకు ఆ ఆగమనాన్ని అనుసరించే శాఖకు చెందిన వారే అర్చకులుగా ఉండుట పూర్వం నుండి అనుసరించబడుతున్న సాంప్రదాయం. కావున శ్రీ వైష్ణవ శాఖకు చెందిన బ్రాహ్మణులే పాంచరాత్ర ఆలయములో అర్చకులుగా కొనసాగేందుకు అర్హులు అని వారు అన్నారు. ఆగమ సాంప్రదాయములపై సరైన అవగాహన లేకుండా గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడడం సరికాదని వారన్నారు. బ్రాహ్మణులు శ్రీ వైష్ణవులుగా తప్పుడు దృపత్రాలను పొందడం విషయాన్ని మరిచి బ్రాహ్మణుల మధ్య విభేదాలు సృష్టించడం అంటూ ఆరోపణలు చేయడం సరికాదని వారన్నారు. ఈ వివాదం బ్రాహ్మణుల శాఖ భేదములకు సంబంధించినది ఏ మాత్రం కాదు అని కేవలం భారతీయ న్యాయ సంహిత ద్వారా శిక్షార్హమైన తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం పొందుట వివాదమే అని వారు స్పష్టం చేశారు.



### బాసర ఐఐఐటీని సందర్శించిన బక్కి వెంకటయ్య

**నిర్మల్ బ్యూరో, మార్చి 14 (జనంసాక్షి) :** బాసర ఐఐఐటి ని, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా, ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో జరుగుతున్న అడ్మిషన్ల ప్రక్రియ గురించి వివరాలను అడిగి తెలుసు కున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందో లేదో అధికారులను అడిగారు. వివిధ అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడుతూ వసతులు, వారికి ఉన్న సమస్యలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి, వైస్ చాన్స్ లర్ గోవర్ధన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### క్యాంపు కార్యాలయం ముందు ఆశాల నిరసన



**ఖానాపూర్ మార్చి 14 (జనం సాక్షి) :** నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ఆశా వర్కర్లు నిరసన ప్రదర్శించారు. శనివారం క్యాంపు కార్యాలయం ముందు నిరసన ప్రదర్శించిన సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడారు. గత రెండు మాసాలుగా పారితోషికాలు రావడంలేదని వాపోయారు. రానున్న బడ్జెట్ సమావేశాలలో ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ తమ గోడును అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా వారు వేడుకున్నారు. అలాగే రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రాల్లోని ఎమ్మెల్యేలకు వినతిపత్రం సమర్పించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా ఈరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం వచ్చాక నెరవేరుస్తామని చెప్పారని, కనీస వేతనం రూ.18000 చెల్లించే విధంగా ప్రభుత్వం ఏర్పడ్డాక చర్యలు తీసుకుంటామని చెప్పిన మాటను నిలబెట్టుకొని ఆచరణలో పెట్టాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరీమణులకు రంజాన్ తోఫా కిట్స్ పంపిణీ

- పంపిణీ చేసిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ ప్రతినిధి, మార్చి 14 (జనం సాక్షి) :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదర సోదరీమణులకు అందజేస్తున్న "రంజాన్ తోఫా" కిట్స్‌ను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాజీపేట 63 వ డివిజన్ పరిధిలోని జామ మస్జిద్ మరియు హనుమకొండ 53వ డివిజన్ పరిధిలోని నయిం నగర్ మస్జీద్ ఏ నూర్ మస్జిద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వయంగా ముస్లిం సోదరీమణులకు రంజాన్ తోఫా కిట్స్ అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 1700 మంది లబ్ధిదారులకు ఈ కిట్స్ అందనున్నట్లు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని అన్నారు. రంజన్ మాసంలో నియోజకవర్గంలో 7 ప్రధాన మస్జిద్ లకు 1 లక్ష చొప్పున 7 లక్షలను మంజూరు చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, పార్టీ నాయకులు మరియు అధికారులు,ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## ఇరాన్‌పై అమెరికా యుద్ధం ఆపాలి

- హనుమకొండలో ప్రజా సంఘాల శాంతియుత నిరసన



**హనుమకొండ ప్రతినిధి మార్చి 14 (జనం సాక్షి) :** సామ్రాజ్యవాద అమెరికా యుద్ధోన్మాదంతో ఇరాన్ పై చేస్తున్న దౌర్జన్యకర యుద్ధాన్ని ఆపాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ డిమాండ్ చేసారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శాంతియుత నిరసనలో ర్యాలీలో ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. నరేంద్ర మోడీ విదేశాంగ విధానంలో మార్పులు చేయాలని, దేశంలోని అదానీ, అంబానీ లాంటి కొద్ది మంది మేలు కోసం అమెరికాకు మద్దతు పలికి యుద్ధాలకు పరోక్షంగా మద్దతు పలకడం సరికాదని, బిజెపి ప్రభుత్వ అలీన దేశాల విధానాల వల్ల దేశ ప్రజలకు కలుగుతున్న నష్టాలను దేశంలోనే 140 కోట్ల ప్రజలు గమనిస్తున్నారని, మోడీ విధానాలను మార్చుకోకుంటే రానున్న రోజుల్లో బిజెపికి ప్రజలు బుద్ధి చెపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విముక్త చిరుతల కచ్చి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ ఇరాన్ మీద అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు గత పదిహేను రోజులుగా అన్యాయంగా యుద్ధం చేస్తున్నాయని ఇరాన్ దేశ అధ్యక్షుడు ఖమేనీని హత్యచేసిన ఈ రెండు దేశాలు తమ దౌర్జన్యాన్ని నిసిగ్గుగా సమర్థించుకుంటున్నాయని, ఈ యుద్ధం వల్ల మన దేశంతో సహా ప్రపంచంలోని చాలా దేశాలు చాలా ఇబ్బందులకు గురవుతున్నాయని అన్నారు. ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ యుద్ధం వల్ల గ్యాస్, పెట్రోల్ వంటి నిత్యావసర సరుకులకు కొరత ఏర్పడి సామాన్య ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. భారతదేశ పాలకులు యుద్ధం ప్రభావాలను సరిగా అంచనా వేయలేక పోతున్నారని, అమెరికా, ఇజ్రాయిల్ దురహంకార యుద్ధం పట్ల నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి మాట్లాడుతూ ప్రపంచంలోని బలహీన దేశాలపై యుద్ధాలు చేస్తూ ఆయా దేశాల అధ్యక్షులను చంపుతూ, అక్రమంగా కిడ్నాప్ చేస్తూ ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తుందని, ప్రపంచ దేశాల మీద ఆధారపడి ఆయుధ వ్యాపారం చేస్తున్న అమెరికా అదే ప్రపంచ దేశాల మీద యుద్ధం చేయడం నీతిమాలిన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు సోమ రామమూర్తి, సాయిని నరేందర్, ఎదునూరి రాజమౌళి, తాడిశెట్టి క్రాంతి కుమార్, మంద వీరస్వామి, కన్నం సునీల్, నలిగంటి చంద్రమౌళి, జన్ను పద్మ, ప్రభంజన్, గొల్లపల్లి వీరస్వామి, ఐతం నగేష్, అంబాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### ఎఎమ్మార్ అధినేతకు డాక్టరేట్

ఎఎంఆర్ సిఅండ్ఎండి మహేష్ రెడ్డి



**మల్హర్, మార్చి 14 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామ పరదిలోని కాపురం శివారులో ఉపరితల గని లో బొగ్గు వెలికి తీస్తున్నా ఎ ఏమ్మార్ కంపెనీ అధినేత కు ఆధ్యాత్మికతాత్పరులు, సమాజ సేవకు లోకమాన్య బలగంగాధర్ తిలక్ పేరుతో 105 సంవత్సరాల క్రితం ప్రారంభించిన తిలక్ మహారాష్ట్ర విద్యాపిట్ విశ్వ విద్యాలయం ఏఎంఆర్ అధినేత మహేష్ రెడ్డికి డాక్టరేట్ ను పూణే లోని సంస్థ ప్రాంగణంలో జరగనున్న విద్యాలయ 44వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకొన్నారు. అయనతో పాటు గోవా ముఖ్యమంత్రి కూడా ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 మార్చి 2026

# మహిళలు సాంకేతిక నైపుణ్యతతో ఎదగాలి



**కనగల్లు, మార్చి 14 (జనం సాక్షి) :** మహిళలు సాంకేతిక నైపుణ్యతను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర రోడ్లు, భవనముల ఒ సినిమా టో గ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. నల్లగొండ పట్టణ కేంద్రంలో నెట్విన్ సంస్థ ద్వారా కుట్టు మిషన్ శిక్షణ పొందిన 116 మంది మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను మంత్రి అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. మహిళలు ఎవరు కూడా ఇంట్లో ఖాళీగా ఉండవద్దని పట్టుదలతో ఏదైనా సాంకేతిక కోర్సులలో చేరి స్వయం ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఈ సంస్థ ద్వారా 27 కోర్సుల లో చాలామంది శిక్షణ పొంది ఉన్నారని వీరు సంఘాలుగా ఏర్పడినట్లయితే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అందజేసే స్కూల్ యూనిఫామ్ దుస్తుల కుట్టే పనిని అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నల్లగొండ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు చురుకుగా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. శ్రీశైలం సొరంగ మార్గం పనులను, డిండి ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేసి నల్లగొండ, దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీటిని అందించి బీడు భూములను మాగాని భూములుగా మార్చి పచ్చని పంటలతో శశశ్యామలంగా ఉండేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. మూసి ప్రక్షాళన పనులకు ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నిన అడ్డంకులు సృష్టించిన ఆపే ప్రసక్తే లేదని పునర్గాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, నెట్వి న్ సంస్థ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఎండి ఉపేందర్ రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ అ్రస్ఫ్ ఆలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హాఫీజ్ ఖాన్, నల్లగొండ ఆర్డిఓ స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి ప్రిన్సిపల్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తిలో తొలిరోజు ప్రశాంతంగా పది పరీక్షలు



**తుంగతుర్తి, మార్చి 14 (జనం సాక్షి) :** శనివారం నిర్వహించిన పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి, మండల కేంద్రంలో మొత్తం 3 పరీక్ష కేంద్రాల్లో 551 మంది విద్యార్థులు పదవ తరగతి వార్షిక పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, ఒక్క విద్యార్థి గైరాజర్ కాగా 550 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి బి లింగయ్య తెలిపారు, ఈ సందర్భంగా జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ సలీం షరీఫ్ పరీక్ష కేంద్రాలను సందర్శించి ప్రతీ గదికి తిరిగి విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు, ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించొద్దని ఎగ్జామినర్లకు సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చూడాలన్నారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఇతర సదుపాయాలన్నీ కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు.

## భక్తిశ్రద్ధలతో భద్రేశ్వరునికి సేవలు చేయాలి

- జాతర నూతన ఉత్సవ కమిటి సభ్యులకు అబినందనలు
- ఆర్బీఓఎల్ సీఈఓ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి



**తాండూరు, మార్చి 14 (జనంసాక్షి) :** భక్తిశ్రద్ధలతో భద్రేశ్వరునికి సేవలు చేయాలని ఆర్బీఓఎల్ సీఈఓ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరులోని భద్రేశ్వర జాతర ఉత్సవ కమిటి శనివారం నియామకం అయ్యింది. అధ్యక్షులుగా మేడి మహేష్‌తో పాటు గంగా శ్రావణ్ కుమార్ ,గాజుల విజయ్ కుమార్, లింగమంతుల శంకర్... దేవనూర్. శెట్టి చంద్రకాంత్, మాద్రికి చంద్రకాంత్ , కోర్వార్ అంజలి, అగ్గనూరు సంకేత్.లకు స్థానం కల్పించారు. ఇందులో భాగంగా అధ్యక్షులు మేడి మహేష్ ఆధ్వర్యంలో కమిటి సభ్యులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జాతర ఉత్సవ కమిటిలో స్థానం కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయ ప్రతిష్ట పెంచేలా పనిచేయాలని అన్నారు. భద్రేశ్వరుని జాతర ఉత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహించాలని అన్నారు. ప్రజలకు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

## నీటిని పొదుపుగా వాడుకోవడం అందరి బాధ్యత



**రామన్నపేట, మార్చి 14 (జనంసాక్షి) :** వేసవి దృష్ట్యా మంచినీటిని వృధా చేయకుండా, సాగు, తాగు నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఈఈ బొడ్డు సురేందర్ రావు సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ వాన కాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం మూలంగా భూగర్భ జలాలు అమాంతం పెరిగిపోయిందని, ఆ నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తాగు సాగునీటిని పొదుపుగా వాడుకొని పక్షంలో భూగర్భ జలం పెరిగిన స్థాయిలోనే అడుగంటే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో పలు ప్రాంతాలలో భూగర్భ జలాలు అడుగంటినట్లు వార్తాపత్రికల్లో వార్తా కథనాలు వస్తున్నాయని అన్నారు. నల్లాల ద్వారా వచ్చే నీటిని వృధా చేయరాదని, నల్ల నీటిని పట్టుకున్న తర్వాత మిగతా నీటిని వృధాగా మురికి కాలువల్లోకి వదిలేయకుండా నల్లను బందు చేయాలని ఆయన సూచించారు. రైతులు అదేపనిగా మోటర్ ఆన్ చేసి నీటిని వృధా చేయరాదని, పంటలకు సరిపోయిన తర్వాత మోటార్ విధిగా బంద్ చేయాలని ఆయన సూచించారు. మంచినీరు కలుషితమైతే ఆరోగ్యం దెబ్బతింటుందని, నీటిని సురక్షితంగా ఉంచాలని, సురక్షిత నీటిని సేవించాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ వేసవికాలంలో ఎండలు తీవ్రత కూడా అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించినందున తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ కళాశాల మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



**భువనగిరి టౌన్, మార్చి 14 (జనం సాక్షి) :** భువనగిరి సీనియర్ సిటిజన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రభుత్వ కళాశాల మైదానంలోని సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. మైదానంలో సరైన లైటింగ్ సదుపాయం లేకపోవడం వల్ల వాకింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు మైదానంలో శానిటేషన్, పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మైదానంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యుల వినతిపై మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవికుమార్ సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భువనగిరి మున్సిపల్ చైర్మన్‌గా తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ఎన్నిక కావడం పట్ల అసోసియేషన్ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఆమె నియామకానికి సహకరించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, మార్చి 14 (జనంసాక్షి) :** రాష్ట్రములో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి పేదవారి సొంతింటి కల నెలవేర్చడం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నాడు దామరచర్ల మండలం కేశవపురం, రామోజీ తండాలలో గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ గృహాలను ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్టంలో ప్రతి పేద వాడి సొంతింటి కలను నిజం చేసేలాగా, ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బ్రతికేలా చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రం లో ప్రజాప్రభుత్వం మొదటి విడతలో నియోజకవర్గా నికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని, ఏప్రిల్ నెలలో రెండో విడుత ఇందిరమ్మ ఇండ్ల ను ఇవ్వనుందని అన్నారు ఈ కార్యక్రమం లో గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ



**ఝరాసంగం, మార్చి 14 (జనం సాక్షి) :** మండల పరిధిలోని చిలేపల్లి గ్రామంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం మాజీ వైస్ ఎంపీపీలు సలీం, హఫీజ్ లు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథిగా ఎంపీ సురేష్ శెట్కార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పర్వదినం శాంతి,సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు కలిసి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సామాజిక ఐక్యతకు దోహదం చేస్తుందని అన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సిద్ధం ఉజ్వల్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు హనుమంతరావు పాటిల్, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..అనంతరం ఉపవాస విరమణ చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

## జూదరుల పట్టివేత

- రూ. 20,040 నగదు స్వాధీనం



**పాపన్నపేట, మార్చి 14 (జనంసాక్షి) :** పోడ్చన్‌పల్లి తండా సమీపంలో జూదం ఆడుతున్న 10 మందిని పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా కొంతమంది వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు.పట్టుబడిన వారిలో.. మదారి లింగం,జుకంటి బాబు,జిలకర సాయిలు,వడ్డేసాయిలు, బుచ్చం రాజు,షేక్ రఫీ,గోవింద్ ఆంజనేయులు, తాడేపు సంతోష్,బోడ వినోద్,కొమ్ముల అనిల్ ఉన్నారు. రూ. 20,040 నగదు, 10 చరవాణి లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈఘటనపై పాపన్నపేట ఠాణా లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసు యంత్రాంగం తెలిపింది.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్




**సూర్యాపేట, మార్చి 14 (జనంసాక్షి) :** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు.శుక్రవారం రాత్రి సూర్యాపేట మున్సిపాలిటీ 28వ వార్డులో రంజాన్ పండగను పురస్కరించుకొని ఆ వార్డు కౌన్సిలర్ సండ్ర విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలు,ఇఫ్తార్ విందుల ద్వారా మత సామరస్యానికి, సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల వారికి ప్రాముఖ్యతనిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండీ అంజద్ అలీ,మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ, మాజీ కౌన్సిలర్ అనంతుల యాదగిరి, డీసీసీ కార్యదర్శి అక్కేనపల్లి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక కేసు విషయంలో పోలీసుల నిర్లక్ష్యం

- సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేసిన బాలిక మేనమామ



**మోమిన్‌పేట, మార్చి 14 (జనం సాక్షి) :** వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్ పేట పోలీస్ స్టేషన్లో మైనర్ బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సెల్ టవర్ కి ఆత్మహత్యకు పాల్పడడానికి సిద్ధమైన బాలిక మేనమామ మగ్రి మోహన్ రెడ్డి. సుమారు మూడుగంటలపాటు సెల్ టవర్ పైన నిరసన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన టవర్ దగ్గరకు చేరుకున్నారు. మర్పల్లి మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన సందీప్ రెడ్డి, అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమ పేరుతో లొంగదీసుకున్నాడు. ఇట్టి విషయమై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి 1 నెల 4 రోజులు అవుతున్న ఇప్పటివరకు ఎవరు పట్టించుకోకపోవడం బాధాకరమనిపించింది. ఈ కేసు విషయంలో సీఐ ఎస్సై అరవింద్ లను సస్పెండ్ చేయాలని, అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడులక్ష్మారెడ్డి కేసును పక్కదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ను ఆశ్రయిస్తే పోలీసులే తమను వేధింపులకు గురి చేస్తున్నారని ,వారి వేధింపులను భరించలేక, చేయకపోవడంతో మోమిన్ పేట,పోలీస్ స్టేషన్ పై పూర్తి నమ్మకం పోయిందని ఈ కేసును వికారాబాద్ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్న నన్నారు. సంఘటన స్థలానికి వికారాబాద్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి చేరుకొని టవర్ పై ఎక్కిన వ్యక్తికి నచ్చజెప్పి ఆ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో టవర్ నుంచి కిందికి దింపారు. దీంతో మండల కేంద్రంలోని జనాలు ఊపిరి పీల్చుకున్నారు.

## తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు చర్యలు



**హాలియా, మార్చి 14 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హాలియా పురపాలక సంఘ పరిధిలో మంచినీటి ట్యాంకుల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘ అధ్యక్షుడు చింతల చంద్రారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది ట్యాంకుల పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. అలాగే ట్యాంకుల లోపల పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రపరిచారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన మంచినీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి మంచినీటి ట్యాంకులను శుభ్రపరచాలని పురపాలక సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంతో పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు.

# ముస్లింలకు రంజాన్ తోఫా కిట్‌లను అందచేసిన ఎమ్మెల్యే పాయం



**మణుగూరు, మార్చి 14 (జనం సాక్షి) :** ముస్లింలు జరుపుకునే పండుగ లలో రంజాన్ అత్యంత పవిత్రమైన పండుగని పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు శనివారం ప్రజాభవన్ కార్యాలయంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్ లను ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు తహసిల్దార్ నరేష్ చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణలో రంజాన్ పండుగ పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం తరపున మైనార్టీ సంక్షేమానికి కట్టుబడి పేద మధ్యతరగతి ముస్లిం కుటుంబాలు ఆనందంగా పండుగ జరుపుకోవాలని కిట్ లను అందిస్తుందని అన్నారు. రంజాన్ మాసంలో నెల మొత్తం ఉపవాస దీక్ష (రోజా) ఉదయం సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు నీరు కూడా తాగకుండా కఠిన ఉపవాస దీక్షలో ఉంటారు. దీనివల్ల మనిషిలో క్రమశిక్షణ సహనాన్ని ఓపికను పెంచుతుంది. ఈ మాసంలో వారు సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని నిరుపేదలకు దానం చేయడం విధిగా భావిస్తారు. ఇది గొప్ప విషయం గా చెప్పుకోవచ్చు. ఎంతో నిష్టగా నియమాలను పాటిస్తూ ప్రార్థనలు చేస్తారని అన్నారు.. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల తహసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీ ఓ పల్నాటి వెంకటేశ్వర్లు, డిటి రామారావు, ఆర్ ఐ గోపి, మణుగూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, సర్పంచులు ఉప సర్పంచ్ లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు ముస్లిం సోదరులు సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.




# మెటాలో 16వేల ఉద్యోగాలకు కోత..?

**వాషింగ్టన్:**కృత్రిమ మేధ రాకతో టెక్ రంగంలోని ఉద్యోగులకు ఈ ఏడాదీ కష్టకాలమే కొనసాగుతోంది. ఏఐతో ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. అందుకు తగ్గట్టుగానే దిగ్గజ కంపెనీల ప్రకటనలు కలవరపెడుతున్నాయి. తాజాగా ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా భారీ ఎత్తున లేఆఫ్‌లకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దాదాపు 16వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించనున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఏఐలో పెట్టుబడులను పెంచుతోన్న నేపథ్యంలో ఉద్యోగుల సంఖ్యలో కోత పెట్టాలని మెటా (ఓవబిజీ) భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను కంపెనీ టాప్ ఎగ్జిక్యూటివ్స్.. సీనియర్ లీడర్లతో పంచుకున్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. సంస్థ సిబ్బందిలోని దాదాపు 20 శాతం మందిని తొలగించాలని మెటా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కంపెనీలో 79వేల మంది పనిచేస్తున్నారు. అంటే.. దాదాపు 16వేల మందికి లేఆఫ్‌లు ఇవ్వనున్నట్లు సమాచారం.ఇదే నిజమైతే, 2022-2023 తర్వాత కంపెనీ చేపట్టబోయే అతిపెద్ద తొలగింపులు ఇవే కానున్నాయి. 2022 చివర్లో 11 వేల మందికి లేఆఫ్‌లు ఇచ్చిన మెటా.. ఆ మరుసటి ఏడాదే 10వేల మందిని విధుల్లో నుంచి తీసేసిన సంగతి తెలిసిందే. అయితే, తాజా కథనాలపై మెటా నుంచి అధికారిక స్పందనేదీ రాలేదు. ఇక, మెటా ప్రస్తుతం ఏఐ రంగంలో విస్తృతంగా పెట్టుబడులు పెడుతోంది. ఇందులో భాగంగానే 2028 నాటికి డేటా సెంటర్ల ఏర్పాటు కోసం 600 బిలియన్ డాలర్లు వెచ్చించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కంపెనీ ఇటీవల వెల్లడించింది.

### ఇంధన సర్‌ఛార్జీల బాదుడు..

## అదే బాటలో 'ఆకాశ ఎయిర్'

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో విమాన ఇంధన ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో ఆయా విమానయాన సంస్థలు ప్రయాణికుల నుంచి ఇంధన సర్‌ఛార్జీ వసూలు చేస్తున్నాయి. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో సంస్థలు ఇప్పటికే ఈ ఛార్జీ విధిస్తుండగా.. తాజాగా 'ఆకాశ ఎయిర్' కూడా ఈ జాబితాలో చేరింది. మార్చి 15 నుంచి దేశీయ, అంతర్జాతీయ విమాన టికెట్లపై రూ.199 నుంచి రూ.1,300 వరకు ఇంధన సర్‌ఛార్జీలను విధించనున్నట్లు ప్రకటించింది.ప్రతి విమానానికి ఇంధన సర్‌ఛార్జీని వసూలు చేస్తామని, ప్రయాణ వ్యవధిని బట్టి చెల్లించాల్సిన మొత్తం మారుతుందని 'ఆకాశ ఎయిర్' ఓ ప్రకటనలో తెలిపింది. దేశీయ, అంతర్జాతీయ సర్వీసులకు సంబంధించి మార్చి 15 నుంచి ఈ ఛార్జీలు విధిస్తామని వెల్లడించింది. పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ పరిణామాల కారణంగా విమాన ఇంధన ధరలు భారీగా పెరిగాయని తెలిపింది. పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షిస్తూనే ఉంటామని, అదేవిధంగా ఇంధన సర్‌ఛార్జీలను సమీక్షిస్తామని పేర్కొంది.

# మదుపరులకు మళ్లీ కన్నీరే..

- రూ.10 లక్షల కోట్ల సంపద ఆవిరి
- ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.10716.64 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు.. రూ.9977.42 కోట్లు



**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్‌కు అత్యంత అధ్వాన నెలల్లో ఒకటిగా ప్రస్తుత మార్చి నెల, అధ్వాన వారాల్లో ఒకటిగా ఈవారం నిలిచిపోతాయి. ఇందుకు పై నష్టాల అంకెలే నిదర్శనం. కొన్నేళ్లుగా లాభాల జైత్రయాత్రలో ఓలలాడిన దేశీయ సూచీలకు.. ఈ స్థాయిలో కుదుపు వస్తుందని ఎవరూ ఊహించలేదు. అంతర్జాతీయ ప్రతికూలతలు ఎదురైనా.. దేశీయ బలమైన స్థూల ఆర్థిక పరిస్థితులు దన్నుగా నిలుస్తాయనే అభిప్రాయంతోనే మార్కెట్ వర్గాలు ఉన్నాయి. కానీ ఆంత్రోపిక్ ఏఐ టూల్స్ వల్ల ఐటీ కంపెనీల షేర్లకు నష్టాలతో ప్రారంభించి, ముడి చమురు ధరల జెట్ స్పీడ్‌తో సూచీలు అంతకంతకూ పతనమవుతున్నాయి. మదుపర్లకు ఈ నష్ట కన్నీరు మరిన్ని రోజులు తప్పకపోవచ్చేమో అనే విశ్లేషణలు వస్తున్నాయి. వరుసగా మూడో రోజూ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. ముడి చమురు ధరల పెరుగుదల వల్ల, దేశీయంగా ద్రవ్యోల్బణం అధికం కావచ్చనే ఆందోళనలు ఇందుకు కారణమయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 5 పైసలు తగ్గి 92.30 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 2.47% లాభంతో 102.94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ శుక్రవారం రూ.10.24 లక్షల కోట్లు తగ్గి రూ.429.82 లక్షల కోట్ల (4.65 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. ఆద్యంతం నష్టాల్లోనే..: బీఎస్ఈ సెన్సెక్స్ 75,444.22 వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 76,034.42) ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ ఒక దశలో 74,454.60 పాయింట్లకు క్షీణించింది. చివరకు 1470.50 పాయింట్ల నష్టంతో 74,563.92 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 488.05 పాయింట్లు కోల్పోయి 23,151.10 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 23,112 వద్ద కనిష్ఠాన్ని; 23,492.40 వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదుచేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 4,355 పాయింట్లు(5.51%); నిఫ్టీ 1299 పాయింట్లు (5.31%) నష్టపోయాయి. 2020 మే తర్వాత సూచీలకు శాతం పరంగా ఒక వారంలో అత్యధిక నష్టమిదే.ఆ రెండు మినహా..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో హిందుస్థాన్ యునిలీవర్, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగతావన్నీ నష్టాల్లోనే ముగిశాయి. ఎల్అండ్‌టీ 7.52%, టాటా స్టీల్ 5.2%, అల్ట్రాటెక్ సిమెంట్ 4.36%, ఎస్‌బీఐ 3.55%, మారుతీ సుజుకీ 3.29%, బీఈఎల్ 3.12%, యాక్సిస్ బ్యాంక్ 2.96% నష్టపోయాయి.

**ఈ వారంలో..**

16 రంగాలూ డీలానే: ప్రధాన 16 రంగాల కంపెనీల షేర్లు ఈవారంలో నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 4.6%, స్మాల్‌క్యాప్ 3.7% డీలాపడ్డాయి. వాహనానికే అధిక సెగ: వాహన షేర్లు ఈవారం 10.6% కుదేలయ్యాయి. గత ఆరేళ్లలో, ఒకవారంలో ఈ రంగ షేర్లకు ఇదే అత్యధిక నష్టం. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ఉత్పత్తి, గిరాకీ, ఎగుమతులపై ప్రభావం పడొచ్చనే ఆందోళనలు ఇందుకు కారణం. రాణించిన కోల్ ఇండియా: కోల్ ఇండియా షేర్లు మాత్రం రాణించాయి. చమురుకు ప్రత్యామ్నాయంగా బొగ్గు వాడుతుండటం, వేసవిలో విద్యుత్తు వాడకం పెరుగుతున్నందున బొగ్గుకు గిరాకీ పెరగొచ్చన్న అంచనాలతో కోల్ ఇండియా షేర్లు 6% పెరిగాయి. నిఫ్టీ 50లో.. 45 మైనస్సే: ఈవారం నిఫ్టీలో 45 కంపెనీల షేర్లు నష్టాలను చవిచూడగా.. ఇందులో 24 కంపెనీల షేర్లు 5-12% తగ్గాయి. ఎల్అండ్‌టీ, ఎంఅండ్ఎం, అల్ట్రాటెక్ సిమెంట్, ఐషర్ మోటార్స్, మారుతీ సుజుకీ లాంటి దిగ్గజాలూ నష్టపోయిన వాటిల్లో ఉన్నాయి. లాభపడిన 5 కంపెనీల షేర్లలో కోల్ ఇండియా, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, సన్ ఫార్మా, విప్రో ఉన్నాయినిఫ్టీ మరింత కిందకు వస్తే 22,700- 22,400 వద్ద మద్దతు లభించొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే సూచీ బాగా నష్టపోయినందున.. స్వల్పకాలంలో కొంత పుల్‌బ్యాక్ రావొచ్చని అంటున్నారు. సూచీ మళ్లీ సానుకూలంగా చలిస్తుందని చెప్పేందుకు, ప్రస్తుతానికైతే స్పష్టమైన సంకేతాలేవీ కనిపించడం లేదని చెబుతున్నారు.

# 2025-26లో భారత వృద్ధి 7.5%

**బ్యారెల్ ముడిచమురు సగటు ధర 70 డాలర్లు • ఫిచ్ రేటింగ్స్ అంచనా**

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత వృద్ధి రేటు 7.5 శాతంగా నమోదుకావొచ్చని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికీ వృద్ధి అంచనాలను 6.7 శాతానికి పెంచింది. 2026లో అంతర్జాతీయంగా ముడిచమురు సగటు ధర బ్యారెల్‌కు 70 డాలర్లుగా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4%, 2026-27లో 6.4% వృద్ధిరేటును గత డిసెంబరులో ఫిచ్ అంచనా వేసింది. 2026-27 ప్రథమార్థంలో వృద్ధి నెమ్మదించొచ్చని గ్లోబల్ ఎకనామిక్ ఔట్‌లుక్-2026లో అభిప్రాయపడింది. సెప్టెంబరు త్రైమాసికంలో వృద్ధిరేటు 8.4% కాగా, డిసెంబరు త్రైమాసికంలోలో 7.8 శాతానికి తగ్గింది. ఈ ఏడాది భారత వృద్ధికి దేశీయ డిమాండ్ దోహదపడుతుందని, వినియోగదారు వ్యయాలు, పెట్టుబడులు వరుసగా 8.6%, 6.9% పెరిగే అవకాశం ఉందని ఫిచ్ పేర్కొంది.ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమయ్యాక చమురు ధర బ్యారెల్‌కు 30 డాలర్లు పెరిగి 100 డాలర్లకు చేరింది. హర్మూజ్ జలసంధి మూసివేత కారణంగా, ఈనెలలో చమురు ధర 90-100 డాలర్ల మధ్య ఉండొచ్చని, ద్వితీయార్థం నాటికి 60 డాలర్ల మధ్యకు పడిపోవచ్చని ఫిచ్ భావిస్తోంది. దీని వల్ల 2026 వార్షిక సగటు ధర 70 డాలర్లుగా ఉండొచ్చని అంచనా వేసింది.
2026లో ప్రపంచ జీడీపీ వృద్ధి 2.6 శాతంగా ఉంటుందని ఫిచ్ అంచనా వేసింది. చమురు బ్యారెల్ ధర 100 డాలర్ల వద్ద స్థిరంగా ఉంటే, ప్రపంచ సరఫరాపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని ఫిచ్ ముఖ్య ఆర్థికవేత్త బ్రియాన్ కౌల్టన్ హెచ్చరించారు.జనవరి, ఫిబ్రవరిలో ఆర్థిక కార్యకలాపాలు స్వల్పంగా నెమ్మదించినప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగానే ఉందని, రుణాల వృద్ధి ఇంకా రెండంకెల స్థాయిలోనే ఉందని ఫిచ్ తెలిపింది.2026 డిసెంబరుకు రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతానికి పెరిగే అవకాశం ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక రెపో రేటును 5.25% వద్దే ఈ ఏడాది, వచ్చే ఏడాది కూడా కొనసాగించవచ్చని అంచనా వేసింది.జాతీయ ఖాతాల డేటాను సవరించడం (బేస్ ఈయర్‌ను 2011-12 నుంచి 2022-23కి మార్చడం) వల్ల జీడీపీ వృద్ధి ఇప్పుడు మరింత స్థిరంగా కనిపిస్తోందని ఫిచ్ పేర్కొంది.






# కళ తప్పిన దుబాయ్

### యుద్ధ ప్రభావంతో అంతర్జాతీయ నగరానికి తీవ్రనష్టం

**పర్యాటకులు, దేశ విదేశీ పెట్టుబడిదారులతో నిన్న మొన్నటి వరకు కళకళలాడిన దుబాయ్ బోసిపోయింది. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య సంఘర్షణ ఈ నగరంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చాలా ప్రాంతాల్లో షాపింగ్ మాల్‌లు, వాణిజ్య సంస్థలను మూసివేశారు. బుర్జ్ అల్ అరబ్ సహా పలు ప్రముఖ హోటళ్లు క్షిపణి దాడులకు గురవ్వడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. విమాన సర్వీసులు భారీగా రద్దవ్వడంతో పర్యాటక రంగమూ కుదేలైంది.**



**దుబాయ్, వాషింగ్టన్:**
పర్యాటకులు, దేశ విదేశీ పెట్టుబడిదారులతో నిన్న మొన్నటి వరకు కళకళలాడిన దుబాయ్ బోసిపోయింది. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య సంఘర్షణ ఈ నగరంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చాలా ప్రాంతాల్లో షాపింగ్ మాల్‌లు, వాణిజ్య సంస్థలను మూసివేశారు. బుర్జ్ అల్ అరబ్ సహా పలు ప్రముఖ హోటళ్లు క్షిపణి దాడులకు గురవ్వడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. విమాన సర్వీసులు భారీగా రద్దవ్వడంతో పర్యాటక రంగమూ కుదేలైంది. డిమాండ్ పెంచడానికి హోటళ్లు భారీ డిస్కౌంట్లు ఇస్తున్నా స్పందన లేదు. సిటీ, స్టాండర్డ్ చార్టెర్డ్ తదితర అంతర్జాతీయ బ్యాంకులు తమ కార్యాలయాలను ఖాళీ చేశాయి. వీధుల్లో జనసంచారం కనిపించడం లేదు. అందుకు ఈ ఫొటోయే సాక్ష్యం.పశ్చిమాసియాలో పరిస్థితులు ఎంతమాత్రమూ కుదుటపడట్లేదు. అమెరికా-ఇజ్రాయెల్ దాడులు.. ఇరాన్ ప్రతీకార దాడులతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతూనే ఉంది. యుద్ధం 14వ రోజైన శుక్రవారం టెహ్రాన్ సైనిక సామర్థ్యాలను దెబ్బకొట్టడమే లక్ష్యంగా వాషింగ్టన్, టెల్ అవీవ్ యుద్ధవిమానాలతో దాడులు కొనసాగించాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై, గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఒమన్‌పై టెహ్రాన్ జరిపిన డ్రోన్ దాడిలో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మంది గాయపడ్డారు. పశ్చిమ ఇరాక్‌లో అమెరికా రీఫ్యూయెలింగ్ విమానమొకటి కూలిపోవడంతో.. అందులోని ఆరుగురు అమెరికా సిబ్బంది మృత్యువాతపడ్డారు. మరోవైపు- ఇరాన్ త్వరలోనే లొంగిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోస్యం చెప్పారు. అమెరికా విమానవాహక నౌక అబ్రహం లింకన్‌పై తాము బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశామని, ప్రస్తుతం అది పనిచేయడం లేదని ఇరాన్ పేర్కొంది. ఆ ప్రకటనను వాషింగ్టన్ తోసిపుచ్చింది. ఇరాన్‌వ్యాప్తంగా సైనిక, ఇతర లక్ష్యాలపై అమెరికా, ఇజ్రాయెల్ శుక్రవారం యుద్ధవిమానాలతో బాంబుల వర్షం కురిపించాయి. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్‌లో 15 వేల లక్ష్యాలపై తాము దాడి చేసినట్లు వాషింగ్టన్ తెలిపింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను శుక్రవారం భారీ పేలుడు కుదిపేసింది. 'ఇంటర్నేషనల్ కుడ్స్ డే' సందర్భంగా పాలస్తీనియన్లకు మద్దతుగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా.. నగరంలోని ఫిర్దౌసీ స్క్వేర్ ప్రాంతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన వార్షిక ర్యాలీకి వేలమంది హాజరయ్యారు. వారిని లక్ష్యంగా చేసుకొని దాడి జరిగింది. ఈ ఘటనలో ఎవరైనా మరణించారా, గాయపడ్డారా అనే వివరాలు తెలియరాలేదు. దాడులు కొనసాగించిన ఇరాన్ ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై క్షిపణి, డ్రోన్ దాడులను ఇరాన్ ముమ్మర స్థాయిలో కొనసాగించింది. గల్ఫ్‌లో ప్రధానంగా చమురు కేంద్రాలు, ఇతర మౌలిక వసతులను అది లక్ష్యంగా చేసుకుంటోంది. తమ దేశంపైకి పలు విడతల్లో దూసుకొచ్చిన దాదాపు 50 డ్రోన్లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా వెల్లడించింది.ఇరాన్ శుక్రవారం తమపైకి 7 బాలిస్టిక్ క్షిపణులు, 27 డ్రోన్లను ప్రయోగించినట్లు యూఏఈ తెలిపింది.దుబాయ్‌లోని ఓ పారిశ్రామిక ప్రాంతంపైకి దూసుకొచ్చిన డ్రోన్లను విజయవంతంగా అడ్డుకున్నారు.తుర్కియేపైకి ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని తూర్పు మధ్యధరా ప్రాంతంలో మోహరించి ఉన్న నాటో రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి.ఇజ్రాయెల్, అమెరికా బలగాలపై 44వ విడత క్షిపణి దాడులు చేపట్టినట్లు ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ ప్రకటించింది.ఒమన్‌లోని సోహర్ నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఇద్దరు భారతీయులు మృత్యువాతపడ్డారు. ఈ ఘటనలో మరో 10 మంది భారతీయులు గాయపడ్డారు. ఇరాన్ యుద్ధం మొదలైన తర్వాత పశ్చిమాసియా నుంచి 1.50 లక్షల మంది భారతీయులు స్వదేశానికి వచ్చినట్లు విదేశీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి అసీం మహాజన్ వెల్లడించారు. ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య పోరు మరింత తీవ్రస్థాయికి చేరింది. హెజ్‌బొల్లా రాకెట్ దాడులతో ఉత్తర ఇజ్రాయెల్‌లో దాదాపు 60 మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఓ వ్యక్తి మరణించారు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ శుక్రవారం లెబనాన్‌లో పర్యటించారు.ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని గుటెరస్ పిలుపునిచ్చారు. ఇరాన్‌పై యుద్ధంలో అమెరికా ఉపయోగిస్తున్న రీఫ్యూయెలింగ్ విమానం కేసీ-135 పశ్చిమ ఇరాక్‌లో కూలిపోయింది. ఈ ఘటనలో అందులోని ఆరుగురు సిబ్బంది మృత్యువాతపడ్డారు. ట్యాంకర్ విమానం కూలిపోవడానికి శత్రువుల దాడి కారణం కాదని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది.

టెహ్రాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ నిర్వహించిన దాడితో దెబ్బతిన్న ఓ భవన శిథిలాల నుంచి గాయపడిన వ్యక్తిని వెలికితీస్తున్న సహాయ సిబ్బందిఇరాన్ నాయకులు 47 ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇప్పుడు అమెరికా 47వ అధ్యక్షుడిగా వారిని తాను హతమారుస్తున్నానని వ్యాఖ్యానించారు. అలా చేయడాన్ని గొప్ప గౌరవంగా 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. మరోవైపు- 'ఫాక్స్ న్యూస్ రేడియో'తో ముఖాముఖిలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధ యురేనియం నిల్వలను స్వాధీనం చేసుకునేందుకు తాము ప్రస్తుతానికైతే ప్రయత్నాలేమీ చేయడం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే అందుకు వెనుకాడబోమని పేర్కొన్నారు. రవాణా మార్గాల్లో నౌకలకు అమెరికా నౌకాదళం ఎస్కార్ట్‌గా వెళ్తూ రక్షణ కల్పించాల్సిన పరిస్థితి వస్తే.. తప్పకుండా అలాగే చేస్తామని చెప్పారు. ఇరాన్ త్వరలోనే లొంగిపోతుందని ట్రంప్ జోస్యం చెప్పారు. బుధవారం జీ7 నేతల వర్చువల్ భేటీలో ఆయన ఈ మేరకు పేర్కొన్నట్లు ఓ వార్తాసంస్థ తెలిపింది. ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గట్టి హెచ్చరిక జారీ చేశారు. గతంలో మొజ్తాబా తండ్రి ఆయతుల్లా అలీ ఖమేనీని లక్ష్యంగా చేసుకున్నట్లే.. భవిష్యత్తులో ఆయనపైనా చర్యలకు ఉపక్రమించే అవకాశముందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే సంకేతాలేవీ కనిపించకపోవడంతో అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 100 డాలర్లకు పైనే కొనసాగుతోంది.దక్షిణ ఇరాన్‌లోని మినాబ్‌లో ఈ నెలారంభంలో బాలికల ప్రాథమిక పాఠశాలపై జరిగిన వైమానిక దాడిలో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు అత్యవసర మానవతా సాయం కింద చైనా 2 లక్షల డాలర్లు అందజేయనుంది.



# కిమ్ కవ్వింపులు..

### ఒకేసారి 10 క్షిపణులు ఫైర్

**ప్యాంగ్యాంగ్:**అమెరికా-దక్షిణ కొరియా వార్షిక సైనిక విన్యాసాల వేళ ఉత్తరకొరియా కవ్వింపులకు పాల్పడుతోంది. వరుసగా క్షిపణి ప్రయోగాలు చేపడుతూ బలప్రదర్శనకు దిగింది. శనివారం ఏకంగా 10 క్షిపణులను ఒకేసారి ప్రయోగించింది. ఈ విషయాన్ని దక్షిణ కొరియా మిలిటరీ వెల్లడించింది.ఉత్తరకొరియా రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపం నుంచి ఈ క్షిపణులను ప్రయోగించినట్లు దక్షిణ కొరియా తెలిపింది. అయితే, ఇవి ఎంతదూరం ప్రయాణించాయో తమకు తెలియదని పేర్కొంది. మరోవైపు, జపాన్ రక్షణ శాఖ ఈ పరిణామాలపై స్పందించింది. కిమ్ సర్కారు ప్రయోగించిన ఆయుధాలు తమ దేశ ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ వెలుపల ఉన్న సముద్ర జలాల్లో పడినట్లు తెలిపింది.ఈ వారం ఆరంభంలోనూ ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం చేపట్టింది. ఓ యుద్ధనౌక నుంచి తన తీరానికి సమీపంలోని దీవులపై క్రూజ్ క్షిపణులను ప్రయోగించింది. ఆ ప్రయోగ పరీక్షలను ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ (ఐతిఎ ఏనీనిణ జని), తన 13 ఏళ్ల కుమార్తె కిమ్ జు యేతో కలిసి కాన్ఫరెన్స్ హాలులో కూర్చుని వీక్షించినట్లు ఆ దేశ ప్రభుత్వ మీడియా సంస్థ వెల్లడించింది. తమ దేశంపై అణ్వస్త్ర దాడి ముప్పును నిరోధించడానికే ఈ శక్తిమంతమైన క్షిపణులతో ప్రయోగాలు చేస్తున్నట్లు కిమ్ ఇప్పటికే ప్రకటించారు.

# భారత్‌పై యుద్ధప్రభావం లేకుండా పటిష్టచర్యలు

అయితే ఇవాళ రాష్ట్రంలో సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. దేశ ప్రజలపై ఆ ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. వారి రక్షణ, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆశిస్తాం. అయితే దేశ ప్రయోజనాల పరిరక్షణలో కాంగ్రెస్ మరోసారి విఫలమైందని విమర్శించారు. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది. అంతర్జాతీయంగా భారత్ శీఘ్ర అభివృద్ధిని సాధించడం కొన్ని శక్తులకు ఇష్టంలేదు. అలాంటి శక్తుల చేతిలో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిందని మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి అస్సాం గురించి కానీ, దేశం గురించి కానీ ఎలాంటి విజన్ లేదని మోదీ తప్పుపట్టారు. మోదీని దూషించడం, అబద్ధాలు, వదంతుల ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించడమే ఆ పార్టీకి తెలుసునని అన్నారు. బీజేపీ ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే తమ పని ప్రారంభమవుతుందని, అభివృద్ధిలో వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడమే బీజేపీ ప్రధాన మంత్రమని చెప్పారు. మీరు కాంగ్రెస్‌ను ఇక్కడినుంచి ఎప్పుడో తరిమికొట్టారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లోనూ ప్రతి రాష్ట్రం ఆ పార్టీకి గుణపాఠం చెప్పనుంద న్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసనలు తెలపడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే.

# గ్రీన్‌కార్డుల చోరీల నాటకం..

### 11 మంది భారతీయుల అరెస్ట్

**వాషింగ్టన్:**అమెరికాలో అక్రమంగా ఉంటూ వీసా మోసాలకు పాల్పడ్డారన్న అభియో గాలపై 11 మంది భారతీయులను పోలీసులు అరెస్టు చేశారు. గ్రీన్‌కార్డుల కోసం వీరు చోరీల డ్రామాలకు పాల్పడినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. దోపిడీ బాధితులమని కట్టుకథలు అల్లి 'యూ-వీసా' పొందేందుకు ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. హింసాత్మక నేరాల్లో బాధితులైన వారు అమెరికా (జూం)లో చట్టబద్ధంగా ఉండేందుకు యూ-వీసా (నాన్ ఇమిగ్రేషన్ స్టేటస్)కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ వీసాతో వలసదారులకు పని అనుమతులతో పాటు 5-10 ఏళ్లలో గ్రీన్‌కార్డు పొందేందుకు మార్గం లభిస్తుంది. దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు వలసదారులు మోసాలకు పాల్పడినట్లు యూఎస్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు వెల్లడించారు. ఈ కేసులకు సంబంధించి మసాచుసెట్స్, కెంటకీ, ఒహాయో తదితర రాష్ట్రాల్లో 11 మంది భారతీయులను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు.వీరంతా అక్రమంగా అమెరికాలో నివాసం ఉంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వీరిలో ఓ వ్యక్తిని భారత్‌కు డిపోర్ట్ చేయగా.. మరో ఆరుగురిని కోర్టులో హాజరుపర్చి విడుదల చేశారు. మిగతా నలుగురిని రిమాండ్‌లో ఉంచారు. నిందితులు ఓ ముఠాగా ఏర్పడి వ్యవస్థీకృత మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఫాస్ట్‌ఫుడ్ రెస్టారంట్లు, మద్యం దుకాణాలు, స్టోర్ల వద్ద దోపిడీలు చేయించినట్లు తెలిపారు. అనంతరం ఈ ఘటనల్లో తాము బాధితులంటూ నమ్మించి యూ వీసాలకు దరఖాస్తులు చేసే ప్రయత్నం చేశారని అధికారులు పేర్కొన్నారు. ఈ



కేసులో నేర నిర్ధరణ అయితే నిందితులకు ఐదేళ్ల వరకు జైలు శిక్ష, 2.5లక్షల డాలర్ల జరిమానా పడే అవకాశం ఉంది.






# అత్యాధునిక డిజిటల్ వెలుగుల్లో హోరెత్తిన నృత్యాలు

- ఆందోత్సవాలతో స్మార్ట్ కిడ్జ్ పాఠశాల వార్షికోత్సవ సంబురం
- స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో విద్యార్థులను ఆల్ రౌండర్లుగా తీర్చిదిద్దడం అభినందనీయం : నగర మేయర్ పునుకొల్లు నీరజ

**ఖమ్మం, మార్చి 14, (జనంసాక్షి) :** స్మార్ట్ కిడ్జ్ పాఠశాల 14వ వార్షికోత్సవం పాఠశాల మైదానంలో శనివారం అత్యాధునిక డిజిటల్ వెలుగుల్లో సంబురంగా జరిగింది. తొలుత విద్యార్థుల స్వాగత నృత్యంతో అతిధులను, తల్లిదండ్రులను ఘనంగా ఆహ్వానించారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య వార్షికోత్సవ సభకు అధ్యక్షత వహించి అధ్యక్షఉపన్యాసం చేశారు. తమ పాఠశాల గత 14 సంవత్సరాలుగా విద్యార్థులను చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతికం, సైన్స్ ఎక్స్పో, ఒలింపియాడ్‌లు తదితర అన్ని రంగాలలో తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో తమ పాఠశాలకు ఎక్సలెన్సీ పురస్కారం లభించడం పాఠశాల పనితీరుకు దర్పణంగా నిలిచిందన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేలా తీర్చి దిద్దుతున్నామన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ముఖ్య అతిథి నగర మేయర్ పూనకొల్లు నీరజ మాట్లాడుతూ చిన్నారులను స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఆల్ రౌండర్లుగా తీర్చిదిద్దడం అభినందనీయం అని పేర్కొన్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. జాతీయ, రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలలో పాఠశాల విద్యార్థులు ప్రతిష్టాత్మక బహుమతులను సొంతం చేసుకోవడం వారి ప్రతిభకు దర్పణంగా నిలిచిందన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుల్లో ఎదిగేందుకు స్మార్ట్ కిడ్జ్ పాఠశాలను ఎంపిక చేసుకోవడం హర్షనీయమన్నా రు. పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య గత సంవత్సర కాలంలో పాఠశాలలో జరిగిన కార్యక్రమాల వివరాలతో పాఠశాల నివేదికను సభలో సమర్పించారు. ఈ వార్షికోత్సవంలో మరో అతిధి స్థానిక కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హుషారుగా పాల్గొన్నారు. సభలో ఇన్స్పైర్ సైన్స్ ఎక్స్పో, గ్రాడ్యుయేషన్ డే, వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అతిధులు బహుమతి ప్రధానం చేశారు. సభానంతరం విద్యార్థులు ప్రదర్శించిన జానపద, సాంప్రదాయ, పాశ్చాత్య నృత్యాలు, లఘు నాటికలు హోరెత్తించాయి. అఖండ, కంగువా, నరసింహ స్వామి అవతారం, సమ్మక్క సారక్క నృత్యం సబికులను మంత్రముగ్ధులను చేశాయి. నూతన ఒరవడితో వినూత్నంగా డిజిటల్ లైట్ల వెలుగు జిలుగులతో నిర్వహించిన స్మార్ట్ కిడ్జ్ పాఠశాల వార్షికోత్సవం అందరిలో ఉత్సాహాన్ని నింపింది.

# గ్యాస్ సిలిండర్లని బ్లాక్ చేస్తే కఠిన చర్యలు



**వైరా ఏసిపి సారంగపాణి**

**వైరా మార్చి 14, (జనంసాక్షి) :** ఇటీవల అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో గ్యాస్ సరఫరాలో అంతరా యం కలగవచ్చని ప్రభుత్వం భావించి, రాష్ట్రవ్యాప్తంగా గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్ల సరఫరాను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని వైరా ఎసిపిఎస్ సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరఫరా వ్యవస్థను కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కొన్నిచోట్ల గృహ వినియోగానికి మాత్రమే కేటాయించిన ఎల్‌పిజి సిలిండర్లను వాణిజ్య అవసరాలకు (హోటళ్ళు, టిఫిన్ సెంటర్లు, క్యాటరింగ్ యూనిట్లు, ఇతర వ్యాపార సంస్థలు) ఉపయోగిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఈ విధమైన చర్యలు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉండటమే కాకుండా, సాధారణ గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత ఏర్పడే పరిస్థితులను సృష్టిస్తాయి.
గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్లు కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలి.
వాణిజ్య అవసరాలకు గృహ సిలిండర్లను ఉపయోగించడం చట్ట విరుద్ధం.
ఈ విధంగా గృహ సిలిండర్లను వాణిజ్య వినియోగానికి మళ్లించడం అత్యావశ్యక వస్తువుల చట్టం మరియు సంబంధిత నియంత్రణ ఆదేశాల ప్రకారం నేరం.
ఇటువంటి అక్రమ వినియోగం, నిల్వ, రవాణా లేదా విక్రయం చేసిన వారిపై సిలిండర్లు స్వాధీనం చేసుకోవడం, క్రిమినల్ కేసులు నమోదు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకోబడతాయి.
వైరా డివిజన్ పరిధిలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్, రోడ్డు పక్కన ఉన్న ఆహార దుకాణాలు మరియు ఇతర వ్యాపార సంస్థలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడతాయి. అందువల్ల అన్ని వ్యాపార సంస్థలు అధికారికంగా అనుమతించిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్లనే వినియోగించాలి. ప్రజలు కూడా గృహ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గమనించినట్లయితే, సమీప పోలీస్ స్టేషన్ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నాము. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఏసిపి హెచ్చరించారు.

# మైనారిటీ సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**వీణవంక, మార్చి 14 (జనం సాక్షి):** రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తారని, మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్ బాబు తెలిపా రు. శనివారం వీణవంక మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాహెబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రణవ్ బాబు ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రణవ్ బాబు, కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత మైనారిటీల ఆర్థిక వ్యవస్థను బాగు చేయడానికి ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి ద్వారా కుట్టు మిషన్లు అందిస్తున్నామని తెలిపారు. సబ్సిడీ కింద ఎలక్ట్రిక్ బైక్‌లు అందజేస్తున్నామని, రాబోయే రోజుల్లో మైనారిటీ సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎక్కటి రఫాల్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, మండల సర్పంచ్ల ఫోరం ప్రధాన కార్యదర్శి జడల శ్రీకాంత్, మార్కెట్ డైరెక్టర్ మాదాసి సునీల్, ఎండి రషీద్ పాల్గొన్నారు.



# క్లిష్ట శస్త్రచికిత్సలకు కేంద్రంగా మారిన పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి

### మూడు ఆపరేషన్లు విజయవంతం

**పెద్దపల్లి, మార్చి 14 (జనం సాక్షి):** పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి క్లిష్ట శస్త్రచికిత్సలకు కేంద్రంగా మారుతోంది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం మూడు క్లిష్ట ఆపరేషన్లు విజయవంతంగా పూర్తయ్యాయి. పెద్దకల్వల గ్రామానికి చెందిన 51 ఏళ్ల మహిళ తీవ్ర కుడి కడుపు నొప్పితో ఆసుపత్రికి వచ్చారు. ఆపరేషన్ సమయంలో గర్భాశయంలో మూడు గడ్డలు, మూత్రాశయం-గర్భాశయం మధ్య పెద్ద గడ్డ కనిపించింది. గర్భాశయాన్ని, మూత్రాశయాన్ని జాగ్రత్తగా కాపాడుతూ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. చందపల్లికి చెందిన 45 ఏళ్ల మహిళకు కుడి భుజం సుప్రాస్పినేటస్ టెండన్ పాక్షికంగా తెగిపోయింది. ఆర్థ్రోస్కోపిక్ విధానంలో సుచర్ ఆంకర్‌తో టెండన్ రిపేర్ చేశారు. రామగుండం చెందిన 19 ఏళ్ల మహిళకు ఎడమ మోకాలి ఏసీఎల్ పూర్తిగా చీలిపోయింది. సెమిటెండి నోసస్-గ్రాసిలిస్ గ్రాఫ్ట్, ఎండోబటన్ ఫిక్సేషన్‌తో ఆర్థ్రోస్కోపిక్ ఏసీఎల్ పునర్నిర్మాణ శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. ఈ ఆపరేషన్లలో గైనకాలజిస్ట్ డాక్టర్ అనసూయ, ఆర్థోపెడిషియన్ డాక్టర్ శశికాంత్, డాక్టర్ వినయ్ కుమార్, జనరల్ సర్జన్ డాక్టర్ విష్ణుచంద్రిక, అనస్తీషియా డాక్టర్లు కృష్ణవేణి, స్వాతి, భవాని పాల్గొన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ కూడా భాగస్వామ్యం వహించారు. వైద్య బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు పెద్దపల్లి ఆసుపత్రిలో అందుతున్న నవజాత శిశు కేంద్రం సేవలు, 2డి ఎకో, లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ, రూట్ కెనాల్ సేవలను ఉపయోగించుకోవాలని డాక్టర్ శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా తనను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్‌లో ఇవ్వవచ్చని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సేవలు ఉచితమని, ఎవరికీ లంచం ఇవ్వవద్దని సూపరింటెండెంట్ స్పష్టం చేశారు.

# రైతును రాజు చేసేందుకే ప్రభుత్వ కృషి

- పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి అనేది ఒక ఊరట
- పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో పేదలకు మెరుగైన వైద్యసేవలు
- (సిఎంఆర్) చెక్కులు పంపిణీలో రాష్ట్రంలో పెద్దపల్లి ప్రత్యేక స్థానం
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు
- ఇఫ్తార్ విందు సోదర భావాన్ని పెంపొందిస్తాయి





**పెద్దపల్లి, మార్చి 14 (జనం సాక్షి):** పేద ప్రజల వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఊరట కలిగిస్తుందని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్కే గార్డెన్స్‌లో శనివారం నియోజకవర్గ వివిధ గ్రామాలకు చెందిన 238 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు రూ.75.88 లక్షల విలువైన చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే, స్వర్గీయ ఎన్టీఆర్ 2 రూపాయల రేషన్ బియ్యం పథకంతో పేదలకు కడుపునిండా భోజనం చేయాలని భావించగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధనికులతో సమానంగా పేదలు సన్న బియ్యంతో భోజనం చేయాలనే లక్ష్యంతో సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో పెద్దపల్లి నియోజకవర్గానికి దాదాపు 1000 కోట్ల రూపాయలకు పైగా అభివృద్ధి పనులు మంజూరు అయినట్లు తెలిపారు. ప్రజల దీవెనలతో గెలిచిన తాను ప్రతిక్షణం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నానని, నియోజకవర్గంలో ఎక్కడా అవినీతి లేకుండా పాలన సాగుతోందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణం శరవేగంగా సాగుతోందని, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి రాష్ట్రంలో సేవల విషయంలో మొదటి స్థానంలో ఉందని చెప్పారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా కంటి సంబంధిత వైద్య సేవలు అందిస్తున్నామని, నవజాత శిశు కేంద్రం ద్వారా పుట్టిన పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన రెండు సంవత్సరాలలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు నుగ్గిళ్ల మల్లయ్య, బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ చైర్మన్లు, పలు గ్రామాల సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అదే సమయంలో పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని (ఎంబీ) గార్డెన్స్ మరియు డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు, సోదరిమణులకు దావత్-ఇ-ఇఫ్తార్ ఉ తమ విందును ఏర్పాటు చేశారు. ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నెలరోజులు భక్తి శ్రద్ధలతో ఉపవాసం చేస్తూ సమాజంలో అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటారని చెప్పారు. నెలరోజుల ఉపవాస దీక్షలో అనేక సత్ ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి, ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. స్థానిక ముస్లిం మతపెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు నుగ్గిళ్ల మల్లయ్య, బిరుదు కృష్ణ, వైస్ చైర్మన్లు, మార్కెట్ చైర్మన్లు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, సోదరిమణులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకై టీకాలు

పెద్దపల్లి,(జనంసాక్షి) : పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామం శనివారం జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గేదెలకు ఉచితంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ గద్దల రాజశేఖర్ తెలిపారు. పశువులను గాలి కుంటు వ్యాధి బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే పశువుకు బీమా కల్పించడం జరిగిందన్నారు. పశువులకు చెవి పోగు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేల్పుల హరీష్, డాక్టర్ అఖిల్ రాజ్, గోపాలమిత్ర ,బి శ్రీనివాస్, కే శ్రీనివాస్,డి రవీందర్, రైతులు పాల్గొన్నాం



# గ్యాస్ కొరతతో కట్టెలపై వంటలు

### రేట్లు పెరగడంతో ఇబ్బందులు పడుతున్న వైనం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా గ్యాస్ కొరత నెలకొంది. సిలిండర్ల కోసం జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. అయినా కూడా బుకింగ్ చేసుకునే గ్యాస్‌తో పాటు కమర్షియల్ గ్యాస్ ఆలస్యం కావడంతో రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. షాద్ నగర్ పట్టణంలోని కొన్ని హోటల్స్ లో కట్టెలపై వంటలు చేస్తూ ప్రజలకు ఆహారాన్ని అందిస్తున్నారు. హోటల్స్ యాజమాన్యాలు బ్లాక్ మార్కెట్లో కమర్షియల్ సిలిండర్ ధర 3000 నుండి 4000 వరకు పెరగడంతో హోటల్ యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిలిండర్ అందుబాటులో లేక పోవడంతో వడ, దోష, బోండా లాంటి వంటకాలను నిలిపివేస్తామని అంటున్నారు. వినియోగదారులు గ్యాస్ సిలిండర్ కోసం వెళ్లితే కొందరు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే అసలు గ్యాస్ కొరతనే లేదని అధికారులు చెప్పడం కోసం మెరుపు.

# కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే 10 ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించాలి

### హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేస్తాం : జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్



**తాండూరు మార్చి 14(జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే 10 మంది ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ పేర్కొన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నివాసంలో రాజుగౌడ్ పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. దేశంలో రాజ్యాంగాన్ని కాపాడలంటూ రాహుల్ గాంధీ చేత పట్టుకుని తిరుగుతుంటే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్‌లు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించి.. కాంగ్రెస్‌లోకి వెళ్లినా వారిపై క్లీన్ చీట్ ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.
దేశంలో రాజ్యాంగాన్ని బీజేపీ తూట్లు పొడుతుందని కాంగ్రెస్ అంటుందని, నిజానికి బీజేపీ కాదు కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి తూట్లు పొడుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే 10 ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించి.. మళ్లీ ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై హైకోర్టులో ఫిటిషన్ వేస్తామని అన్నారు. రాజ్యాంగాన్ని తూట్లు పొడిచేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ, ఏ పార్టీ అయినా ప్రయత్నం చేస్తే బీఆర్ఎస్ పార్టీ అడ్డుపడుతుందని, పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పట్లోళ్ల నర్సింలు, శ్రీనివాస్ చారి, కౌన్సిలర్లు అనిల్, యోగానంద్, ఈర్షాద్, నాయకులు సంతోష్ గౌడ్, ఎజాజ్, ఇంతియాజ్ ఉన్నారు.

# గచ్చిబౌలిలో భవన నిర్మాణ వ్యర్థాలకు త్వరలోనే మోక్షం

### సిఎంసి కమిషనర్ సృజన





**శేరిలింగంపల్లి, మార్చి 13 (జనంసాక్షి) :** ఐటి కారిడార్ పరిధిలో భారీగా భవన నిర్మాణాలు కొనసాగుతుంటాయని, అందులోనూ ఎక్కువ శాతం హైరైజ్డ్ బిల్డింగ్స్ నిర్మాణం కొనసాగుతుండడం వల్ల చాలా సందర్భాలలో ఆయా భవన నిర్మాణదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్ల పక్కన పారవేసి వెళ్ళిపోతుంటారని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం గచ్చిబౌలి ఐకియా నుంచి మీనాక్షి డిలైట్ వరకు రహదారి వెంబడి పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలను పరిశీలించేందుకై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా భవిష్యత్తు కార్యాచరణ పై ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, ఆర్డీవో, మైనింగ్, పిసిబి అధికారులు, రాంకీ వ్యర్థాల శుద్ధి విభాగం ప్రతినిధులు పాల్గొని శిథిలాల తరలింపుకు తగిన కార్యాచరణతోపాటు కొన్ని వ్యర్థాలను తరలించడానికి ఇబ్బందులు ఎదురయ్యే నేపథ్యంలో అక్కడే వాటిని రీసైక్లింగ్ చేయడానికి సాధ్యాసాధ్యాలను చర్చించారు. వ్యర్థాల తొలగింపు తర్వాత ఆ స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని నిర్ణయించారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రజలు తమ అమూల్యమైన సూచనలను శనివారం రాత్రి 8 గంటలలోపు అధికారిక సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# హెచ్‌సీఏ అవకతవకలకు పాల్పడిన మంత్రి వివేక్ తక్షణం రాజీనామా చేయాలి

- టీసీఏ కార్యదర్శి గురువారెడ్డి డిమాండ్
- రూ.64 కోట్ల నిధులు విశాఖ ఇండస్ట్రీస్ ద్వారా దోచుకున్నారని ఆరోపణ
- ఐపీఎల్ కంప్లిమెంటరీ పాస్‌లు జిల్లా క్రికెటర్లకు ఇవ్వాలి
- 22 ఏళ్లుగా నాలుగు కుటుంబాల ఆధిపత్యం
- సీబీఐ విచారణ, లెక్కలు బయటపెట్టాలి



**సికింద్రాబాద్, మార్చి 14 (జనం సాక్షి):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో జరుగుతున్న అవకతవకలను బహిర్గతం చేస్తే కొత్త కొత్త ప్రకటనలు వస్తున్నాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి మండిపడ్డారు. హెచ్‌సీఏ సభ్యులతో కుమ్మక్కై రూ.64 కోట్ల హెచ్‌సీఏ నిధులను విశాఖ ఇండస్ట్రీస్ ద్వారా దోచుకున్న మంత్రి వివేక్ వెంకటస్వామి తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన గురువారెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామి, హెచ్‌సీఏ మధ్య అక్రమ సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. రూ.64 కోట్లు తీసుకున్నట్లు ఒప్పుకున్న వివేక్ వెంకటస్వామి ఇప్పుడు ఆ నిధులతో జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి చేస్తానని చెప్పడం సరైంది కాదని విమర్శించారు. క్రికెట్ కాన్‌స్టిట్యూషన్ ప్రకారం మంత్రులు లేదా ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకోవడం సరికాదన్నారు.
బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం క్రికెట్ సంస్థలు స్వతంత్రంగా పనిచేయాలని గురువారెడ్డి తెలిపారు. 2004 నుంచి సుమారు 22 ఏళ్లుగా నాలుగు-ఐదు కుటుంబాలు హెచ్‌సీఏపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఇండస్ట్రీస్ వ్యవహారంలో రూ.64 కోట్ల అవకతవక జరిగిందని, ఆ డబ్బుతో జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి చేస్తానని చెప్పడం సిగ్గుచేటన్నారు. 2016-17లో వివేక్ వెంకటస్వామి హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా అనేక ఆర్థిక అవకతవకలు జరిగాయని వివరించారు. హెచ్‌సీఏ నిధులను కాపాడాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ సరైన విధంగా వినియోగించలేదని మండిపడ్డారు. విశాఖ ఇండస్ట్రీస్ కేసులో సుమారు రూ.69 కోట్ల నష్టం జరిగిందని పేర్కొన్నారు.
హెచ్‌సీఏలో జరిగిన ఆర్థిక అవకతవకలపై పూర్తి విచారణ జరిపించాలని, ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు అప్పగించి పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని కోరారు. హెచ్‌సీఏకి ప్రతి ఐపీఎల్ మ్యాచ్‌కు సుమారు 4000 కంప్లిమెంటరీ పాస్‌లు వస్తాయని, అయితే అవి కొద్దిమంది కుటుంబాలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. ఈ పాస్‌లను రాష్ట్రంలోని క్రికెటర్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 22 ఏళ్లుగా జిల్లాల అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యం జరిగిందని, దాదాపు రూ.700 కోట్ల ఖర్చుపై స్పష్టత ఇవ్వాలని గురువారెడ్డి డిమాండ్ చేశారు.

# రాంపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్‌పై వెళ్తున్న తండ్రి-కొడుకులు సహా ముగ్గురు మృతి
- ఎస్పీ డివి శ్రీనివాసరావు ఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు



**కొల్చారం, మార్చి 14 (జనం సాక్షి):** కొల్చారం మండలంలోని రాంపూర్ బస్టాండ్ వద్ద నేషనల్ హైవే 765డీపై శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రంగంపేట నుంచి మెదక్ వైపు వస్తున్న బైక్ మెదక్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఘటన స్థలంలోనే ముగ్గురు మృతి చెందారు.
మృతుల్లో హవేలీ ఘనాపూర్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన అమృత్ గౌడ్ (51), ఆయన కుమారుడు రిషి వర్ధన్ గౌడ్ (13), బొగడ భూపతిపూర్ గ్రామానికి చెందిన సాయి గౌడ్ (32) ఉన్నారు. అమృత్ గౌడ్, రిషి వర్ధన్ గౌడ్ తండ్రి-కొడుకులు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు సందర్శించి పరిశీలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతి వేగం వల్లే ప్రమాదం జరిగినట్లు తేలింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం కారణంగా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 మార్చి 2026



# ఆశా వర్కర్ల సమస్యలు అసెంబ్లీలో చర్చించాలి

### సిఐటియు నాయకుడు ముక్తికాంత అశోక్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 14 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో పెట్టిన ప్రకారం ఆశ వర్కర్లకు రూ 18 వేలు ఫిక్సిడ్ వెతనం,ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు నాయకుడు ముక్తికాంత అశోక్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వగృహానికి ఆశ కార్యకర్తలతో వెళ్లగా ప్రభుత్వ విప్ అందుబాటులో లేకపోవడంతో అయన పీఏ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సోమవారం నుండి జరగనున్న శాసనసభ సమావేశాలలో రాష్ట్ర వ్యాప్తంగా వున్న ఆశ వర్కర్ల సమస్యలు చర్చించాలన్నారు.గత 20 ఏండ్ల నుండి ఆశ వర్కర్లుగా పని చేస్తున్నరని, కేంద్రం పెంచిన పారితోషికాలను రాష్ట్ర ప్రభుత్వం యదావిధిగా అమలు చేయాలన్నారు.ఏఎన్ఎం,జెఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశలకు ప్రయోషన్లు కల్పంచలని వెయిటెన్ మార్కులు నిర్ణయించాలన్నారు.గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశాలకు ఇస్స్యూరెన్స్ రూ 50 వేలు చెల్లిస్తూనమని వెంటనే ఉత్తర్వులు జారి చేయాలన్నారు.రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ 5 లక్షలు చెల్లించాలని ఇస్తున్న పారితోషికాల్లో సగం పెన్షన్ నిర్ణయించాలని,ఆశాలు చేస్తున్న పారితోషికం లేని వనులన్నింటిని రాష్ట ప్రభుత్వం పరిగణలోకి తిసుకోవాలన్నారు.ఆశాలకు పని భారం తగ్గించాలని పారితోషికం లేని పనులు చేయించకూడదని,ఆశాలకు రక్షణ కల్పించాలని,డ్యూటీలు వేసే సందర్భంగా వెహికల్ సాయంతో సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ఆశాలకు ప్రతి సంవత్సరం 20 రోజులు రోజులు వేతనంతో కూడిన క్యాజువెల్ సెలవులు ఇవ్వాలని, 6 నెలలు వెతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు.అయన వెంట ఆశ వర్కర్లు లత, జయశిల, జ్యోతి, ఉమా, మహేశ్వరి, గౌతమితో పలువురు ఆశలు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్ల తనిఖీలు ఎక్కడ?

- ఒక్కో బాటిల్‌కు 10 నుండి 15 రూపాయలు వసూలు
- ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు ఎక్కడ
- గ్రామ పంచాయతీల నుంచి వాటర్ ప్లాంట్లు పునరుద్ధించాలి



**గంభీరావుపేట మార్చి 14 (జనం సాక్షి):** ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వ్యాపారులు నీటి శుద్ధి పేరిట దోపిడీ జరుగుతోంది. విచ్చలవిడిగా వెలుస్తున్న నీటి శుద్ధి కేంద్రాలు (ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ల)పై అధికారుల నిఘా కరువైంది. దీంతో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు సరఫరా చేసిందే శుద్ధ నీరు అన్నట్లుగా ఉంటుంది. నిబంధనలు పాటించకుండా మినరల్‌వాటర్ పేరుతో మాయాజాలం చేస్తున్నారు. వివరాల్లోకెళ్తే రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కేంద్రం తోపాటు వివిధ గ్రామాల్లో విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్ లు పెట్టి ప్రజల దగ్గర నుండి ఒక్కో బాటలకు పది నుంచి 15 రూపాయలు వసూలు చేసుకుంటూ ప్రజల సొమ్మును దండుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కొన్నిచోట్ల అపరిశుభ్రమైన నీరు వస్తోంది. ప్రజారోగ్యాన్ని దెబ్బతిసే నీటి వ్యాపారానికి కళ్లెం వేయాల్సిన స్థానిక సంస్థలు, ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు ఎక్కడా కానరావడం లేదు ప్రజలు ప్రశ్నిస్తున్నారు, మండల కేంద్రాల్లో పుట్టగొడుగుల్లా వాటర్‌ప్లాంట్లు వెలుస్తున్నా అధికారుల కంటికి కానరావడం లేదంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరో నెల తర్వాత వేసవి కాలం ఉన్నందున ప్రజలకు తాగునీటి వినియోగం ఎక్కువగా ఉండడంతో ఇప్పటి నుంచే తనిఖీలు చేపడితే ప్రజారోగ్యానికి రక్షణ కల్పించిన వారవుతారనే వాదనలు వినిపిస్తున్నాయి.

నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్‌లలో ఎయిర్ కండిషనర్‌తో పాటు కెమికల్ ల్యాబ్ మైక్రో బయోలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గది, బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా ప్లాంట్ అంతా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఉండాలి. ఇవే కాకుండా అధికారులు ప్రతీ మూడు నెలలకోసారి ఆయా ప్లాంట్లలో నీటి నమూనాలను సేకరించి పలు రకాల పరీక్షలు నిర్వహించాలి. సంతృప్తికరంగా ఉంటేనే లైసెన్స్‌లు ఇవ్వడం కానీ, అంతకుముందు ఉంటే కొనసాగించడం వంటివి చేస్తారు. ప్లాంట్ నిర్వహణతో పాటు ప్యాకెట్లు, బాటిళ్లకు కూడా ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాని అధికారులు కార్యాలయాలకు సైతం ప్యూరిఫైడ్ పేరుతో నీటిని సప్లయ్ చేస్తున్న వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచడమే కాకుండా అధికారులు తాగుతున్నారే తప్ప అసలు ఈ వాటర్ ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేశారు. తమ శాఖ అనుమతులు ఇవ్వకుండానే ఏ విధంగా నీటిని సరఫరా చేస్తున్నారనే కనీస పట్టింపు లేకుండా అధికారులు తమ విధులను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల్లో కదిలిక వచ్చి తనిఖీలు చేపడితే ప్రజల ఆరోగ్యాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయి అని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**గ్రామ పంచాయతీల నుండి వాటర్ ప్లాంట్‌లు పునరుద్ధించాలి**

మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఐదు రూపాయలకే వాటర్ బాటిల్ ఇచ్చేందుకు గ్రామపంచాయతీల ఆదాయం కూడా చేకూరుతుంది అని గతం లాగానే గ్రామపంచాయతీల ద్వారా వాటర్ ప్లాంట్ పునప్రారంభించి ప్రజలకు తక్కువ ధరకే మినరల్ వాటర్ అందించే విధంగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు, దీనితో పాటు గ్రామపంచాయతీలకు ఆదాయంతో పాటు నాణ్యమైన వాటర్ ప్రజలకు అందుతుందని ప్రజలు కోరుతున్నారు.

# పూర్తిస్థాయిలో పన్ను బకాయిల వసూలు చేయాలి

### మున్సిపల్ కమిషనర్ (అదనపు కలెక్టర్) అరుణ శ్రీ

**గోదావరిఖని, జనంసాక్షి :** ఆర్థిక సంవత్సరం ముగింపు దృష్ట్యా పూర్తి స్థాయిలో పన్ను బకాయల వసూళ్లు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశాలు జారీ చేశారు. పన్ను వసూళ్ల పురోగతిపై శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులు, రెవెన్యూ విభాగం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ బకాయిదారుల జాబితాలో ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేసి చట్ట ప్రకారం పన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గడువు తేదీ దాటినప్పటికీ పన్ను చెల్లించని వారికి మున్సిపల్ సేవలు నిలిపివేయాలని అన్నారు. డివిజన్‌లలో ఆన్ అస్సెస్సెడ్, అండర్ అస్సెస్సెడ్ ఉండవద్దని అన్నారు, ప్రతి నిర్మాణం పన్ను పరిధిలోకి రావాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అసిస్టెం ట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్ఓ ఆంజనేయులు, ఆర్ఐ ఖాజా, సీనియర్ అసిస్టెంట్ సాగర్, జూనియర్ అసిస్టెంట్ సౌమ్య, వార్డు అధికారులు, వార్డు అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

### గృహ అవసరాలకు సైతం ఉపయోగపడే

# మొక్కలు పెంచాలి

### మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 14 (జనం సాక్షి);** గృహ అవసరాలకు సైతం ఉపయోగపడే మొక్కలను నర్సరీల్లో పెంచాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని సాయి నగర్, జే పీ నగర్ లో సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలను కలెక్టర్ శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా నర్సరీల్లో ఎన్ని రకాలు, ఎన్ని మొక్కలు పెంచుతున్నారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు.నర్సరీ మొత్తం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలోని నర్సరీలో రోడ్ల వెంట, అలాగే ఇతర చోట్ల నాటే మొక్కలతో పాటుగా గృహ వినియోగానికి ఉపయోగపడే మొక్కలు సైతం పెంచాలని సూచించారు. మునగ, పండ్ల, ఇతర రకాల మొక్కలను నర్సరీల్లో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఎండాకాలం నేపథ్యంలో మొక్కలకు నీటిని పడుతూ సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రణాళిక ప్రకారం మొక్కలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు.ఇట్టి పరిశీలనలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ ఆర్డిఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మైనర్ బాలికకు వివాహం

- ఐసీడీఎస్ సూపర్వైజర్ పిటిషన్ మేరకు కేసు
- బాల్య వివాహ నిరోధక చట్టం కింద తల్లిదండ్రులు, వరుడు, వారి తల్లిదండ్రులపై ఆరోపణలు
- మండలంలో ఇలాంటి వివాహాలు జరిగితే కఠిన చర్యలు

**శంకరపట్నం, మార్చి 14 (జనం సాక్షి):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మైనర్ బాలికకు చట్ట విరుద్ధంగా వివాహం జరపడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ చెన్నూరి పద్మ ఇచ్చిన పిటిషన్ మేరకు ఈ చర్య తీసుకున్నారు. ముద్రవేణి సంపత్, శోభల కుమారుడు ముద్రవేణి రాజ్‌కుమార్ (25)కు మైనర్ బాలికతో వివాహం నిర్వహించారు. దీంతో బాలిక తల్లిదండ్రులు నరెడ్ల స్వప్న, శ్రీనివాస్, సంపత్, శోభా, రాజ్‌కుమార్‌లపై బాల్య వివాహాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలో ఇలాంటి చట్టవిరుద్ధ మైనర్ వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలను హెచ్చరించారు. బాలికల హక్కులు, చట్టపరమైన వయస్సు పాటించాలని, మైనర్ వివాహాలు జరగకుండా అవగాహన కల్పించాలని స్థానికులకు సూచించారు.

# సిల్క్ డెవలప్మెంట్‌తోనే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం

### నిరుద్యోగ సదస్సులో వక్తలు సూచనలు




**కరీంనగర్ బ్యూరో, మార్చి 14 (జనం సాక్షి):** నిరుద్యోగ సమస్యకు సిల్క్ డెవలప్‌మెంట్‌తో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు, ప్రైవేట్ రంగ ఉద్యోగాలకు అనుకూల శిక్షణ అత్యంత ముఖ్యమని విద్యావేత్తలు, రాజకీయ నాయకులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం స్థానిక ఫిలిం భవన్‌లో డాక్టర్ బి.ఎన్.రావు అధ్యక్షతన 'నిరుద్యోగ సమస్య – పరిష్కార మార్గాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వక్తలు ఈ విషయాలను వివరించారు. డాక్టర్ బి.ఎన్.రావు మాట్లాడుతూ విద్యతోనే అన్నీ సాధ్యమని, తన వంతుగా నిరుద్యోగులకు శిక్షణ ఇప్పించి ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ విఠల్ మాట్లాడుతూ మానవ వనరులు, సహజ వనరులు అధికంగా ఉన్న తెలంగాణలో రాజకీయ వనరుల కోసం పరిపాలన జరుగుతోందని, ఉత్తమ విద్యా–ఉద్యోగ పాలసీలు రూపొందించలేకపోతున్నారని విమర్శించారు.

విద్యావేత్త అశోక్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో, ప్రతి యూనివర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రైవేట్ రంగ ఉద్యోగాలకు అనుకూలంగా నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోను అమలు చేసి తక్షణమే 2 లక్షల ఉద్యోగాలు నింపాలని డిమాండ్ చేశారు. దాసు సురేష్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, వార్డు మెంబర్ నుంచి ఎంపీ, ఎమ్మెల్యే వరకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవారెడ్డి, జలీల్, కాంతక్క, సరస్వతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో స్కూటీ డీ.. ఇద్దరి మృతి

**ఆర్మూర్, (జనంసాక్షి): :** ఆర్మూర్ మండలంలోని పిప్రి గ్రామ శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఆర్మూర్ సిఐ సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అతివేగంతో నిర్లక్ష్యంగా పిప్రి గ్రామం వైపు ఆటోను నడుపుతున్న షాహిద్, పిప్రి గ్రామం నుండి ఆర్మూర్‌కు వస్తున్న శ్రీనివాస్, విజయ్‌ల ఎదురెదురుగా వస్తున్న ఆటో స్కూటీకి ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇది గుర్తించిన వాహన దారులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.



### నల్లమల చెంచు గిరిజనుల

# ఆర్థిక పరిస్థితులపై గవర్నర్ ఆరా





**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో,మార్చి 14(జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అడవుల్లో జీవిస్తున్న చెంచు గిరిజనుల జీవన విధానం, ఆర్థిక స్థితిగతులపై రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అధికారులతో సమగ్రంగా చర్చించారు.శనివారం కుటుంబ సమేతంగా శ్రీశైలం దేవస్థానంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో భాగంగా ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూరులోని తెలంగాణ టూరిజం మృగవాణి గెస్ట్ హౌస్‌లో కాసేపు విరామం తీసుకున్నారు.ఈ సందర్భంగా నల్లమల్ల అడవుల్లోని వివిధ చెంచు పెంటల్లో జీవిస్తున్న గిరిజనుల జీవన విధానం, ఆర్థిక పరిస్థితులు, వారి సంస్కృతి గురించి స్థానిక అధికారులను గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ దత్తత తీసుకున్న చెంచు పెంటల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా సోలార్ విద్యుత్, త్రాగునీటి సదుపాయాలు, నిధుల వినియోగం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంక్షేమ పథకాల వివరాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ,రాష్ట్ర గవర్నర్‌కు వివరించారు.అదేవిధంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న అపారమైన సహజ వనరులు, జలపాతాలు, వన్యమృగ సంపద, శైవ క్షేత్రాలు, చారిత్రక కట్టడాలు, ఎకో టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలపై కూడా అధికారులు గవర్నర్‌కు సమగ్ర సమాచారం అందించారు.నల్లమల్ల అడవుల్లోని వన్యప్రాణులు, అడవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, జీవ వైవిధ్య పరిరక్షణ కార్యక్రమాలు, అటవీ ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధి ప్రణాళికలపై కూడా జిల్లా అటవీ శాఖ అధికారులు గవర్నర్‌కు వివరించారు.అదే విధంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక వివరాలను జిల్లా కలెక్టర్ గవర్నర్‌కు తెలియజేశారు.ఈ సందర్భంగా నల్లమల్ల అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అడవుల్లో సంచరిస్తున్న పెద్దపులి ఛాయాచిత్రాం రూపొందించిన ప్రత్యేక జ్ఞాపికను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కు అందజేశారు.నల్లమల్ల అరణ్య ప్రాంతంలోని సహజ సౌందర్యం, వన్యప్రాణి సంపదను ప్రతిబింబించేలా ఈ ఛాయాచిత్రం ఉండటంతో గవర్నర్ ప్రత్యేకంగా కలెక్టర్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి, తహసీల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల అభివృద్ధికై కృషి : ఎంపీ డీకే అరుణ

**నారాయణపేట జిల్లా బ్యూరో మార్చి14 (జనం సాక్షి):** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలోని చేనేత క్లస్టర్ అభివృద్ధికి కృషి చేస్తాన ని ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం కోటకొండ గ్రామంలోని ప్రగతి చేనేత సహకారం సంఘం లిమిటెడ్ కోటకొండ ఆధ్వర్యంలో క్లస్టర్ కింద మంజూరైన చేనేత కార్మికుల మగ్గాల పరికరాలను అందజేయడానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీకే అరుణ మాట్లాడుతూ నారాయణపేట గద్వాల్ కోటకొండ చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చేనేత కార్మికులు లబ్ధి పొందాలని చేనేత కార్మికులకు సూచించా రు. చేనేత కార్మికుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా నారాయణపేట కోటకొండ పట్టుచీరలకు పేరుగాంచి ందని ఎంతో నైపుణ్యం కలిగిన చేనేత కార్మికులు కలిగి ఉన్న ప్రాంతం వారికి ఎప్పుడూ సాయం చేయడానికి ముందు ఉంటానని చేనేత కార్మికులకు కేంద్ర ప్రభు త్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు, కేంద్ర ప్రభుత్వ పథకాలు చేనేత కార్మికులు లబ్ధి చేకూర్చే బాధ్యత అధికారులు చూడాలని సూచించారు, కార్యక్రమంలో ప్రగతి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు నరసింహులు, చేనేత సహకార జిల్లా అధ్యక్షులు పగడాకుల, శ్రీనివాసు లు, బిజెపి ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి కెంచ్ శ్రీనివాస్, కార్యదర్శి జి భాస్కర్, గ్రామ సర్పంచ్ వెంకట్రాములు గౌడ్, ఉప సర్పంచ్ చెన్నప్ప యాదవ్, చేనేత ఏడి బాబురావు, డి ఓ రాజేష్, ఏడిఓ విజయ్ కుమార్,బిజెపి జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్, రాష్ట్ర నాయకులు రతంగ్ పాండు రెడ్డి, రఘుపాల్ రెడ్డి ల తో పాటు పెద్ద ఎత్తున చేనేత కార్మికులు పాల్గొన్నారు,



# రైతును రాజు చేయడమే మా ధ్యేయం

- సకాలంలో ఎల్లంపల్లి నీటి సరఫరా..
- త్వరలో పెండింగ్ పనులు పూర్తి
- రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కారం : ఆది శ్రీనివాస్
- రుద్రంగి మండలంలో నాగారం చెరువు కాలువ పరిశీలన



**రుద్రంగి, మార్చి 14 (జనం సాక్షి):** రైతులను రాజులుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. రుద్రంగి మండల కేంద్రంలోని గండి వెంకటేశ్వర్ల వద్ద ఎల్లంపల్లి జలాలకు పూజలు చేసిన ఆయన, అనంతరం నాగారం చెరువు కాలువలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఆది శ్రీనివాస్, రైతులకు సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా వేములవాడ నియోజకవర్గానికి నీరు విడుదల అవుతోందని, వేసవిలో రైతులకు సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. నాయకులు, అధికారులతో కలిసి కాలువను సందర్శించినట్లు తెలిపారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు ఒక మోటార్ మరమ్మతుల వల్ల కొంత ఆలస్యంగా వచ్చిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా రేవంత్ రెడ్డి సర్కార్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రైతులు రాజుగా ఉండాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. రైతులతో మాట్లాడితే వారు సకాలంలో నీరు అందుతోందని చెబుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాలలో రైతుల కోసం సుమారు 1 లక్ష 20 కోట్లు ఖర్చు చేశారని, రైతు రుణమాఫీ ఏకకాలంలో చేశామని, సన్న వడ్లకు బోనస్, మక్కలకు మద్దతు ధర ఇస్తున్నామని గుర్తు చేశారు. రుద్రంగి గ్రామంలోని నాగారం చెరువును ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పూర్తి చేశారని, 20 సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతానికి సాగునీరు రావాలని సంకల్పించామని తెలిపారు. 1737 కోట్లతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారని, మూడు రోజులుగా రుద్రంగి మండల కేంద్రానికి ఎల్లంపల్లి నీరు వస్తోందని, రైతుల పొలాలు ఎండిపోకుండా సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, ఏఎంసీ చైర్మన్ చేలకల తిరుపతి, గ్రామ సర్పంచ్ గండి నారాయణ, మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, డీసీసీ కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఎర్రం గంగ నరసయ్య, కో మీరే శంకర్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచి ఆయన రచనలు

- సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి
- కారల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించిన చాడ



**కరీంనగర్ టౌన్ మార్చి 14 (జనం సాక్షి) :** ధనిక, పేద అనే తేడా లేని దోపిడి రహిత సమాజం కోసం తన జీవితమంతా పరితపించిన వ్యక్తి కారల్ మార్క్స్, ప్రపంచ వ్యాపితంగా శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మిక వర్గానికి దిక్సూచిలాగా ఆయన రచించినలు ఉన్నాయని సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి కొనియాడారు. శనివారం సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద కారల్ మార్క్స్ 143వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,అందె స్వామి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, చిగురు మామిడి,తిమ్మాపూర్, శంకరపట్నం, మానకొండూర్,మండలాలకు కార్యదర్శులు నాగెల్లి లక్ష్మారెడ్డి,బోయిని తిరుపతి,పిట్టల సమ్మయ్య,బండ రాజిరెడ్డి,జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు గూడెం లక్ష్మి, టేకుమల్ల సమ్మయ్య,న్యాలపట్ల రాజు, కటిక రెడ్డి బుచన్న,బీర్ల పద్మ, కొట్టే అంజలి,నాయకులు కూన రవి,బాకం ఆంజనేయులు,నగునూరి రమేష్,భారతి,ఆవునూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 మార్చి 2026

# కవ్వాల్ ఫారెస్ట్‌లో చిరుతపులి మృతి

- ముగ్గురు వ్యక్తులు అరెస్ట్




**మంచిర్యాల, మార్చి14 (జనంసాక్షి) :** వన్యప్రాణుల సంరక్షణకు నిలయమైన కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. జిల్లాలోని తాళ్లపేట రేంజ్ అటవీ ప్రాంతంలో ఒక చిరుత పులి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన అటవీ శాఖ వర్గాల్లో కలకలం రేపింది. గత కొన్ని రోజులుగా అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత కనిపించకపోవడంతో అప్రమత్తమైన అటవీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తాళ్లపేట రేంజ్ పరిధిలో చిరుత కళేబరాన్ని గుర్తించారు. ఈ ఘటనపై అటవీశాఖ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇది వేటగాళ్ల పనిగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. దర్యాప్తులో భాగంగా అనుమానితుల కదలికలపై అటవీ శాఖ ప్రత్యేక బృందాలు నిఘాపెట్టారు. పక్కా సమాచారంతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి చిరుత గోర్లను స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణుల అవయవాల స్మగ్లింగ్ ముఠాతో వీరికి ఏవైనా లింకులు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం చిరుతను వేటాడం తీవ్రమైన నేరం. పట్టుబడిన నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

# అంజన్న ఆశీర్వాద యాత్రలో అపశృతి

- బండి సంజయ్ బృందంపై తేనెటీగల దాడి



**కరీంనగర్, మార్చి 14 (జనంసాక్షి) :** కేంద్ర మంత్రి బండి సంజయ్ చేపట్టిన 'అంజన్న ఆశీర్వాద' పాదయాత్రలో అనుకోని సంఘటన చోటుచేసుకుంది. రామడుగు మండలం కోనరావుపేట ప్రాంతంలో యాత్ర సాగుతుండగా డ్రోన్ కెమెరా ద్వారా ఫుటేజ్ తీసేందుకు కార్యకర్తలు ప్రయత్నించారు. ఈక్రమంలో చెట్టుకు ఉన్న తేనెతుట్టెకు డ్రోన్ తగిలింది. దీంతో ఒక్కసారిగా తేనెటీగలు పైకి లేచి దాడి చేశాయి. వెంటనే బండి సంజయ్, ఆయన సిబ్బంది అప్రమత్తమయ్యారు. తేనెటీగల దాడితో యాత్రలో పాల్గొన్న కార్యకర్తలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తేనెటీగల దాడిలో నలుగురు బీజేపీ కార్యకర్తలు గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనతో పాదయాత్రకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. అనంతరం తిరిగి మొదలైంది. బండి సంజయ్ చేపట్టిన 'అంజన్న ఆశీర్వాద' యాత్ర కరీంనగర్ నుంచి కొండగట్టు అంజన్న ఆలయం వరకు సాగనుంది. మొత్తం 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగనుంది. సాయంత్రానికి కొండగట్టుకు బండి సంజయ్ పాదయాత్రగా చేరుకోనున్నారు.

# శ్రీశైలంలో గవర్నర్ శుక్లా దంపతుల పూజలు

- రుద్రాభిషేకం, కుంకుమార్చనలో పాల్గొన్న గవర్నర్
- కన్నడ భక్తుల రాకతో కిటకిటలాడుతున్న క్షేత్రం



**శ్రీశైలం, మార్చి 14 (జనంసాక్షి) :** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను శనివారం తెల్లవారు జామున తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్‌శుక్లా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గవర్నర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గవర్నర్ దంపతులకు దేవస్థానం అర్చకులు, పండితులు వేదాశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో వారికి స్వామి అమ్మ వార్ల చిత్రపటాలను అందజేశారు. శ్రీశైల క్షేత్ర విశేషాల గ్రంథాన్ని గవర్నర్‌కు ఈవో బహూకరించారు. గవర్నర్‌గా నియమితులు అయ్యాక శుక్లా శుక్రవారం శ్రీశైలం చేరుకున్నారు. వేకువ జామునే ఆయన ఆలయం చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇదిలావుంటే శ్రీశైలంలో భారీగా రద్దీ పెరగింది. వరు సెలవులకు తోడు కన్నడ భక్తుల రాకతో శ్రీశైలం కిటకిటలాడుతోంది.

# హరీష్ రావును కలిసిన శారదాపీఠం ఉత్తరాధికారి

- ఆలయంలో ఉగాది ఉత్సవాలకు ఆహ్వానం



**హైదరాబాద్, మార్చి14 (జనంసాక్షి) :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసానికి వచ్చిన స్వామిజీ.. ఆయనకు ఆశీస్సులు అందజేశారు. అనంతరం కోకాపేట నియోపోలిస్‌లోని శ్రీ రాజశ్యామల దేవస్థానంలో ఈ నెల 19 న జరగనున్న ప్రభవ నామ సంవత్సర ఉగాది ఆస్థానం, అలాగే 27న జరగనున్న శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాల్సిందిగా హరీశ్ రావును స్వామిజీ సాదరంగా ఆహ్వానించారు. శ్రీ రాజశ్యామల అమ్మవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై మెండుగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా హరీశ్ రావు మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

# దళిత అమ్మాయికి మోసం

- ఎమ్మెల్యే పిఎ అరెస్ట్



**జయశంకర్ భూపాల పల్లి, మార్చి14 (జనంసాక్షి) :** భూపాలపల్లి ఎమ్మెల్యే పీఏ శ్రీనివాస్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఓ దళిత యువతిని ప్రేమ పేరుతో మోసం చేశాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎమ్మెల్యే కు పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్.. హనుమకొండలో పరిచయమైన చిట్యాల మండలానికి చెందిన ఓ దళిత అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. చాలాకాలంగా ప్రేమించుకోవడంతో పాటు పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అంతలోనే ఓ పోలీస్ కుటుంబానికి చెందిన అమ్మాయితో పెండ్లి సంబంధం కుదుర్చుకున్నాడు. విషయం తెలుసుకున్న బాధిత అమ్మాయి కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌పై చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్ద మనుషుల పంచాయితీలో సైతం శ్రీనివాస్ అమ్మాయితో పెండ్లికి నిరాకరించాడు. దీంతో అతడిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు అమ్మాయిని మోసం చేసిన కేసులో రిమాండ్‌కు పంపినట్టు చిట్యాల సీఐ మల్లేశ్ యాదవ్ తెలిపారు.

# ఎట్టకేలకు నిమ్జ్ నిరీక్షణకు తెర!

## 17 గ్రామాల్లోని 12600 ఎకరాల్లో ప్రాజెక్టు ఏర్పాట్లకు కసరత్తు

- రూ:10628 కోట్ల పెట్టుబడులు
- పలు కంపెనీలకు 1186 ఎకరాల భూముల కేటాయింపు
- మౌలిక వసతుల కల్పనకు కొనసాగుతున్న ముమ్మర కసరత్తు
- 14 సంవత్సరాల అనంతరం తొలి దశ పనులు
- కంపెనీల ఏర్పాటుకు త్వరలో శంకుస్థాపనలు
- కలెక్టర్ ప్రావీణ్య, నిర్మలా జగ్గారెడ్డిల చొరవతో చురుగ్గా పనులు
- నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాట్లపై 'జనంసాక్షి' ప్రత్యేక కథనం






**న్యాల్‌కల్, మార్చ్ 14 (జనంసాక్షి) :** 2013 లో 51 శాతం రాష్ట్రం, 49 శాతం మేర కేంద్ర పెట్టుబడులతో ఏర్పాటు చేసిన జాతీయ పెట్టుబడులు ఉత్పాదకమండలి (నిమ్జ్) ప్రాజెక్టు ఏర్పాటుకు 14 సంవత్సరాలు అనంతరం ఎట్టకేలకు తెర పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ యంత్రాంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిమ్జ్ ప్రాజెక్టు పనుల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన ఏర్పాటుకు శరవేగంగా చర్యలు చేపట్టింది. సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్, ఝరాసంఘం మండలాల్లోని 17 గ్రామాల్లో.. దాదాపు 12600 ఎకరాల్లో పలు పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు భూ సేకరణ చేపట్టింది. ఈనెల మార్చ్ 2న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధ్యక్షతన టిఎస్ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు మాధురి, విశాలాక్షి, జహీరాబాద్ ఆర్డిఓ దేవుజా, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, పరిశ్రమల యాజమాన్యంతో 'పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన' తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. తొలి దశలో సేకరించిన నిమ్జ్ భూముల్లో సర్వే చేపట్టి, హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో పనులను ఆపే ప్రసక్తే లేదని, పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

### మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం

ఈ పాటికే పలు పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించిన భూముల్లో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం ముమ్మరంగా పనులను చేపట్టింది. తొలి విడతగా న్యాల్ కల్, ఝరాసంఘం మండలాల్లో 3500లను గుర్తించిన భూముల్లో 3245 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు మార్చ్ తొలి వారంలో కసరత్తు చేపట్టారు. జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్డీవో, డీఎస్పీ, తహసిల్దార్లు, సీఐ, పోలీస్ బృందం రక్షణలో స్థానిక భూ నిర్వాసితులతో చర్చించి ఈపాటికే సేకరించిన భూముల్లో సర్వే చేపట్టి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. విద్యుత్తు, సీసీ రోడ్లు, నీటి సౌకర్యం, కార్మికుల కోసం షెడ్ల ఏర్పాట్లు, తదితర పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

### 1186 ఎకరాల్లో.. రూ:10628 కోట్లతో త్వరలో పరిశ్రమల ఏర్పాటు

తొలిదశ పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారంలో భాగంగా అధికార యంత్రాంగం పలు పరిశ్రమల ఏర్పాటుకు 1186 ఎకరాలను కేటాయించింది. కేటాయించిన భూముల్లో "హ్యుందాయ్" (కార్ల పరిశ్రమ) కంపెనీ ఏర్పాటు కోసం కంపెనీ యాజమాన్యం ఇటీవలే కేటాయించిన భూములను పరిశీలించింది. 511 ఎకరాల్లో రూ:1000 కోట్లతో ఈవీఎం టెక్నాలజీ సంస్థ ఈ వాటికే ఒప్పందం కుదుర్చుకుంది. తాజాగా 675 ఎకరాల్లో రూ:8528 కోట్లతో కార్ల తయారీ కర్మాగారం ఏర్పాటు కోసం త్వరలోనే శంకుస్థాపన చేయనుంది. రూ:2100 కోట్లతో ఎలక్ట్రానిక్ కార్ల తయారీకి ఈ వాటికే ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. త్వరలోనే ప్రాజెక్టుల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేసి పూర్తిచేరినట్లు తెలుస్తోంది.

### హద్దురాళ్లను తొలగిస్తే చర్యలు, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం

ఈ పాటికే పరిశ్రమల ఏర్పాటు కోసం కేటాయించిన భూముల్లో జిల్లా యంత్రాంగం సర్వే చేపట్టి హద్దురాళ్లను ఏర్పాటు చేసింది. మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం ఏర్పాటు చేసిన హద్దురాళ్లను తొలగిస్తే అట్టి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అధికార బృందానికి ఆదేశించారు. నిమ్జ్ ఆధీనంలోని భూముల్లో రైతులు సాగుచేసిన పంటలకు నష్టం కలిగించకూడదని, తప్పనిసరిగా పంటలకు నష్టం వాటిల్లితే సంబంధిత భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందించాలని కలెక్టర్ స్థానిక అధికార బృందానికి ఆదేశించినట్లు సమాచారం.

# టోలీచౌక్ ప్రాంతంలో అగ్నిప్రమాదం

- ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు
- సకాలంలో స్పందించడంతో తప్పిన ముప్పు



**హైదరాబాద్, మార్చి14 (జనంసాక్షి) :** టోలిచౌకి కుతుబ్‌షాహి సెవెన్ టూమ్స్ సమీపంలో శనివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటన స్థానికులను ఒక్కసారిగా భయాందోళనకు గురిచేసింది. రంజాన్ మాసంలో మసీదులో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో మంటలు చెలరేగడంతో అక్కడ ఉన్న వారు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. అయితే మసీదు కమిటీ, స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దాదాపు 2000 మంది ప్రార్థనలు చేస్తున్న సమయంలో ఈ ఘటన జరగడం వల్ల కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కానీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని టోలిచౌకి ప్రాంతం ఎప్పుడూ జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశం. ముఖ్యంగా రంజాన్ మాసంలో ఈ ప్రాంతంలోని మసీదులు భక్తులతో కిక్కిరిసిపోతాయి. అలాంటి సమయంలోనే కుతుబ్ షాహి సెవెన్ టూమ్స్ సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్ పక్కన ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మొదట చిన్నగా ప్రారంభమైన ఈ మంటలు కాసేపట్లోనే భారీగా ఎగిసిపడుతూ పరిసర ప్రాంతాల్లోని ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. అగ్ని ప్రమాదం విషయం తెలిసిన వెంటనే మసీదు కమిటీ సభ్యులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించారు. ముందుగా మహిళలు, చిన్నారులను సురక్షితంగా బయటకు పంపించారు. అక్కడ ఎలాంటి తొక్కిసలాటకు గురికా కుండా చర్యలు తీసుకున్నారు. మసీదు కమిటీ సభ్యులు, స్థానిక యువకులు కలిసి ప్రార్థనలు చేస్తున్న వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించడం ద్వారా పెద్ద ప్రమాదాన్ని నివారించారు. ఈ చర్యల వల్ల ఎలాంటి గాయాలు లేదా ప్రాణనష్టం జరగకుండా పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ అగ్నిప్రమాదం సబ్‌స్టేషన్ సమీపంలో జరగడంతో విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించారు. ఎలాంటి పెద్ద ప్రమాదం జరగకుండా ఉండేందుకు వెంటనే ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ చర్యల వల్ల మంటలు మరింత విస్తరించే ప్రమాదం తగ్గింది. అగ్నిప్రమాదం సమా చారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది అత్యంత వేగంగా స్పందించి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. భారీగా ఎగిసిపడిన మంటలను పూర్తిగా నియంత్ర ణలోకి తీసుకువచ్చారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీస్ అధికారులు కలిసి పరిసర ప్రాంతాలను ఖాళీ చేయించి భద్రతా చర్యలు చేపట్టారు. ఈ అగ్నిప్రమా దానికి గల అసలు కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. సబ్‌స్టేషన్ సమీపంలో విద్యుత్ సంబంధిత సమస్య లేదా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని అనుమానం వ్యక్తమవుతోంది.

# ఇంటికే భద్రాద్రి కళ్యాణ తలంబ్రాలు

- ముందస్తు బుకింగ్‌తో అధికారుల ఏర్పాట్లు
- ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా అందుబాటులో సేవలు

**భద్రాచలం, మార్చి 14 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలలో శ్రీరామనవమి ప్రధానమైనది. 'దక్షిణ అయోధ్య'గా ప్రసిద్ధి చెందిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించే కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ నవమి రోజున నిర్వహించే ఈ వార్షిక కళ్యాణ వేడుకను కళ్లారా వీక్షించేందుకు దేశ విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. రామదాసు కీర్తనలతో మార్మోగే భద్రాద్రి గిరులు, గోదావరి నది తీరాన జరిగే ఈ అద్భుత ఘట్టం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. ఈ ఏడాది మార్చి 19న ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 2 వరకు వైభవంగా సాగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా ఈసారి కళ్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలనుకునే భక్తుల కోసం టికెట్ బుకింగ్ , రాలేని భక్తుల కోసం ఇంటికే తలంబ్రాలను పంపే వినూత్న ఏర్పాట్లు కూడా సిద్ధమయ్యాయి. ఈ మహోత్సవంలో అత్యంత ముఖ్యమైన శ్రీ సీతారాముల వార్షిక కళ్యాణం మార్చి 27న జరగనుండగా, మరుసటి రోజు అనగా మార్చి 28న శ్రీరాముడి పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. భక్తులు ఈ పవిత్ర కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి ఆలయ అధికారులు ప్రత్యేక సెక్టార్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం భక్తులు భద్రాచలం దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. వెబ్‌సైట్ హోమ్ పేజీలోని 'శ్రీరామనవమి టికెట్' లింక్‌పై క్లిక్ చేసి, తమకు నచ్చిన కళ్యాణం లేదా పట్టాభిషేకం సెక్టార్‌ను ఎంచుకుని నిర్ణయించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ సదుపాయం లేని వారు మార్చి 15 నుంచి భద్రాచలం రామాలయ ప్రధాన కౌంటర్, తానీషా కళ్యాణ మండపం, గోదావరి బ్రిడ్జీ వద్ద ఉన్న దేవస్థానం విచారణ విభాగం లేదా భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం ద్వారా నేరుగా టికెట్లు పొందవచ్చు. దూర ప్రాంతాల్లో ఉండి భద్రాచలానికి రాలేని భక్తుల కోసం కూడా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ. 5,000 లేదా రూ. 1,116 టికెట్లు బుక్ చేసుకుంటే, వారి గోత్ర నామాలతో ఆలయంలో కళ్యాణం నిర్వహిస్తారు. అంతేకాకుండా, స్వామివారి ముత్యాల తలంబ్రాలను భక్తుల ఇళ్లకే చేర్చేందుకు లాజిస్టిక్స్ విభాగం ప్రత్యేక సేవలను అందిస్తోంది. రూ. 151 చెల్లించి సమీప ఆర్టీసీ కౌంటర్లలో లేదా ఆన్‌లైన్ ద్వారా తలంబ్రాలను బుక్ చేసుకుంటే, ఉత్సవాల అనంతరం వాటిని ఇంటికే డెలివరీ చేస్తారు. ఈ ఏడాది సుమారు 5 లక్షల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు, 2 లక్షల చిన్న లడ్డూలు , 3 వేలకు పైగా మహా లడ్డూలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థలు వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సు సర్వీసులను కూడా అందుబాటులోకి తెచ్చాయి.

### 17న రవాణాశాఖ మొబిలిటీ సమ్మిట్

**హైదరాబాద్, మార్చి14 (జనంసాక్షి) :** రవాణా రంగం అభివృద్ధి, విద్యుత్ వాహనాలు తదితర అంశాలపై చర్చించేందుకు హైదరాబాద్ కేంద్రంగా నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించి రవాణా శాఖ కమిషనర్, ఇతర కీలక అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 17న హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్‌లో 2వ నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో రవాణా రంగం, స్మార్ట్ మొబిలిటీ, ఎలక్ట్రిక్ వాహనాలు, నగర రవాణా అభివృద్ధి వంటి అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎలేట్స్ టెక్నోమీడియా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తెలంగాణ రవాణా శాఖ ముఖ్య భాగస్వామిగా ఉందని పేర్కొన్నారు.

### పారా అథ్లెట్ పోటీల్లో జిల్లా అథ్లెట్ల అద్భుత ప్రదర్శన

**వరంగల్, మార్చి14 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లాకు చెందిన పారా అథ్లెట్లు ఏ.లోకేష్, పి.మమత ఢిల్లీలో జరిగిన ప్రతిష్టాత్మక వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ పోటీల్లో అద్భుత ప్రదర్శనతో పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. మార్చి 11 నుంచి 14 వరకు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పోటీలు జరిగాయి. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఏ.లోకేష్ ఎఫ్-46 విభాగం) తన ప్రతిభను చాటుతూ జావెలిన్ త్రో, షాట్‌పుట్ విభాగాలలో రెండు కాంస్య పతకాలు సాధించి రాష్ట్ర ఖ్యాతిని చాటారు. పి.మమత కూడా అసాధారణ ప్రతిభ కనబరిచి షాట్‌పుట్, జావెలిన్‌త్రో విభాగాలలో రెండు కాంస్య పతకాలు సాధించారు. వారి విజయంపై క్రీడా అధికారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ విజయాలు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని వెల్లడించారు.

### మరింత దిగజారిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ, మార్చి14 (జనంసాక్షి) :** అంతర్జాతీయంగా అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్లు, రూపాయి విలువతో పాటు బంగారం, వెండి ధరలు కూడా మరింత కిందకు దిగివస్తున్నాయి. శనివారం కూడా బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడమే బంగారం, వెండి తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. శనివారం ఉదయం 10:10 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,59,660కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.1030 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,350 దగ్గర ఉంది . నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.950 మేర తగ్గింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370